అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 27-10-2023 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 296 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 8 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50



జక్కలొద్దిపై జబర్‌దస్తీ

సీపీఐ(ఎం) నాయకుల అక్రమ అరెస్టు

జెండా దిమ్మెలు కూల్చి, గుడిసెవాసులను బెదిరించి
బలవంతంగా బీఆర్‌ఎస్‌లోకి చేర్చుకున్న వైనం

- ఓటమి భయంతోనే ఈ దుశ్చర్యలు : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య
- కమ్యూనిస్టు నేతలను వెంటనే విడుదల చేయాలి : మాజీమంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ-వరంగల్
వరంగల్ రాజకీయాల్లో గురువారం రాజకీయ నాటకీయ పరిణామం చోటుచేసుకున్నది. నగరంలోని జక్కలొద్దిలో సీపీఐ(ఎం) అండతో గుడిసెలు వేసుకున్న పేదలను బీఆర్‌ఎస్ నేతలు భయభ్రాంతులకు గురిచేసి సుమారు 1500 మందిని బెదిరించి పార్టీలోకి చేర్చుకున్నారు. గుడిసెవాసుల పోరాటాలకు అండగా ఉన్న సీపీఐ(ఎం) నాయకులను అక్రమంగా అరెస్టు చేసి స్థానిక మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి కొండా సురేఖ.. అరెస్టయిన సీపీఐ(ఎం) నాయకులు మాలోతు సాగర్, ప్రత్యూష, ఓదెలుతో మాట్లాడేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని అమర్యాదగా వ్యవహరించారు. దాంతో కొండా సురేఖ నిరసనకు దిగడంతో ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ వెంటనే మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా.. ఆయనతో కొండా సురేఖ మాట్లాడుతూ.. ఎలాంటి వారెంట్ ఇష్యూ, పిటిషన్ లేకుండా సీపీఐ(ఎం) ...7లో

ఈ దాడి అనైతికం

ప్రజలను బెదిరించి ఎన్నికల్లో గెలుస్తారా?

- గుడిసెలపై బీఆర్‌ఎస్ నాయకుల దాడికి సీపీఐ(ఎం) ఖండన
- ఎర్రజెండా వారికి అండగా ఉంటుందని హెచ్చరిక
- నిందితులపై కఠిన చర్యలకు డిమాండ్
- ఎన్నికల కమిషన్ జోక్యానికి విజ్ఞప్తి

వివరాలు 7లో..

ధరణితోనే రైతుకు భూమిపై

సర్వహక్కులు

దేశానికే దిక్సూచిలా తెలంగాణ



- ఈ నేల పూల పొదరిల్లు కావాలి
- వలసల జిల్లా నుండి ప్రాజెక్టుల ఖిల్లాగా పాలమూరు
- పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తిచేసే బాధ్యత నాదే
- ఫ్లోరైడ్‌ను పట్టించుకోనోడు.. నన్ను ఛాలెంజ్ చేస్తున్నాడు
- ధన బేహార్ గాళ్లకు తగిన బుద్ధి చెప్పాలి
- ఆగమై కాదు.. ఆలోచించి ఓటేయాలి : వనపర్తి, అచ్చంపేట, మునుగోడు ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

వివరాలు 3లో



కేసీఆర్‌పై పోటీకి సై

పార్టీ ఆదేశిస్తే కామారెడ్డిలో రంగంలోకి...
బీజేపీ, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలది ఒకటే చెడ్డీ గ్యాంగ్

ఆపేయమని కాదు..నోటిఫికేషన్‌కు ముందే పథకాలకు నిధులు విడుదల చేయాలని చెప్పాం

- బీఆర్‌ఎస్‌ది తప్పుడు ప్రచారం
- కాంగ్రెస్‌ను బూచిగా చూపి చెల్లింపులు నిలిపే కుట్ర : రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో
పార్టీ ఆదేశిస్తే... కామారెడ్డిలో కేసీఆర్‌పై పోటీకి తాను సిద్ధంగా ఉన్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రకటించారు. కేసీఆర్ చెబుతున్నట్లు పాలమూరును సస్యశ్యామలం చేయడం నిజమైతే కొడంగల్‌లో తనపై పోటీకి రావాలని సవాల్ విసిరారు. కామారెడ్డిలో నేను, సిరిసిల్లలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పోటీ చేసి, కేసీఆర్, కేటీఆర్‌లను చిత్తుగా ఓడిస్తామన్నారు. ఉమ్మడి ఏపీలో ప్రజలు ఎప్పుడూ హంగ్‌కు అవకాశం ఇవ్వలేదని, తెలంగాణలోనూ హంగ్ ఎప్పుడూ రాలేదని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 2/3 మెజారిటీతో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ...7లో

అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం..



22 మంది మృతి

- నిందితుడి కోసం పోలీసుల విస్తృత గాలింపు

వివరాలు 2లో..

కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం..

దసరా పండుగకు వెళ్లి వస్తూ... 13 మంది ఏపీ వాసుల మృతి



వివరాలు 2లో..

గెహ్లాట్ కుమారుడికి ఈడీ సమన్లు

ఓటమి భయంతోనే బీజేపీ అడ్డదారులు : సీఎం



- రాజస్థాన్‌లో రాజకీయ ప్రకంపనలు



వివరాలు 2లో..

ప్రబీర్ పుర్కాయస్థకు వచ్చేనెల 2 వరకు పోలీసు కస్టడీ



అమిత్ చక్రవర్తికి కూడా..

న్యూఢిల్లీ : చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద ఒక కేసులో అరెస్టయిన న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థ, మానవ వనరుల విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిలను ఢిల్లీ కోర్టు నవంబర్ 2 వరకు పోలీసు కస్టడీకి పంపింది. న్యూస్‌క్లిక్‌కు సంబంధించిన ...7లో

ఇంటర్ ఫీజు చెల్లింపు గడువు నవంబర్ 14

ఆలస్య రుసుంతో డిసెంబర్ 20 వరకు అవకాశం : ఇంటర్ బోర్డు

- స్వల్పంగా పెరిగిన ఫీజు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2024, మార్చిలో నిర్వహించే వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు వచ్చేనెల 14వ తేదీ వరకు ఉన్నది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ (జనరల్, ఒకేషనల్) రెగ్యులర్, ఫెయిలైన విద్యార్థులతోపాటు హాజరు మినహాయింపు ఉన్న ప్రయివేటు విద్యార్థులు సైతం ఫీజు చెల్లించాలని కోరారు. ఆలస్య రుసుం రూ.100తో నవంబర్ 16 నుంచి 23 వరకు, రూ.500తో అదేనెల 25 నుంచి వచ్చేనెల నాలుగు వరకు, రూ.వెయ్యితో ఆరు నుంచి 13 వరకు, రూ.రెండు వేలతో అదేనెల 15 నుంచి 20వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశముందని పేర్కొన్నా రు. ఇంటర్ ప్రథమ సంవత్సరం థియరీ సబ్జెక్టులకు జనరల్ విద్యార్థులకు రూ.510, ఒకేషనల్ విద్యార్థులకు ...7లో

యువత మెదళ్లలో

కాషాయం నింపే కుట్ర

ఎన్‌సీఆర్‌టీ ప్రతిపాదనపై తీవ్ర వ్యతిరేకత

ఆ నిర్ణయం తగదన్న సీపీఐ(ఎం), కాంగ్రెస్

న్యూఢిల్లీ : పాఠశాల టెక్ట్స్ పుస్తకాల్లో ఇండియా పేరును భారత్‌గా ఉపయోగించాలన్న జాతీయ విద్యా పరిశోధన, శిక్షణా మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ప్రతిపాదనను కేరళ ప్రభుత్వం తిరస్కరిస్తుందని సీపీఐ(ఎం) పేర్కొంది. కేరళ సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర సిలబస్‌ను అనుసరించే పాఠశాలలు ఎన్‌సీఈఆర్‌టీ ప్రతిపాదనను అడ్డుకుంటాయని అన్నారు. సైన్స్, వాస్తవ చరిత్రను వ్యతిరేకించే సంఘ్ పరివార్ భారత దేశ గతాన్ని మార్చి యువతరం మెదళ్లలోకి చొప్పించాలని యత్నిస్తోందని అన్నారు. కేరళలోని పాఠశాల పాఠ్యపుస్తకాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 1లో సూచించిన విధంగా దేశం పేరును ఇండియాగా పేర్కొంటాయి. సంఘ్ పరివార్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన " డార్విన్ పరిణామ సిద్ధాంతం, మొఘలుల చరిత్ర, మహాత్మాగాంధీ ...7లో

కాంగ్రెస్ తోకలు కట్ చేస్తాం

ఆ పార్టీ..అన్నదాతలకు నెంబర్‌వన్ విలన్...

- 'హస్తం'పై మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఫైర్
- డిపాజిట్లు గల్లంతవుతాయని హెచ్చరిక

వివరాలు 2లో..





(ఫైల్)

వివరాలు 3లో

- గజ్వేల్, సిద్ధిపేట, సిరిసిల్ల, కామారెడ్డిలో వారి ఓట్లే కీలకం
- త్వరలో కారెక్కనున్న బిత్తిరి సత్తి
- కాసాని జ్ఞానేశ్వర్‌తోనూ గులాబీ పెద్దల మంతనాలు

ఆపరేషన్ ముదిరాజ్..

ఆ సామాజిక తరగతికి బీఆర్‌ఎస్ వల

సివిల్ సర్వీసుల్లో

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వెనకబాటు

అగ్రస్థానానికి చేరుకోలేకపోతున్న వైనం

దేశంలోనే ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్‌లో అణగారిన, వెనకబడిన వర్గాల వారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరీక్షలు ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు అగ్రస్థానానికి చేరుకోలేకపోతున్నారు. యూపీఏ హయాం నుంచి ప్రస్తుతం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు వరకు ఇదే తీరు కనిపిస్తున్నది. కాగా ఈ పరిస్థితులపై సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు సమయంలో రాహుల్ గాంధీ ఓబీసీల కోసం ప్రత్యేక కోట అంశాన్ని లేవనెత్తారు. అలాగే ఉన్నతాధికారుల్లో ఓబీసీ ఆఫీసర్లు ఎంత మంది ప్రాతినిథ్యం వహిస్తున్నారని ప్రశ్నించారు.



- పలు మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో తక్కువ సంఖ్యలో పై వర్గాల అధికారులు
- యూపీఏ నుంచి మోడీ సర్కారు వరకు ఇదే తీరు
- సామాజిక కార్యకర్తల ఆందోళన

వివరాలు 7లో

దొడ్డిదారిలో కార్పొరేట్ సేద్యం

- బేయర్, అమెజాన్‌తో ఐకార్ ఒప్పందం:

రద్దు చేయాలని కిసాన్ సభ డిమాండ్

న్యూఢిల్లీ : వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే చర్యలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముమ్మరంగా సాగిస్తోంది. మూడు చట్టా లు తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌కు ధారాదత్తం చేసేందుకు మోడీ సర్కార్ చేసిన కుట్రను మహత్తర రైతాంగ ఉద్యమంతో అన్నదాతలు తిప్పి కొట్టిన నేపథ్యంలో దొడ్డిదారి మార్గాలను కేంద్రం అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా బేయర్, అమెజాన్ కిసాన్ వంటి కార్పొరేట్ దిగ్గజ కంపెనీలతో భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఇటీవల పలు అవగాహనా ఒప్పందాలు (ఎంఓయూ)ను కుదు ర్చుకుంది. వ్యవసాయ పరిశోధన రంగాన్ని, మార్కె టింగ్‌ను గంపగుత్తగా కంపెనీలకు అప్పగించడాన్ని తక్షణమే ఉపసంహరించు కోవాలని అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) డిమాండ్ చేసింది. రైతులను నిలువునా దోపిడీ చేసేందుకు అనుకూలమైన వాతా వరణాన్ని ఏర్పాటు చేయడం ద్వారా బడా వాణిజ్య సంస్థలకు లాభాలు ఆర్జించేందుకు మోడీ ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోందని విమర్శించింది.

ఇటీవల ఐసీఏఆర్, బేయర్ (వ్యవసాయ రంగంలో బహుళజాతి బడా వాణిజ్య సంస్థ) మధ్య కుదిరిన ఎంఓయూలో ఈ విషయం స్పష్టమవుతోందని తెలిపింది. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే ప్రయత్నాలను ప్రతిఘటించాలని ఏఐకేఎస్ ప్రజలను కోరింది. ఈ ఎంఓయును ఫలితంగా ఏర్పడనున్న వ్యవస్థాగత భాగస్వామ్యాన్ని చిన్న కమతాల రైతులకు సాధికారత కల్పించేందుకు జరిగిన ప్రయత్నమంటూ ఐసీఏఆర్ ఒక బూటకపు కథనాన్ని సృష్టిస్తోందని ఏఐకేఎస్ విమర్శించింది. పంటలు, రకాలు, పంటల రక్షణ, కలుపు, యాంత్రీకరణ కోసం సమర్ధవంతమైన వనరులు , వాతావరణ పరిస్థితులకు సరిపోయే పరిష్కారాలను అభివృద్ధిపరచడం కోసం బేయర్‌తో ఒప్పందం కుదు ర్చుకున్నట్టు ఎంఓయూ పేర్కొంటోంది. అంతకు ముందు దానిమ్మ పంట సాగుపై కూడా ఐసీఏఆర్, బేయర్ మధ్య ఇలాంటి పరిశోధనా సహకార ఒప్పందం కుదిరింది. ఇటువంటి ఎంఓయూలు, సంబంధిత పత్రాలను నిశితంగా పరిశీలించి చూసి నట్లైతే, ఐసిఎఆర్‌కు గల విశ్వసనీయత, నెట్ వర్క్, వనరులను ఇందుకోసం ఉపయోగించడం ద్వారా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలోకి కార్పొరేట్ కోరలను చొప్పించేందుకు ఉద్దేశించిన ప్రయత్నంగా కనిపిస్తో ందని ఏఐకేఎస్ విమర్శించింది. కార్పొరేట్ లాభాలను గరిష్ట స్థాయికి పెంచేందుకు దొడ్డిదారిన కార్పొరేట్ అనుకూల నిరంకుశ వ్యవసాయ చట్టాలను తీసుకు రావడానికి ఇదొక ప్రయత్నమని విమర్శించింది.

ఈ కార్పొరేట్ సంస్థలు, ఐసీఏఆర్‌తో ఇటువంటి సహ కార ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల అపార అవ కాశాలు వస్తాయని, వాటితో చట్టబద్ధతను తెచ్చుకుం టారని, తద్వారా లాభాలు గడించేందుకు పెద్ద మార్కెట్‌ను ఏర్పాటు చేసుకుంటారని ఏఐకేఎస్ పేర్కొంది. అన్ని కార్పొరేట్ సంస్థలతో ఐసీఏఆర్ సంతకాలు చేసిన అవగాహనా ఒప్పందాలను కేంద్రం తక్షణమే రద్దు చేయాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది. తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వ వనరులను, సంస్థలను వాడుకోవడాన్ని నివారించా లని కోరింది. దానికి బదులుగా ఈనాడు వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొ నడానికి గానూ వ్యవసాయ పరిశోధనలకు ప్రభుత్వ నిధులను, వనరులను పెంచాలని ఏఐకేఎస్ కోరింది. రైతాంగం, శాస్త్రవేత్తలు, మేధావులు వెలిబుచ్చుతున్న ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే ప్రయత్నాలన్ని ంటినీ నిర్ద్వంద్వంగా ప్రతిఘటించాలని కోరింది.

కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం..

- దసరా పండుగకు వెళ్లొస్తూ...13 మంది ఏపీ వాసుల మృతి

చిక్‌బళ్లాపూర్: కర్నాటకలోని చిక్‌బళ్లాపూర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను టాటా సుమో వాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 13 మంది వలస కూలీలు దుర్మ రణం చెందగా.. తీవ్రంగా గాయపడిన మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మృతుల్లో 9 మంది పురుషులు, ముగ్గురు మహిళలు, ఓ బాలుడు ఉన్నట్లు చిక్‌బళ్లాపూర్ పోలీసు అధికారి నాగేశ్ తెలి పారు. దసరా పండగకు కూలీలంతా సొంతూళ్లకు వెళ్లారు. తిరిగి ఉపాధి కోసం బెంగళూరులోని హెుంగసంద్ర వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారు జామున పొగమంచు ఉండటంతో డ్రైవర్ నర సింహులు.. ఆగి ఉన్న ట్యాంకర్ గమనించకుండా ఢీ కొట్టాడు. దీంతో ఆ వాహనంలో ప్రయాణిస్తున్న 14 మందిలో ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలవగా.. 8 మంది చిక్‌బళ్లా పూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమం గా ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గెహ్లాట్ కుమారుడికి ఈడీ సమన్లు

జైపూర్: విదేశీ మారక ద్రవ్య ఉల్లంఘన (ఎఫ్ఇ ఎంఎ) కేసులో రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కుమారుడు వైభవ్ గెహ్లాట్‌కు గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఈ నెల 27న న్యూఢిల్లీలోని ఇడి ప్రధానకార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. అయితే వైభవ్ గెహ్లాట్ మరింత సమయం కోరే అవకాశం ఉందని సమా చారం. కాగా, ఈ కేసులో ఆగస్టులో జైపూర్, ఉదయ్‌పూర్, ముంబయి, ఢిల్లీల్లో ఇడి సోదాలు నిర్వహించింది. రాజ స్థాన్‌కు చెందిన ట్రిటన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్ డైరెక్టర్లు, ప్రమోటర్లు శివ శంకర్ శర్మ, రత్తన్ కాంత్ శర్మ, ఇతరులకు వ్యతిరేకంగా ఈ సోదాలు జరి గాయి. ఈ సోదాల్లో లెక్క చూపని రూ 1.2 కోట్లను ఈడీ స్వాధీనం చేసుకుంది. రత్తన్ కాంత్ శర్మకు వైభవ్ గెహ్లాట్‌కు మధ్య లావాదేవీలు ఉన్నాయని ఆరోపిస్తుంది. ఈ విషయంపైనే వైభవ్ గెహ్లాట్‌ను ఇడి ప్రశ్నించి, అతని స్టేట్‌మెంట్‌ను నమోదు చేస్తుందని భావిస్తున్నారు. గతంలో వైభవ్‌కు రత్తన్ కాంత్ ఒక కార్ రెంటల్ కంపెనీలో భాగస్వామిగా ఉన్నాడు.

పీసీసీ చీఫ్ నివాసంపై కూడా..

రాజస్థాన్ పీసీసీ అధ్యక్షులు గోవింద్ సింగ్ దోతస్రా, మహువా నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి నివాసాలపై గురువారం ఈడీ దాడులు నిర్వహించింది. శికార్, జైపూర్ లో ఉన్న గోవింద్ సింగ్ నివాసాలపై పరీక్ష పేపర్ల లీక్‌కు సంబ ంధించిన ఒక మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఈడీ దాడులు నిర్వహించింది. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మహువా నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఓం ప్రకాశ్ హుడ్లా, మరి కొందరు కాంగ్రెస్ నాయకులు నివాసాలపైనా ఈడీ దాడులు నిర్వహించింది.

కాంగ్రెస్ విమర్శలు

త్వరలో ఎన్నికలు జరిగే రాజస్థాన్‌లో కాంగ్రెస్ నాయకులపై ఈడీ దాడు లకు మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ విమర్శిం చింది. ఎన్నికలో పోరాటానికి దర్యాప్తు సంస్థల సహాయాన్ని మోడీ తీసుకుం టున్నారని ఆరోపించింది. ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన సమాధానం చెబు తారని తెలిపింది. తన కుమారుడికి ఈడీ సమన్లు జారీ చేయడంపై అశోక్ గెహ్లాట్ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే బీజేపీ కాంగ్రెస్ నాయకులను లక్ష్యంగా చేసుకుందని, దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్విని యోగం చేస్తోందని విమర్శించారు. గోవింగ్ సింగ్, ఓం ప్రకాశ్ నివాసాలపై ఫిర్యాదులు లేకుండానే ఈడీ దాడులు జరిగాయని ఆరోపించారు. 'వైభవ్‌కు బుధవారం నోటీసులు జారీచేశారు. గురువారం కార్యాలయానికి హాజరు కావా లని సమన్లు జారీ చేశారు. ఇది జోక్‌గా ఉందా?' అని గెహ్లాట్ ప్రశ్నించారు.

ఎన్‌సీఆర్టీ కమిటీ సిఫారసు అనాగరికం

- వాటిని తిరస్కరించాలి : టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇండియా పేరును భారత్ గా మార్చాలనీ, భారతీయ ప్రాచీన చరిత్ర స్థానంలో పురాణాలను చేర్చాలని ఎన్‌సీఈఆర్టీ కమిటీ చేసిన సిఫారసులు అనాగరికమని, వాటిని నిర్ద్వందంగా తిరస్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇప్పటివరకు భారతదేశాన్ని ఆంగ్లంలో ఇండియా అని పిలుస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని తెలిపారు. కానీ రాజకీయ దురుద్దేశంతో ఎన్‌సీఈఆర్టీ కమిటీ సభ్యులు రాజును మించిన భక్తిని ప్రదర్శించినట్టు కనిపిస్తున్నదని విమర్శించారు. ఇండియా అనే పదాన్ని కనుమరుగు చేయాలనే అతి ఉత్సాహం అనర్థదాయకమని పేర్కొన్నారు.

ఇలాంటి రాజకీయ ప్రేరేపిత వ్యక్తుల వల్ల విద్యారంగం సర్వనాశనం అవుతుందని వారు అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తూ, దేశ చరిత్రను ఏకపక్షం చేయాలనుకోవటం, అశాస్త్రీయ భావజాలాన్ని పాఠ్యపుస్తకాల్లో జొప్పించి విద్యార్థుల ఆలోచనా సరళిని వారికి అనుకూలంగా మార్చాలనుకోవటం తగదని హెచ్చరించారు. ఇలాంటి వ్యక్తులను కమిటీ నుంచి తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ తోకలు కట్ చేస్తాం..

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు బంధు పథకంపై కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేయటాన్నిబట్టి అన్నదాతల పట్ల ఆ పార్టీ వైఖరేంటో తేలిపోయిందని రాష్ట్ర మంత్రులు కేటీఆర్, తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. రైతులను ఆగం చేయాలని చూస్తే కాంగ్రెస్ తోకలు కట్ చేస్తామంటూ వారు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం కేటీఆర్ ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ శ్రేణులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లోనూ ఆయన ఇవే అంశాలను ప్రస్తావించారు. మరోవైపు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పటాన్‌చెరుకు చెందిన పలువురు బీజేపీ నేతలు... బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

రైతులకు ద్రోహం చేయాలని చూస్తున్న కాంగ్రెస్‌కు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరిం చారు. ఆ పథకాన్ని ఆపాలంటూ ఎన్నికల సంఘానికి లేఖ రాసిన ఆ పార్టీ... రైతు విరోధి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇంటింటికి మంచినీళ్లు.. 24 గంటల కరెంటును కూడా కాంగ్రెస్ నేతలు ఆపెయ్యమంటారేమో...' అంటూ ఎద్దేవా చేశారు. రైతులకు పెట్టుబడి సాయాన్ని అడ్డుకునే కపట కాంగ్రెస్ పార్టీ కుట్రను అన్నదాతలు సహించరు.. ఆ పార్టీ కుతంత్రాలను భరించబోరని హెచ్చరించారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసిన పాపానికి కర్నాటక రైతులు అరిగోస పడుతున్నరు.. తెలంగాణ రైతులకు కడుపునిండా కరెంట్ ఇస్తే ఓర్వలేక మూడు గంటల మోసానికి తెర తీశారంటూ విమర్శించారు. ఈ నేపథ్యంలో రైతుల పట్ల ఆ పార్టీ వైఖరిని ఎండగడుతూ ఎక్కడికక్కడ నిరసనలు చేపట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ దిష్టిబొమ్మల ను దహనం చేయాలనీ, ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులందరూ పాల్గొనాలని ఆయన ఆదేశించారు.

రాష్ట్రంలో పదకొండు సార్లు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్... రైతులకు ఒక్క పైసా సాయం చేయలేదని హరీశ్‌రావు విమర్శించారు. కానీ కేవలం రెండంటే రెండేసార్లు అధికారంలోకి వచ్చిన తమ పార్టీ పదకొండు దఫాలుగా రైతు బంధు సాయాన్ని అందించిందని ఆయన వివరించారు. ఈ పథకం కొత్తది కాదని స్పష్టం చేశారు. ఇప్పటికే రూ.75 వేల కోట్లను ఆ పథకం ద్వారా రైతులకు అందించామని గుర్తు చేశారు. అందువల్లే 69 లక్షల మంది రైతులు కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నారని చెప్పారు. అన్నదాతలతో పెట్టుకుంటే ఖబర్దార్.. డిపాజిట్లు గల్లంతవు తాయని కాంగ్రెస్ నేతలను ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ కుట్రలతో నెల రోజులపాటు పథకాలు ఆగినా మళ్లీ తాము అధికారంలోకి రాగానే వాటన్నింటినీ పునరుద్ధరిస్తా మని చెప్పారు. రైతు రుణమాఫీ కోసం ఎన్నికల సంఘానికి లేఖ రాశామని ఆయన వివరించారు.

బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ కూచుకుంట్ల రాజీనామా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల వేళ అధికార బీఆర్ఎస్‌కు దెబ్బల మీద దెబ్బలు తగులుతున్నాయి. ఎమ్మెల్సీ కూచుకుంట్ల దామోదర్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామ లేఖను సీఎం కేసీఆర్‌కు పంపారు. స్థానిక సమస్యలను పట్టించుకోక పోవడంవల్లే తాను రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం..

- 22 మంది మృతి

మైన్ : అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం రేగింది. మైన్ రాష్ట్రంలోని లెవిస్టన్ నగరంలో బుధవారం రాత్రి ఓ ఆగంతుకుడు కాల్పులకు తెగ బడటంతో 22 మంది దుర్మరణం చెందారు. సెమీ ఆటోమేటిక్ తుపాకీతో నిందితుడు ఓ బౌలింగ్ యాలీ, మరో రెస్టారెంట్‌లో విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డాడు. కాల్పుల నుంచి ప్రాణాలు కాపాడుకొనేందుకు జనం పరుగులు తీశారు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం ఈ ఘటనలో మరో 60 మంది గాయాల పాలయ్యారు. కాగా కాల్పులు జరిపినట్లు భావిస్తున్న అనుమానితుడి ఫొటోను పోలీసులు సోషల్ మీడియాలో విడుదల చేశారు. అందులో అతడు సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌తో కన్పించాడు. గతంలో యూఎస్ ఆర్మీలో పనిచేసిన ఓ రిజర్వ్ సభ్యుడిగా అనుమానిస్తున్నారు. నిందితుడిని రాబర్ట్ కార్డ్‌గా గుర్తించారు. ఇతడు మైనేలోని యూఎస్ ఆర్మీ రిజర్వ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఫైర్‌ఆర్మ్స్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసి రిటైర్ అయినట్టు పోలీసులు తెలిపారు. 40 ఏండ్ల రాబర్ట్.. గతంలో గృహహింస కేసులో అరెస్టయి విడుదలయ్యాడని పేర్కొన్నారు.

ఈ ఏడాది ఆరంభంలో అతడి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో మైనే ప్రాంతంలోని ఓ మానసిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుంటున్నట్టు వెల్లడించారు. ఈ ఘటనపై ఆండ్రోస్కోగ్గిన్ కౌంటీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. తాత్కాలికంగా స్థానిక వ్యాపార సంస్థలను మూసివేయాలని.. స్థానికులు తాత్కాలికంగా ఇండ్లలోనే ఉండాలని, ఇండ్ల తలుపులు మూసి ఉంచుకోవాలని సూచించారు.





గాడిద, ఎడ్ల బండిపై వచ్చి

నామినేషన్లు

మధ్యప్రదేశ్‌లో స్వతంత్ర అభ్యర్థుల దరఖాస్తు





భోపాల్ : ఎన్నికలు వచ్చేంతవరకూ దరిదాపుల్లో కనిపించని అభ్యర్థులు కూడా చిత్ర విచిత్రమైన రీతిలో ప్రవర్తిస్తుంటారు. ఇలాంటి దృశ్యాలు ఎన్నికల వేళ కనిపిస్తుంటాయి. తాజాగా మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్‌లోని ఒక స్వతంత్ర అభ్యర్థి తన నామినేషన్ ఫారమ్‌ను దాఖలు చేయడానికి గాడిదపై కూర్చొని ఎస్‌డీఎం కార్యాలయానికి చేరుకున్నాడు. అభ్యర్థి పేరు ప్రియాంక్ సింగ్ ఠాకూర్ అని తెలుస్తోంది. బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రజాధనాన్ని గాడిదలుగా మార్చాయని స్వతంత్ర అభ్యర్థి ఆరోపిస్తున్నారు. అలాగే బీజేపీపై తిరుగుబాటు చేసి నగ్దా ఖచ్రోడ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన లోకేంద్ర మెహతా తన మద్దతుదారులతో కలిసి ఎడ్ల బండిలో నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చారు. ఈ సమయంలో ఆయన వెంట పెద్ద ఎత్తున మద్దతుదారులు ఉన్నారు.

రూ.10 వేల నాణేలతో నామినేషన్

లెక్కపెట్టడానికి ఇబ్బందిపడ్డ అధికారులు



భోపాల్ : న్యాయవాది సందీప్ నాయక్ జనతాదళ్ యునైటెడ్ టిక్కెట్‌పై కట్నీ జిల్లా ముద్వారా అసెంబ్లీకి సిద్ధమవుతున్నారు, అయితే ఆయన నామినేషన్ ఫారమ్ తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అడ్వకేట్ సందీప్ నాయక్ నామినేషన్ ఫారమ్ కోసం ఒక్కో రూపాయి నాణేం చొప్పున పదివేల రూపాయల నాణేలతో మూట కట్టి తెచ్చారు. కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న సందీప్ నామినేషన్ కు అవసరమైన డబ్బును మూటల్లో చిల్లర ఇవ్వటంతో అధికారులు షాక్ కు గురయ్యారు. ఎలాగోలా నలుగురు కలిసి గంటపాటు శ్రమించి డబ్బుల లెక్కింపు పూర్తి చేసి నామినేషన్ ఫారం ఇచ్చి హమ్మయ్య అంటూ ఊపిరిపీల్చుకున్నారు.

రాజస్థాన్‌లో

బీజేపీకి చిక్కులు

అసమ్మతి నాయకుల తిరుగుబాటు స్వరం

టికెట్ దక్కకపోవటంతో ఆందోళనలు

బీజేపీకి ఎదురు దెబ్బ అంటున్న రాజకీయ విశ్లేషకులు

తాము ఇతర పార్టీల కంటే భిన్నమనీ, పార్టీలో భిన్నాభిప్రాయాలున్నా ఒక స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తామని బీజేపీ నాయకులు చెప్పే మాటలు. కాంగ్రెస్, ఇతర పార్టీల కంటే తమ పార్టీ గొప్పదని వారు వాదనలు వినిపిస్తుంటారు. కానీ రాజస్థాన్‌లోని బీజేపీలో పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. రాష్ట్రంలో రాబోయే ఎన్నికలకు అభ్యర్థుల జాబితాలను విడుదల చేసిన తర్వాత ఆ పార్టీలో పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయి. ఆ పార్టీ ఇప్పుడు 'విభేధాలతో కూడిన పార్టీ'గా కనిపిస్తున్నదనీ, ఆ పార్టీ నాయకులు వినిపించే 'భిన్నమైన' నినాదానికి ఇప్పుడు పెద్దగా విలువ లేదు అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అనేక స్థానాల్లో ఇదే పరిస్థితి

జైపూర్ : రాష్ట్రంలో అధికారానికి దూరమైన బీజేపీ ఇప్పుడు తమ పార్టీలోని స్వంత నాయకుల నుంచే తిరుగుబాట్లను ఎదుర్కొంటున్నది. నాయకుల నిరసన గళాలతో పోరాడుతున్నది. ముఖ్యంగా, బీజేపీ సీనియర్ నాయకురాలు, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజేను శాంతింపజేసే విషయంలో బీజేపీ విఫలమైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బీజేపీ విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో వసుంధర రాజే వర్గం వారికి మొండి చేయి ఎదురైన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేస్తున్నారు. ఈ తరుణంలో రాజే శిబిరానికి ప్రాధాన్యతనివ్వడం ద్వారా, అంతర్గత విభేదాలు తగ్గించాలనీ, టికెట్ ఆశించేవారు, వారి మద్దతుదారుల నుంచి పెరుగుతున్న తిరుగుబాటును అణిచివేయాలని బీజేపీ భావిస్తున్నదని తెలిపారు.

బీజేపీ విడుదల చేసిన రెండో జాబితా తర్వాత పలు జిల్లాల్లో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.



చిత్తోర్‌గఢ్, రాజ్‌సమంద్, ఉదయ్‌పూర్, కోట, జైపూర్, అల్వార్, బుండీలలో తిరుగుబాటు నేతల మద్దతుదారులు తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ కార్యకర్తల నిరసనలు ఈ జిల్లాల్లో ఆందోళనకరంగా మారాయి. టికెట్ నిరాకరణకు గురైన అభ్యర్థుల విధేయులు, పార్టీ అగ్ర నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేసిన పరిస్థితులు కనబడటం గమనార్హం. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సీపీ జోషి సొంతగడ్డ చిత్తోర్‌గఢ్‌లో అత్యంత తీవ్రమైన స్థాయిలో నిరసనలు చెలరేగటం గమనార్హం.

మాజీ ఉపరాష్ట్రపతి భైరాన్ సింగ్ షెకావత్ అల్లుడు నర్పత్ సింగ్ రజ్వీకి స్థానం కల్పించడానికి చిత్తోర్‌గఢ్ సిట్టింగ్ ఎమ్మెల్యే చంద్రభన్ సింగ్ ఆక్యను ఈ స్థానం నుంచి తొలగించారు. అలాగే, రజ్వీని జైపూర్‌లోని విద్యాధర్ నగర్ స్థానం నుంచి మార్చి.. అక్కడ రాజ్‌సమంద్ ఎంపీ దియా కుమారికి మొదటి జాబితాలో టికెట్ కేటాయించటం రజ్వీ వర్గానికి తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించిందని రాజకీయ విశ్లేషకులు తెలిపారు.

ఉదయపూర్‌లో నగర డిప్యూటీ మేయర్ పరాస్ సింఘ్వి తారాచంద్ జైన్‌కు టిక్కెట్‌ను బహిరంగంగా వ్యతిరేకిస్తున్నారు. బీజేపీ తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలు కోరుతుండటం గమనార్హం. జైపూర్‌లో సంగనేర్ సిట్టింగ్ ఎమ్మెల్యే అశోక్ లాహెూటీ మద్దతుదారులు ఆదివారం బీజేపీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. రాజే విధేయుడైన లాహెూటీ స్థానంలో భజన్ లాల్ శర్మను నియమించారు. బీజేపీ కార్యాలయం వద్ద లాహెూటి విధేయులు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేశారు.

పార్టీలో అంతర్గతంగా నిరసనలు చెలరేగడంతో పోరాడుతున్న వర్గాలను శాంతింపజేయడం ఇప్పుడు బీజేపీకి పెద్ద తలనొప్పిగా మారిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. చాలా ప్రాంతాలలో బీజేపీ కార్యకర్తలు తమ మాటలను ఎవరూ వినడం లేదని స్థానికంగా అనేక మంది నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్తున్నారు. రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రావాలని భావిస్తున్న బీజేపీకి ఇది పెద్ద ఎదురు దెబ్బేనని వారు తెలుపుతున్నారు.

మిజోరంలో 112 మంది అభ్యర్థులు కోటీశ్వరులే



ఐజ్వాల్ : మిజోరం శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 174 మంది అభ్యర్థుల్లో ఏకంగా 112 మంది కోటీశ్వరులే. వీరిలో అమ్ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆంద్రూ లాల్‌రెమ్కిమా పచావ్ అత్యంత ధనవంతుడు. ఆయన ఆస్తి విలువ సుమారు రూ.69 కోట్లు. అభ్యర్థుల్లో 64.4% మంది తమకు కోటి రూపాయలు, ఆపై విలువ కలిగిన ఆస్తులు ఉన్నాయని ఎన్నికల అఫిడవిట్లలో ప్రకటించారు. పచావ్ తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి ఆర్.వాన్‌లాల్‌తుంగాకు రూ.55.6 కోట్ల విలువైన ఆస్తులు, జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ అభ్యర్థి హెచ్.జంజలాలాకు రూ.26.9 కోట్ల ఆస్తులు ఉన్నాయి. సెర్‌చిప్ స్థానం నుండి పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి రామ్‌లున్-ఎడెనా తన చరాస్తుల విలువ కేవలం రూ.1,500 మాత్రమేనని అఫిడవిట్‌తో తెలియజేశారు.

రాజస్థాన్‌లో కాంగ్రెస్ మూడో జాబితా



19 మంది అభ్యర్థులు ఖరారు..

- బీజేపీ బహిష్కరణ ఎమ్మెల్యే శోభారాణికి టికెట్

జైపూర్: రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఒకదాని తర్వాత ఒకటి జాబితాలను విడుదల చేయడం ప్రారంభించింది. తాజాగా మూడో జాబితాను కూడా గురువారం విడుదల చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఇప్పటి వరకు రెండు జాబితాలను విడుదల చేశాయి. బీజేపీ రెండు జాబితాల్లో 124 మంది పేర్లు ఖరారు చేయగా, కాంగ్రెస్ 76 మంది పేర్లను ప్రకటించింది. ఇప్పుడు మూడో జాబితాలో 19 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. బీజేపీ బహిష్కరణ ఎమ్మెల్యే శోభారాణికి టికెట్ ఇచ్చారు. ఈ మూడు జాబితాలతో కాంగ్రెస్ 95 స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపింది.

ధరణితోనే రైతుకు భూమిపై సర్వహక్కులు

దేశానికే దిక్సూచిలా తెలంగాణ

- ఈ నేల పూల పొదరిల్లు కావాలి
- వలసల జిల్లా నుండి ప్రాజెక్టుల ఖిల్లాగా.. పాలమూరు
- పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తిచేసే బాధ్యత నాదే
- ఫ్లోరైడ్‌ను పట్టించుకోనోడు.. నన్ను ఛాలెంజ్ చేస్తున్నాడు
- ధన బేహార్ గార్లకు తగిన బుద్ధి చెప్పాలి
- ఆగమై కాదు.. ఆలోచించి ఓటేయాలి
- వనపర్తి, అచ్చంపేట, మునుగోడు
- ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి/సంస్థాన్‌నారాయణపురం

దేశంలో ఎక్కడా లేని విధంగా లోప భూయిష్టమైన రెవెన్యూ వ్యవస్థను ధరణితో ప్రక్షాళన చేశామని, దాంతో భూమిపై రైతులకు సర్వహక్కులు వచ్చాయని సీఎం కేసీఆర్ అన్నారు. ప్రాజెక్టులు కట్టడంతో సాగు భూములు పచ్చబడి తెలంగాణ ఆహార ధాన్యాల భాండాగారంగా వర్ధిల్లుతుందని తెలిపారు. తెలంగాణ కోసం తాను పోరాడుతున్నప్పుడు ఈ నేతలంతా ఎవరి కాళ్ల దగ్గర ఉన్నారో తెలియదని విమర్శించారు. 24 ఏండ్ల తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ప్రస్థానం ఫలితాలు ఇప్పుడిప్పుడే ప్రజలకు అందుతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ పదేండ్ల ప్రస్థానంలో అభివృద్ధి ఎల్లలు దాటిందని, పదేండ్ల కిందట తెలంగాణ ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు గుర్తుచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం కోసం తన వంత పోరాటం అయిపోయిందని, ఇక చేయాల్సింది ప్రజలేనని, ప్రజలే తమ అభివృద్ధి కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట, వనపర్తి నియోజకవర్గాల్లో, నల్లగొండ జిల్లా మునుగోడులో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొని మాట్లాడారు.

పాలమూరులో ఒకప్పుడు అంబలి, గంజి కేంద్రాలు, ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు, కరువు, వలసలు సర్వసాధారణంగా ఉండేవని, అప్పుడు ఎవరైనా వచ్చారా అని ప్రశ్నించారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత ఉచిత విద్యుత్తు, సాగునీరు, రైతుబంధు, కళ్యాణ లక్ష్మీ వంటి పథకాలు ప్రజలను ఆదుకుంటున్నాయని తెలిపారు. సాగునీరు వచ్చిన తర్వాత ప్రాజెక్టుల కింద పచ్చదనంతో పంటలు పండుతున్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారాల్లో.. ఇప్పుడున్న సంక్షేమ పథకాల కంటే అధికంగా అమలు చేస్తామని చెప్పాల్సింది పోయి.. ఉన్న సంక్షేమాలకే కోతలు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. రైతుబంధు, దళిత బంధు, ఉచిత విద్యుత్ వంటి రైతు సంక్షేమ పథకాలు దేశంలోనే కాదు ప్రపంచంలో ఎక్కడా లేవని గుర్తు చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా చారగొండలో ప్రయోగాత్మకంగా దళిత బంధును అమలు చేశామని గుర్తుచేశారు. ఎకో టూరిజం ద్వారా నల్లమల ప్రాంతంలో ఉన్న దేవాలయాలు, సుందర ప్రదేశాలను గుర్తించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు అభివృద్ధిపై సవాల్ విసరాలి కానీ దురదృష్టకరంగా కొడంగల్‌లో వచ్చి పోటీ చెయ్ లేదా గజ్వేల్‌కు వస్తానంటూ సవాల్ విసరడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో నాయకులు కాదు గెలవాల్సింది ప్రజలని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తి చేయడం ద్వారా డిండి లింకు రిజర్వాయర్ పూర్తిచేసుకుని అచ్చంపేట సస్యశ్యామలం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

తిండి గింజలను దిగుమతి చేసుకునే దశ నుంచి ఇప్పుడు నాలుగు కోట్ల టన్నుల వడ్లను ఉత్పత్తి చేసే రాష్ట్రంగా తెలంగాణ మారిందన్నారు. ఇంటింటికి తాగునీరు ఇవ్వకపోతే ఓట్లు అడగమన్న దమ్మున్న పార్టీ బీఆర్ఎస్ అని గుర్తు చేశారు. రైతుబంధు ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచుతామన్నారు.

పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తిచేసే బాధ్యత నాదే

మునుగోడు నియోజకవర్గానికి సాగునీరు తెచ్చేందుకు ప్రారంభించిన పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఏడాదిన్నరలో పూర్తిచేసే బాధ్యత నాదే అని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హామీ ఇచ్చారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని ఏడాదిన్నరలో పూర్తి చేసి రెండు లక్షల ఎకరాలకు సాగునీరు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆగమాగమై ఓట్లు వేయొద్దు.. ఆలోచించి వేయాలని సూచించారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే వెనుకటి రోజులు వస్తాయన్నారు. ధన మదంతో కొంతమంది నాకే సవాల్ చేస్తున్నారన్నారు. ధన బేహార్ గాళ్లను ఓడించాలన్నారు. పూటకో పార్టీ మార్చి మోసపు మాటలతో మోసగిస్తారని చెప్పారు. పోరాటాల చరిత్ర కలిగిన నల్లగొండ జిల్లా ప్రజలు మోసపోకుండా పనిచేసే వాళ్లనే గెలిపించాలని కోరారు. ఉప ఎన్నికల సందర్భంగా మునుగోడులో తాను ఇచ్చిన హామీల్లో 90శాతం పూర్తి చేశామని చెప్పారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం మునుగోడులో ఫ్లోరైడ్ భూతాన్ని నివారించలేకపోయిందని విమర్శించారు. "ఫ్లోరైడ్‌తో ప్రజల నడుములు వంగిపోయిన నాడు పట్టించుకోనోడు.. ఈ రోజు నన్ను ఛాలెంజ్ చేస్తున్నాడు.. రాజకీయాల్లో పనికిమాలిన వాళ్లు.. డబ్బు మదంతో ఎవరైతే పని చేసేవారుంటారో.. అలాంటి వాళ్లకు బుద్ధి చెప్పి ప్రజలు గెలవాలి" అని అన్నారు. మునుగోడులో బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఆయా సభల్లో మంత్రులు నిరంజన్‌రెడ్డి, గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థులు గువ్వల బాలరాజు, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, జెడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్‌రెడ్డి, కల్లుగీత కార్పొరేషన్ చైర్మెన్ పల్లె రవికుమార్, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, భువనగిరి జిల్లా పరిషత్ చైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వలసల జిల్లా ప్రాజెక్టుల ఖిల్లా

వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అడిగిన కళాశాల, బైపాస్ రోడ్డు పనులను ఎన్నికలు పూర్తికాగానే మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దళితులు, బీసీలు, మైనార్టీలు రైతులకు మహర్దశ వచ్చిందన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఉచిత విద్యుత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, ఏనాడూ అది వృథా ఖర్చుగా భావించలేదన్నారు. ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ధరణిని కాంగ్రెస్ వాళ్లు తొలగిస్తామనడం సిగ్గుచేటు అన్నారు. అనేక సమస్యలకు పరిష్కారాన్ని ఇచ్చిన ధరణిని తొలగిస్తామన్న కాంగ్రెస్‌ను ప్రజలే తొలగిస్తారని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేకులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ అభివృద్ధిని ఆపబోమన్నారు.

ఆపరేషన్ 'ముదిరాజ్...'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రమంతటా ఒక ఎత్తు.. 'ఆ నాలుగు నియోజకవర్గాలు మరో ఎత్తు...' అన్నట్టుంది ఇప్పుడు బీఆర్ఎస్ పరిస్థితి. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, సిరిసిల్ల, సిద్ధిపేటతోపాటు ముఖ్యమంత్రి పోటీ చేయబోయే కామారెడ్డి ఇప్పుడు గులాబీ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారాయి. తాజా రాజకీయ పరిణామాలతో ఆయా స్థానాలు కొంతలో కొంత అధికార పార్టీకి సమస్యాత్మకంగా కూడా మారినట్టు తెలుస్తోంది. 2014 నుంచి గజ్వేల్, సిరిసిల్ల, సిద్ధిపేటలో వారు ముగ్గురూ బంపర్ మెజారిటీలతో గెలుస్తూ వస్తున్నారు. కానీ ఈసారి ముదిరాజ్ సామాజిక వర్గం వల్ల ఆ మెజారిటీ భారీగా తగ్గే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. '119 స్థానాల్లో తమ సామాజిక వర్గానికి ఒక్కటంటే ఒక్క సీటు కేటాయించలేదంటూ' ముదిరాజ్‌లు బీఆర్ఎస్‌పై గుర్రుగా ఉన్నారు. అందుకే కారు పార్టీకి ఈసారి దూరంగా ఉండాలంటూ వారు తీర్మానాలు చేస్తున్నారు. ఇదే జరిగితే సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌ల మెజారిటీ కచ్చితంగా తగ్గే అవకాశాలున్నాయి. ఎందుకంటే ముదిరాజ్ సామాజిక తరగతి ఓట్లు గజ్వేల్‌లో 60 వేలు, సిద్ధిపేటలో 45 వేలు, సిరిసిల్లలో 40 వేలు, కామారెడ్డిలో 30 వేల దాకా ఉన్నాయి. ఇవి ఇప్పుడు కీలకంగా మారనున్నాయి.



ఈ అంశాన్ని బీఆర్ఎస్ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. ముదిరాజ్‌ల ఓట్లతోపాటు గజ్వేల్‌లో బీజేపీ నుంచి పోటీ చేయబోతున్న ఈటల రాజేందర్ రూపంలో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు వ్యూహాలు పన్నుతోంది. ఆ సామాజిక తరగతి దూరమవుతున్న విషయాన్ని గమనించి నష్ట నివారణా చర్యలను చేపట్టింది. అందులో భాగంగా ఓ ప్రయివేటు ఛానెల్‌లో బిత్తిరి సత్తిగా అందరికీ సుపరిచితుడైన చేవెళ్ల రవికుమార్‌ను పార్టీలోకి ఆహ్వానించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆయన్ను గురువారం ప్రగతి భవన్‌కు పిలిపించుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్... సత్తితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన త్వరలోనే ఆ పార్టీలో చేరటం ఖాయంగా కనిపిస్తోంది. సత్తితో పాటలు రాయించటం, పాడించటం, బహిరంగ సభల్లో మాట్లాడించటం ద్వారా ఆ సామాజిక తరగతిని ఆకట్టుకోవాలన్నది గులాబీ పెద్దల వ్యూహంగా కనబడుతున్నది. ఇక్కడ ఈటల రాజేందర్, బిత్తిరి సత్తి సామాజిక వర్గం ఒక్కటే కావటం విశేషం. అయితే ఇదే సత్తి... కొద్ది రోజుల క్రితం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించిన ముదిరాజ్ మహాగర్జన సభలో బీఆర్ఎస్‌ను, సీఎం కేసీఆర్‌ను తీవ్ర స్థాయిలో విమర్శించటం గమనార్హం.

మరోవైపు ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేయాలా..? వద్దా..? అనే మీమాంసలో ఉన్న తెలంగాణ టీడీపీ బలహీనతను కూడా తనకు అనుకూలంగా మార్చుకునేందుకు సీఎం కేసీఆర్ వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్టు వినికిడి. తెలంగాణ టీడీపీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గులాబీ గూటికి రప్పించటం ద్వారా... దూరమైన ఆ సామాజిక వర్గాన్ని దగ్గరకు తెచ్చుకోవచ్చని ఆయన భావిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే కాసానితో కేసీఆర్ చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. శుక్రవారం రాజమండ్రి సెంట్రల్ జైలు వద్ద చంద్రబాబుతో భేటీ కానున్న జ్ఞానేశ్వర్... ఆయన చెప్పేదాన్నిబట్టి తుది నిర్ణయం తీసుకుంటారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. 'ఎన్నికల్లో పోటీ చేయాలని చంద్రబాబు ఆదేశిస్తే... కాసాని టీడీపీలోనే ఉంటారు, ఒకవేళ వద్దని అంటే మాత్రం కచ్చితంగా కారెక్కుతారు...' అని ఆయా వర్గాలు వివరించాయి. కాగా తెలంగాణ టీడీపీ వర్గాలు మాత్రం 'అదంతా అసత్య ప్రచారం...' అని కొట్టి పారేశాయి. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే మామిళ్ల రాజేందర్, అంబర్‌పేట శంకర్ తదితరులను పార్టీలోకి చేర్చుకోవటం ద్వారా ముదిరాజ్‌ల ముప్పు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్... తాజాగా మత్స్య అభివృద్ధి ఫెడరేషన్ ప్రతినిధులతోనూ, దాని చైర్మెన్ పిట్టల రవీందర్‌తోనూ సుదీర్ఘ చర్చలు జరిపింది. దాంతోపాటు శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్ సారధ్యంలో ఆయా తరగతుల ప్రతినిధులతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంతనాలు కొనసాగించారు. ఇవన్నీ ఏ మేరకు సత్ఫలితాలనిస్తాయో చూడాలి.



ఓ అబద్ధాన్ని వందసార్లు చెబితే అది నిజం అవుతుందా?

- బీఆర్ఎస్ నేతలకు గౌరీ సతీష్ ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీపై మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత హేళనగా మాట్లాడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ విమర్శించారు. ఓ అబద్ధాన్ని వందసార్లు చెబితే అది నిజమవుతుందా? అని ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో హర్షవర్ధన్‌రెడ్డి, రియాజ్, సంధ్యారెడ్డి, నిజాముద్దీన్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ నాయకులకు రాజకీయ బిక్ష పెట్టిందని గుర్తు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలను మరోసారి మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నభిన్నం చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక పాలనను రాష్ట్ర ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. అధికార ప్రతినిధి భవానీ రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కనీసం వార్డ్ మెంబర్ కాని హరీశ్‌రావును కాంగ్రెస్ మంత్రిని చేసిందని తెలిపారు. కాళేశ్వరం పిల్లర్స్ కుంగిన విషయంపై చర్చ జరుగుతుంటే, దాన్ని పక్కదారి పట్టించేందుకు కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంపాదకీయం

చైనా అణ్వాయుధ ముప్పు నిజమేనా!

వర్తమాన దశాబ్ది చివరికి చైనా వెయ్యి అణ్వాయుధాలను సమకూర్చుకోనుందని అమెరికా రక్షణశాఖ నివేదికలో జోస్యం చెప్పింది. ఒకవైపు చైనా ఆర్థికంగా కుప్పకూలనుందంటూ తేదీలను చెబుతూ గతంలో అనేక నివేదికలను వెల్లడించి కమ్యూనిస్టు వ్యతిరేక జనాల బుర్రలను మరింత ఖరాబు చేశారు. ఇప్పుడు ప్రపంచానికి బూచిగా చూపేందుకు అణ్వస్త్రాల గురించి చెబుతున్నారు. చైనా దగ్గర అణ్వాయుధాలు ఉన్నాయన్నది జగమెరిగిన సత్యం. గతంలో సోవియట్ యూనియన్–

నిజంగా చైనా అణ్వాయుధాలను పెంచుకుంటే తమకెలాంటి ఆందోళన లేదని పెంటగన్ నివేదిక మీద రష్యా స్పందించింది. సర్వసత్తాక దేశంగా చైనాకు ఆత్మరక్షణ హక్కు ఉన్నదని కూడా స్పష్టం చేసింది. అసలు అమెరికా ఏడుపు, ఆందోళన ఏమిటంటే ఇటీవలి కాలంలో చైనా ఆయుధ రంగంలో చేసిన పరీక్షల వివరాలను పసిగట్ట లేక మల్లగుల్లాలు పడుతోంది. ఉక్రెయిన్‌పై సైనిక చర్యలో రష్యా ప్రయోగిస్తున్న ఆధునిక హైపర్‌సోనిక్ క్షిపణులు చైనా నుంచి తెచ్చుకున్నవే అని అనుమానిస్తున్నారు.

అమెరికా తమ దగ్గర ఉన్న కొన్ని ఆయుధాలను నిర్వీర్యం చేస్తామని ప్రకటించటం తప్ప నిజానికి ఏ దేశం దగ్గర ఎన్ని ఆయుధాలు ఉన్నాయన్నది అధికారికంగా చెబితే తప్ప ప్రచారంలో ఉన్న అంకెలన్నీ అంచనాలే. జనానికి జ్ఞాపక శక్తి తక్కువ గనుక తామేం చెబితే దాన్ని గుడ్డిగా నమ్ముతారని అమెరికా అనుకుంటున్నది. 2020 నివేదికలో చైనా దగ్గర 200లోపు అస్త్రాలు ఉన్నట్లు, 2030 నాటికి రెట్టింపు చేస్తారని పేర్కొన్నది. 2021 నివేదికలో 2027 నాటికి 700కు పెంచుతుందని, 2030నాటికి వెయ్యికి చేరుస్తుందని రాసుకున్నారు. ఇవన్నీ చైనా మిలిటరీ శక్తిగా ఎదుగుతోంది జాగ్రత్త అని ఇరుగు పొరుగుతో పాటు ప్రపంచ దేశాలను ఆయుధ పోటీకి ప్రోత్సహించే ఒక వ్యూహంలో భాగమే. ఎందుకంటే ప్రపంచ ఆయుధతయారీ, పెద్ద ఎగుమతిదారు అమెరికా గనుక.

స్టాక్‌హోం అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ (సిప్రి) వెల్లడించిన అంచనా ప్రకారం ఈ ఏడాది జనవరి నాటికి ప్రపంచంలో 3,844 అణ్వాయుధాలను మోహరించగా వాటిలో అమెరికా 1,770, రష్యా 1,674,ఫ్రాన్స్ 280,బ్రిటన్ 120 ఉన్నాయి. ఒక్క బాంబును కూడా మోహరించని చైనాతో తమకు, ప్రపంచానికి ముప్పు వచ్చిందని అణ్వాయుధాల గుట్టమీద కూర్చున్న అమెరికా చెబితే జనాలు నమ్మాలి. పాతబడిన వాటిని ధ్వంసం చేయగా ప్రస్తుతం మొత్తం తొమ్మిది దేశాల వద్ద మోహరించినవి, సిద్ధం చేసుకున్నవి అన్నీ కలిపి 12,512 ఉన్నాయి. వాటిలో రష్యా 5,889, అమెరికా 5,244, చైనా 410,ఫ్రాన్స్ 290,బ్రిటన్ 225, పాకిస్తాన్ 170, భారత్ 164, ఇజ్రాయెల్ 90, ఉత్తర కొరియా 30 కలిగి



ఉన్నట్లు సిప్రి చెప్పింది. అణ్వాయుధాలు ప్రపంచానికి ముప్పు అన్నది నిజం, ముందుగా ఎవరు మీట నొక్కినా కొద్ది క్షణాల్లో ఇతరులు కూడా అదేపని చేస్తారన్నది కూడా తెలిసిందే. అదే జరిగితే ప్రపంచం మిగలదు.

నిజంగా చైనా అణ్వాయుధాలను పెంచుకుంటే, తమకెలాంటి ఆందోళన లేదని పెంటగన్ నివేదిక మీద రష్యా స్పందిం చింది. సర్వసత్తాక దేశంగా చైనాకు ఆత్మరక్షణ హక్కు ఉన్నదని కూడా స్పష్టం చేసింది. అసలు అమెరికా ఏడుపు, ఆందోళన ఏమిటంటే ఇటీవలి కాలంలో చైనా ఆయుధ రంగంలో చేసిన పరీక్షల వివరాలను పసిగట్ట లేక మల్లగుల్లాలు పడుతోంది. ఉక్రెయిన్‌పై సైనిక చర్య లో రష్యా ప్రయోగిస్తున్న ఆధునిక హైపర్‌సోనిక్ క్షిపణులు చైనా నుంచి తెచ్చుకున్నవే అని అనుమానిస్తు న్నారు. వాటి తయారీలో చైనా అగ్రస్థానంలో ఉందని అమెరికా రక్షణశాఖ నిపుణులే చెబుతున్నారు. ధ్వని కంటే ఎన్నో రెట్లు వేగంగా ఆ క్షిపణులు ప్రయాణిస్తాయని, వాటిని పసిగట్టటం, నిరోధించటం అంత తేలిక కాదని అంచనా. ఇటీవల ఉక్రెయిన్ మీద రష్యా ప్రయోగించిన కింఝాల్ క్షిపణి గంటకు 12,348 కిలోమీటర్ల వేగంతో రెండువేల కిలోమీటర్లు ప్రయాణిం చగలదని అమెరికా అంచనా వేసింది. తమ వద్ద గంటకు పాతికవేల కిలో మీటర్ల వేగంతో పదివేల కిలోమీటర్లు వెళ్లే క్షిపణులు న్నట్లు రష్యా చెప్పింది. అలాంటివి చైనా వద్ద కూడా ఉన్నట్లు అమెరికా భయపడుతోంది. చైనా అమ్ముల పొది లో నిర్ణీత లక్ష్యాన్ని ఛేధించే జలాంతర్గామి అణుక్షిపణులు కూడా చేరాయని పెంటగన్ ప్రత్యేకంగా పేర్కొన్నది. ఒకటి స్పష్టం, ఆయుధ పోటీ ప్రపంచానికి ముఖ్యంగా వర్ధమాన దేశాలకు ఎంతో నష్టం. అమెరికా నుంచి తలెత్తుతున్న ముప్పును తప్పించుకోవాలన్నా, దాన్ని నిరో ధించాలన్నా ఆయుధాలు సమకూర్చుకోక తప్ప దన్నది తిరుగులేని వాస్తవం. ఇతర దేశాలన్నీ తమ మీద కుట్ర చేస్తున్నట్లు, ముప్పు తలపెట్టి నట్లు స్వజనాన్ని నమ్మించటం అమెరికా నిత్యకృత్యాలలో ఒకటి. ఆ పేరుతో అన్ని ఖండాలలోని 80 దేశాలలో 800కు పైగా చిన్నా, పెద్ద సైనిక కేంద్రాలను ఏర్పాటు చేసింది. అంటే ఎక్కడికైనా కొద్ది గంటల్లోనే తన మిలిటరీని దింపగలదు. చరిత్రలో ఇంత వరకు అమెరికా మీద దాడి చేసిన దేశం ఒక్కటంటే ఒక్కటీ లేదు. బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన తరువాత 1,776 నుంచి ఇప్పటివరకు అమెరికా 68 దేశాల మీద దాడి చేసింది.అందువలన ముప్పు అమెరికా నుంచి రావాలి తప్ప మరొకదేశం నుంచి వచ్చే అవకాశమే లేదు.

'అర్థ విధవలు'

వారి భర్తలు ఏ అగ్రరాజ్యపు చెరసాలల్లో మగ్గుతున్నారో తెలియదు, ఏ ఉగ్రవాదపు శిబిరాల్లో నెగ్గ జూస్తున్నారో తెలియదు, పేలిన ఏ తూటాకు మట్టి పొరల్లో కప్పేయబడ్డారో తెలియదు... కానీ కఠిన మంచు కొండలు కరిగి మట్టి పరిమళం ఎప్పటికైనా తమది కాదా అని దశాబ్దాల నిరీక్షణలో దీనులైన కాశ్మీరీ మహిళలే అర్ధ విధవలుగా పరిగణింపబడుతున్నారు. భర్తల సమాచారము తెలవని స్థితిలో సమాజము అంగీకరించకా, రాజ్యము నిర్ధారించకా అర్ధ విధవలుగా మారిన ఇలాంటి వారెందరున్నారో కూడా లెక్కలు లేవు. "అర్ధ విధవలు" అని వినడం ఆశ్చర్యంగా ఉంది. కానీ దీనిపై క్రమం తప్పని పెద్ద పెద్ద పరిశోధనలే జరుగుతున్నవి. అట్లాంటి పరిశోధనలలో భాగమైన కాశ్మీరీ జర్నలిస్టు శాఫియా నబి నిరంతర శ్రమ ప్రతిష్టాత్మకమైన "మహారాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ – వరల్డ్ పీస్ యూనివర్సిటీ" వారు నిర్వహించే జర్నలిజం స్కూల్ అవార్డుకు ఎంపికైంది. అయితే వాస్తవాలు మింగుడు పడని కొందరు మితవాదులు సదరు యూనివర్సిటీపై ఒత్తిడి తెచ్చి కాశ్మీరీ జర్నలిస్టు శాఫియా నబీకి ప్రకటించబడిన అవార్డును ఆమెకు అందజేయకుండా చేశారు. ఒక జర్నలిస్టుకు ప్రకటించబడిన అవార్డును కొన్ని ప్రతిఘాత శక్తులు తమ మితవాదపోకడలతో అడ్డుకోవడం శోచనీయమే కావచ్చు కానీ సదరు జర్నలిస్టు వెలికితీసిన వాస్తవాలను జీర్ణించుకోలేక, వాటిని ప్రపంచానికి చేరనీయకుండా చేయడం మరింత కలవరపెట్టే అంశం. ఇలాంటి దుందుడుకు వైఖరిని వాస్తవాలను బయటికి తెచ్చే జర్నలిస్టులపై దాడిగానే కాకుండా సమాజ నిర్లక్ష్యానికి గురవుతున్న అభాగ్యుల జీవితాల పట్ల బాధ్యతాలేమిని తెలియజేస్తోంది.



శాఫియా నబీ




శాఫియా నబి ప్రచురించిన కథనం ఏమిటి?

స్క్రోల్ పోర్టల్ ద్వారా శాఫియా నబి కాశ్మీర్‌కు సంబంధించిన కొన్ని పరిశోధనలను ప్రస్తుతించింది. కాశ్మీర్లో నివసిస్తున్న మహిళలు అనేక కారణాల వల్ల తమ భర్తలు ఏండ్ల తరబడి ఇంటికి రాక పోవడంతో యాజమాన్య హక్కులు ఎవ్వరికివ్వాలనే దానిపై సందిగ్ధత ఏర్పడుతున్నది. భర్తలకు దూరమైన స్త్రీలకు ఆస్తిపాస్తులపై ఎలాంటి హక్కులు సక్రమించడం లేదు. దూరమౌతున్న పురుషులు ఏమౌతున్నట్లు? కొందరు మగవాళ్ళను ఉగ్రవాదులుగా అనుమానించి పోలీసులు లేదా మిలిటరీ వాళ్ల తీసుకెళ్లిపోవడం, కేసు నమోదుతో సంబంధం లేకుండా విచారణల్లో ఏమౌతున్నారో తెలియట్లేదు. అధికారులు బంధిస్తున్న ఆనవాళ్ళు కూడా దొరకడం లేదు. మరికొందరిని ఉగ్రవాదులే చెరబట్టి, ఉగ్రవాద సంస్థల్లో బలవంతంగా చొప్పించడం, ఆ తరువాత ఇంటికి దూరమవడం జరుగుతుంది. మరికొంతమంది అనేక ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోవడం, ఆచూకీ తెలపకపోవడం వల్ల భర్తల క్షేమ సమాచారం తెలియని అనేకమంది అభాగ్యులు ఎదురుచూస్తూ ఉంటారు. దశాబ్దాలు గడిచినా ఇలాంటి మహిళలకు ఆస్తిపాస్తులపై హక్కులు గాని వార సత్వ సంక్రమణలు గాని ఇవ్వడానికి ప్రభుత్వాలు, సమాజమూ ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. దానితో దిక్కుతోచని విధంగా ఈ మహిళలందరూ తనువు చాలిస్తున్నారు. భర్త ఉన్నాడో లేడో తెలియకుండా చాలీచాలని బతుకులీడుస్తున్న ఇలాంటి మహిళలం దరినీ "హాఫ్ విడోలు" అర్ధ విధవలుగా నబి తన కథనంలో అభివర్ణించారు.

అవార్డు రద్దు..

నబి ప్రచురించిన "హాఫ్ విడోస్ ఆఫ్ కాశ్మీర్" అనే కథనాన్ని ఏడుగురు సభ్యులున్న "మహారాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ – వరల్డ్ పీస్ యూనివర్సిటీ" జ్యూరీ అవార్డుకు ఎంపికైంది. అక్టోబర్ 18న బహుమతి ప్రదానం జరుగనున్నదని రచయితకు పది రోజుల ముందే సమాచారమూ ఇచ్చారు. తీరా ఒకరోజు ముందు యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ నుండి ఫోన్ చేసి "కొన్ని ఒత్తిళ్ళ కారణంగా బహుమతి ప్రదానం రద్దు" చేస్తున్నట్లుగా సమాచారమిచ్చారు. రద్దుకు గురిచేసిన అంశాలను పరిశీలించినప్పుడు తెలిసేదేమంటే, రచయిత మతమో లేక జరుగుతున్న అన్యాయానికి గురైన మహిళల మతమో అనుకుంటే అది కొంతవరకే కరెక్టు! పాలకుల వైఫల్యాలకు ప్రతిఫలంగా అవార్డు ఇచ్చినట్లౌతుందన్న భావనతోనే ఈ అవార్డును తిరస్కరించారనేది స్పష్టమౌతుంది. అయితే జర్నలిస్టులను వేధిం చడం భారతదేశంలో కొత్త కాదు. గత తొమ్మిది సంవత్సరాల్లో వేధిం చబడిన జర్నలిస్టుల సంఖ్య మరింత పెరుగుతుంది. 1990 నుండి 2658 విలేకర్లు హత్యగావింపబడితే ఒక్క 2022లో 67 మంది జర్నలిస్టులు హత్యజేయబడ్డారు. అందుకే 2023 సంవత్సరానికి గాను ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్‌లో భారత్ 161/180 స్థానాన్ని పొందింది. అయితే నేడు మన ముందు రెండు సవాళ్ళున్నవి. అవి ఏమంటే, ఇలాంటి అర్ధ విధవలు ఈ దేశంలో పలు చోట్ల, పలు కారణాల చేత ఇంకెందరున్నారో, వారి భవిష్యత్తేమిటోనన్నది, ప్రాచుర్యానికి నోచుకోని ఇలాంటి కథనాలూ, వాటిని బహిర్గత పరుస్తున్న విలేకర్లు కూడా ఎందరున్నారో? కేవలం కాశ్మీరులోనే కాదు అనేక ప్రాంతాల్లో ప్రతి యేటా అనేకమంది అక్రమ అరెస్టులకు గురౌతున్నారు. వాటిల్లో చాలావరకు కిడ్నాపులుగా నమోదౌతున్నవి. 'ఉపా' కింద అరెస్టైన ఆనంద్ తేల్‌తుంబ్డే, సాయిబాబా వంటి వారి కుటుంబాల పరిస్థితులూ అంతే! చేయని నేరాలకు జైలు జీవితం గడుపుతున్న వారు, నేరం మోపబడిన వారూ జైళ్ళల్లో ఉన్న సంగతి తెలిసినప్పటికీ వారి కుటుంబాలు అనాథలుగానే బతుకీడుస్తుంటారు. దీనిపై రాజ్యం దృష్టి లేదని చెప్పలేము అంతే కాకుండా రాజ్యం ఇలాంటి వాటిని బలపరుస్తున్న సంకేతాలు కూడా వున్నవి.



– జి.తిరుపతయ్య, 9951300016

ఈ ద్వేషభక్తి గేయం : దేశానికి చేస్తున్న గాయం!

ఈ దేశంలోని ప్రతి పౌరుడూ తప్పక తెలుసుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి – 1931లో విప్లవ వీరుడు భగత్‌సింగ్ పక్షాన తీవ్రంగా వాదించిన న్యాయవాది – ఆసఫ్ అలీ. భగత్‌సింగ్‌ను శిక్షించడానికి నిరాకరించి, తన జడ్జీ పదవికి రాజీనామా చేసిన జస్టిస్ – సయ్యద్ ఆగా హైదర్. ఇకపోతే భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష విధించిన జడ్జీ – రాయ్ సాహిబ్ పండిట్ శ్రీ క్రిషన్. నరనరాన ఆరెస్సెస్ భావజాలం నింపుకున్న వ్యక్తి. ఈ వివరాలు తెలుసుకున్న తర్వాత, లేదా గుర్తు చేసుకున్న తర్వాత ఎవరు దేశభక్తులు, ఎవరు దేశద్రోహులు. అనే విషయం విజ్ఞత గల ఈ దేశపౌరులు పూర్తిగా అర్థం చేసు కుంటారు. ముస్లిం అయినంత మాత్రాన ద్వేషించాలని, హిందువులంతా బంధువులేనని అనుకోక తప్పదా? భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నది ఎవరు? పాల్గొనని వారెవరు? తెలుసుకోనక్కరలేదా? ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు ప్రచారం చేస్తున్న విద్వేష భక్తి గేయాలు పాడుకోవల్సిందేనా? నిజానిజాలు తెలుసుకునే పనిలేదా? మండిపోతున్న మణిపూర్ లాగా దేశమంతా కావల్సిందేనా? గౌరవనీయులైన మూర్ఖుల సంఖ్య పెరుగుతున్నప్పుడు, సామాన్య పౌరులు తమ వివేకాన్ని నిద్రలేపాలి. ప్రతి చిన్న విషయాన్నీ హేతుబద్ధంగా విశ్లేషించుకుంటూ ముందుకు సాగాలి. మనది ప్రజాస్వామ్య దేశం! మనుషులంతా ఒక్కటి!! ఈ రెండు విషయాలకు కట్టుబడి మాత్రమే – నిజాయితీగా నిబద్ధతతో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.



డాక్టర్ దేవరాజు మహారాజు

తాము సనాతన ధర్మాన్ని గౌరవించేవారిమని, దాన్ని వ్యతిరేకించే వారి వ్యాఖ్యలు తమ మనోభావాల్ని గాయపరుస్తున్నాయని, ఆ వ్యాఖ్యలు చేసే వారిని కఠినంగా శిక్షించాలని మాజీ న్యాయమూర్తులు, మాజీ ఉన్నతాధికారులు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. అలాంటి లేఖ రాసిన వారికి అసలు సనాతనమంటే ఏమిటన్నది అవగాహన ఉందా లేదా అని అనుమానం వస్తుంది. సనాతనమంటే – అసమానత, సనాతనమంటే – అస్పృశ్యత, సనాతన మంటే – కులవివక్ష, సనాతనమంటే బలులు, యజ్ఞయాగాలు, బాల్య వివాహాలు, సతీ సహగమనం, దళితుల సజీవ దహనం, సనాతనమంటే– సమాజపు సగభాగపు అణచివేత. ఆధిపత్య హింస, శ్రామికుల పీడన. సనాతనమంటే – నిచ్చెన మెట్ల వ్యవస్థ. సనాతనమంటే– వర్తమానాన్ని గతం అజమాయిషీ చేయడం, సనాతనమంటే– భవిష్యత్తుకు అవరోధం. ఏ కొందరి మనోభావాలో దెబ్బతింటాయంటే, వారు తప్పక వారి ఆలోచనా సరళిని మార్చుకోవాల్సి ఉంటుంది. పైన చెప్పినవన్నీ నిజాలే కదా? నిజాలు కాదు, అబద్ధాలు అని– ఎవరైనా నిరూపించదలిస్తే నిరూపించిన తర్వాత మాట్లాడాలి. సమకాలీనంలో కూడా సనాతనం చేసే అనర్థాలేలా ఉంటాయో చూడండి. ఎప్పుడో మొదలైన కుంభమేళాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి కదా?

లోక కళ్యాణం గురించి, ప్రశాంత జీవన మార్గం గురించి, సత్ప్రవర్తన గురించి జనానికి బోధలు చేసే సన్యాసులు, సాధువులు, బైరాగులు యుద్ధాలకు దిగడం ఏమైనా బావుందా? అంటే వారు - సర్వసంగ పరిత్యాగులుగా వేషం మార్చారే గాని, తమలోని అహాన్ని జయించలేక పోయారని మనకు అర్థమౌతుంది. అలాంటి వారి నుండి సామాన్యులు నేర్చుకునేది ఏముంటుందీ? వారిని అని లాభం లేదు. సామాన్యులే వాస్తవాలు గ్రహించాలి. అలాంటి సన్యాసులు దొంగయోగులు సమాజానికి కాదు కదా, వారికి వారే ఉపయోగం లేనివారు. అలాంటి వారిని సామాన్యులు నమ్మకూడదు. వారి బూటకపు ఆధ్యాత్మికతకు ప్రభావితులు కాకూడదు.

1760–హరిద్వార్ కుంభమేళాలో శైవులైన గోసాయిన్లకు వైష్ణవులైన బైరాగులకు మధ్య కలహాలు చెలరేగి ఇరువైపులా వందల సంఖ్యలో మర ణాలు సంభవించాయి. మరాఠా పీష్వాల నాటి ఒక రాగి ఫలకం – మరికొన్ని భయం కరమైన విషయాలు వెల్లడించింది. 1789లో నాసిక్ కుంభమేళాలో సుమారు 12 వేల మంది మర ణించారు. కారణం శైవులు – వైష్ణవులు హోరా హోరీగా పోట్లాడుకుని, కోపాలు, రోషాలు చల్లా రక చంపుకోవడం దాకా వెళ్ళింది. మేమంటే మేం – ముందు స్నానం చేయాలని గొడవపడి, అది పెద్దదై శత్రువుల్లాగా ఒకరినొకరు చంపుకు న్నారు. ఇరుపక్షాలవారు కలిసి మొత్తం 12వేల మంది పుణ్య స్నానాల పేరుతో ప్రాణాలు త్యాగం చేశారు. మతం పిచ్చి తలకెక్కితే అంతే! అలాగే మరికొంత కాలానికి 1796 – హరిద్వార్ కుంభమేళాలో మరోసారి హింస చెలరేగింది. ఉవులకు, ఉదాసీలకు మధ్య సామాను రవాణాకు సంబంధించి, వారి వారి హక్కులకు సంబంధించి సహనం కోల్పోయిన భక్తు లు యుద్ధవీరులై పోయారు. భక్తులు మానవత్వం మీద చెరగని మచ్చలుగా మిగిలారు తప్పితే, మత కలహాలతో ఎవరైనా ఎప్పుడైనా ఏమైనా పొంద గలిగారా?

లోక కళ్యాణం గురించి, ప్రశాంత జీవన మార్గం గురించి, సత్ప్రవర్తన గురించి జనానికి బోధలు చేసే సన్యాసులు, సాధువులు, బైరాగులు యుద్ధాలకు దిగడం ఏమైనా బావుందా? అంటే వారు – సర్వసంగ పరిత్యాగులుగా వేషం మార్చారే గాని, తమలోని అహాన్ని జయించలేక పోయారని మనకు అర్థమౌతుంది. అలాంటి వారి నుండి సామాన్యులు నేర్చుకునేది ఏముంటుందీ? వారిని అని లాభం లేదు. సామాన్యులే వాస్తవాలు గ్రహించాలి. అలాంటి సన్యాసులు దొంగ యోగులు సమాజానికి కాదు కదా, వారికి వారే ఉపయోగం లేనివారు. అలాంటి వారిని సామాన్యులు నమ్మకూడదు. వారి బూటకపు ఆధ్యాత్మికతకు ప్రభావితులు కాకూడదు. అలాంటి వారిని దూరం పెట్టాలి. సమాజ శ్రేయస్సుకు పాటుపడిన మహనీయుల గూర్చి తెలుసుకుంటూ ఉండాలి. వారి మార్గంలో నడవడానికి ప్రయత్నిస్తూ ఉండాలి. దైవమే లేనప్పుడు దైవం పేరు చెప్పి, సంస్కృతి సంప్రదాయాల పేరు చెప్పి, మోసం చేసే వారిని నమ్మడం అవసరమా? ఆలోచించాలి కదా? మన దేశంలో పరిస్థితి ఎలా ఉందంటే పెళ్ళాన్ని చంపినోడు సద్గురువు అయ్యాడు. పెళ్ళాన్ని వదిలేసినోడు విశ్వగురువు అయ్యాడు. చిన్న విషయం కూడా నేర్చుకుందామన్న తపన లేనోళ్ళంతా ఈ దేశంలో గురువులు కావాలని తహతహలాడుతుంటారు. అసలైతే వేలిముద్రగాడు, కానీ బింకంగా పరీక్షలపై చర్చ అంటూ వచ్చి కూర్చుంటాడు–

"ఆలి నేల లేని అసమర్థుడెట్లొను/ ప్రజల నేల గల్గు ప్రాజ్ఞ వరుడు?/ ప్రాకలేని బుడత పరుగెత్త నేర్చునా/ వాస్తవమ్ము నార్లవారి మాట" – అని అన్నారు తెలుగు కవి, రచయిత, ప్రసిద్ధ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు – చాలా కాలం కిందట! ఇప్పుడీ విషయమే రివర్స్‌లో చూస్తున్నాం. ఆలినేలుకోలేని వాడు దేశాన్ని ఏలుతున్నానన్న భ్రమలో బతుకుతున్నాడు. ఉదాహరణకు 2014లో రూపాయికి డాలర్ మారకం విలువ 60.99 అదే 2023లో 83.15 అయ్యింది. పరిస్థితి ఇలా స్పష్టంగా కనిపిస్తూ ఉంటే ప్రధాని అతని సహచరులంతా దేశం ఆర్థిక ప్రగతి సాధించిందని దబాయిస్తారెందుకూ? వారికెవ్వరికీ కళ్ళూ, చెవులూ పని చేయడం లేదా? అందుకే కాబోలు మణిపూర్‌లో ప్రధాని మోడి ఫొటోతో పోస్టర్లు వెలిశాయి. దాని కింద ఒక వాక్యం ఉంది. "ఈయనకు కళ్ళు కనబడవు. చెవులు వినబడవు. ఇక్కడ మా మణిపూర్ మండిపోతున్నా ఆయనకు పట్టదు. విదేశాలకు పారిపోతుంటాడు" అని!

MODI అనేది ఇంటిపేరు కాదు, ఆయన విద్యార్హతలు. మాస్టర్ ఆఫ్ డెవలపింగ్ ఇండియా–అని ఆయన అనుయాయులు ప్రచారం చేసుకుంటున్నది నిజం. కాని, హైస్కూల్ చదువు పూర్తి చేయనివాడు లోపాయికారిగా యం.ఎ. డిగ్రీ సంపాదించాడని ఈ దేశ ప్రజలకు తెలుసు. డబ్బు



MODI అనేది ఇంటిపేరు కాదు, ఆయన విద్యార్హతలు. మాస్టర్ ఆఫ్ డెవలపింగ్ ఇండియా-అని ఆయన అనుయాయులు ప్రచారం చేసుకుంటున్నది నిజం. కాని, హైస్కూల్ చదువు పూర్తి చేయనివాడు లోపాయికారిగా యం.ఎ. డిగ్రీ సంపాదించాడని ఈ దేశ ప్రజలకు తెలుసు. డబ్బు గుప్పించి నమ్మకంగా పడి ఉండేవాణ్ణి రెండుసార్లు ప్రధాని సీట్లో కూర్చోబెట్టిన కార్పోరేట్లకు తెలుసు. అందుకే ఆయన వారికి అతివిధేయుడిగా ఉన్నాడు. బిబిసి డాక్యుమెంటరీయే కాదు, ప్రపంచవ్యాప్తంగా 14 అంతర్జాతీయ పత్రికలు ఈయన అసమర్థత గూర్చి పూర్తి వివరాలు వెల్లడించాయి.

గుప్పించి నమ్మకంగా పడి ఉండేవాణ్ణి రెండుసార్లు ప్రధాని సీట్లో కూర్చోబెట్టిన కార్పోరేట్లకు తెలుసు. అందుకే ఆయన వారికి అతివిధేయుడిగా ఉన్నాడు. బిబిసి డాక్యుమెంటరీయే కాదు, ప్రపంచవ్యాప్తంగా 14 అంతర్జాతీయ పత్రికలు ఈయన అసమర్థత గూర్చి పూర్తి వివరాలు వెల్లడించాయి. "కుట్ర చేయడం ఎంతతెలివిగా చేయాలంటే ఎదుటివారికి ఏ మాత్రం తెలియకూడదు. పైగా తనకు తానుగా వచ్చి కుట్రలో ఇరుక్కోవాలి. బల్లై, భస్మమైపోవాలి"– అని అన్నాడు విన్సెంట్ చర్చిల్. చర్చిల్ ఎప్పుడో చెప్పిన విషయాన్ని ఈ దేశ ప్రధాని ప్రజలమీద ప్రయోగిస్తున్నాడు. నిజం చెప్పుకోవాలంటే విపక్షాల అనైక్యత వల్ల ఆయన కొనసాగాడు తప్పించి, స్వీయ ప్రతిభతో రాణించింది ఎప్పుడూ ఎక్కడా? గజరాత్ గాయం, మణిపూర్ గాయం. దేశమంతా గాయాలమయమై పోతోంది. నిజమే! ఈ విషయం మాత్రం చరిత్రలో నిలిచిపోతాయి!

దేశం కోసం – ధర్మం కోసం ఈ దేశ ప్రధాని చేస్తున్న అనేక సంస్కరణల్లో – గ్యాస్ సిలిండర్ ధర పెంచడం కూడా ఒకటి అని ఆ ఫలానా పార్టీ నాయకులు తెగ ప్రచారం చేస్తున్నారు. వారి వాదన ఏమిటో ఎంత సబబుగా ఉందో ఆలోచించండి. విషయం మీకే బోధపడుతుంది – "సిలిండర్లలో నింపేగ్యాస్ భూమి లోపల నుండి తీస్తారు. అలా గ్యాస్ తీయడం వల్ల మొక్కలకు లోపల నుండి అందాల్సిన ఆక్సిజన్ అందదు. దాని వల్ల చెట్లు పెరగవు. సుమారుగా ఒక రాష్ట్రానికి 54 లక్షల సిలిండర్లు అవసరమౌతాయంటే, ఇక దేశం మొత్తానికి ఎన్ని కావాలో లెక్క కట్టండి. గ్యాస్ సిలిండర్ ధర పెంచడం వల్ల, భారం మోయలేక చాలా మంది కట్టెలు కొట్టుకోవడానికి అడవికి వెళతారు. వారు అక్కడ శుభ్రమైన గాలి పీల్చుకుంటారు. దానివల్ల మేలు జరిగినట్టేకదా? వంట చెరకు కొట్టి తెచ్చుకుని కట్టెల పొయ్యి మీద వంట చేసుకుంటారు. కట్టెలపొయ్యి వల్ల పొగ వస్తుం ది. ఆ పొగ వాతావరణంలో ఎక్కువ శాతంగా ఉన్న ఆక్సిజన్‌ను తగ్గిస్తుంది. అంటే, దాని వల్ల వాతావరణ సమతుల్యం కాపాడబడుతుంది. కదా? దానివల్ల మేలు జరిగినట్టే కదా? కట్టెల పొయ్యి మీద వంట చేసుకున్న మన పూర్వీకులు రోగాలు రొష్టులూ లేకుండా ఆరోగ్యంగా ఉండే వారు కదా? కట్టెల పొయ్యి ఉపయోగంలో లేనందువల్లనే ఈ రోజుల్లో రోగాలు నానాటికీ ఎక్కువవుతున్న విషయం అందరూ గ్రహించాలి! ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని, ప్రజల ఆరోగ్యం కాపాడడం కోసమే మోడి సిలిండర్ ధర పెంచారు. ఆయన ఏ పని చేసినా దేశం కోసం, ధర్మం కోసమే చేస్తారన్నది ఈ దేశ ప్రజలు అర్థం చేసుకోవాలి"– ఫలానా పార్టీవారు చేస్తున్న ప్రచారంలో నిజానిజాలు దేశ ప్రజలే గ్రహించుకోవాలి! దేశం ఎంత ముందుకు పోతోందన్నది బేరీజు వేసుకోవాలి.


"దేశమును ప్రేమించుమన్న/మంచి అన్నది పెంచుమన్న" – అన్న గురజాడ అప్పారావు (1862 – 1915) మనకు తెలుసు. **"మతములన్నియు మాసిపోవును/ జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును"** అని అన్నది కూడా ఆ మహానుభావుడే. **"చెట్టపట్టాల్ పట్టుకొని దేశస్థులంతా నడవవలెనోయ్ / అన్నదమ్ములవలెను జాతులు/మతములన్నియు మెలగవలెనోయ్"** – అని ఆశించారాయన! అందుకు వ్యతిరేకమైన భావజాలాన్ని ఇప్పుడు ఒక గుజరాత్ అప్పారావ్ ద్వేషభక్తి గీతం పాడుతున్నాడు. జ్యోతిబసు పేరుతో ఎవరో నాకు ఆ పేరడీ గేయం పంపించారు. అది నా పాఠకుల కోసం ఇక్కడ పొందుపరుస్తున్నాను **"మతమునే ప్రేమించుమన్న/ హింసయన్నది పెంచుమన్న/ వట్టి మాటలు చెప్పుకోవోయ్/ చేయు మేలుని కట్టిపెట్టోయ్/ దేశాభిమానమె నాకె కద్దని/ వట్టి గొప్పలె చెప్పుకోవోయ్/ దేశమంటే జనం కాదోయ్/ దేశమంటే మతంమయమోయ్/ హిందు మతమే రాజ్యమేలగ/ దారిలో నువు పాటు పడవోయ్/ తతిమ జాతులు మతములన్నీ/ అణిగి మణిగి మెలగవలెనోయ్// స్వంతలాభమె అంతయనుకుని/ ప్రజలనందరి ముంచవలెనోయ్/ జాతి ఆస్థులు కట్టగట్టి/ దత్తపుత్రుల కట్టబెట్టోయ్ // విజ్ఞాన మంతయు రాతి యుగపు/ గ్రంథమయమని బొంకవలెనోయ్/ రోదసీ నౌకకి సైతం/ దిష్టి టెంకాయ్ కొట్టవలెనోయ్/ అంబేద్కరు గాంధీ ఇజాలకు/ పైపై దప్పు కొట్టవలెనోయ్/ మత సామరస్యం చావుకోసం/ లోన గోతులు తీయవలెనోయ్"** అధికారంలో ఉన్నవారు పాడుతున్న ఈ ద్వేషభక్తి గేయం దేశానికి ఎంతగా గాయం చేస్తుందో.. సామాన్య పౌరులు అర్థం చేసుకోవాలి! 'భారత్ జోడో – సద్భావజోడో'! భారత దేశ సమగ్రతను కాపాడదాం! విద్వేష భావాన్ని విడనాడుదాం!! 'ఇదే నేటి మన కర్తవ్యం.

– సుప్రసిద్ధ సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

ఇజ్రాయిల్ నేరాల్లో భాగస్వామి అమెరికా!

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఒక రోజు ఇజ్రాయిల్ పర్యటన వల్ల ఏదైనా ఫలితం కనిపించిందీ అంటే అది, సెటిలర్–వలసవాద రాజ్యమైన ఇజ్రాయిల్‌కు నిరంతరం, గుడ్డిగా మద్దతు ఇవ్వడమే. ఈ పర్యటన 1948 నుండి మారని వాస్తవికతను నొక్కి చెప్పింది–పశ్చిమాసియాలో తన ఔట్‌పోస్ట్‌గా ఇజ్రాయిల్‌ను అమెరికా పెంచి పోషిస్తూ వచ్చింది. మంచి పాటవంతో కూడిన సైనిక దండు కలిగిన దేశంగా ఇజ్రాయిల్‌ను మార్చడానికి వందల కోట్ల డాలర్ల విలువైన సాయం, అత్యంత అధునాతనమైన ఆయుధాలు, ఇతర పరికరాలు అమెరికా గుమ్మరించింది.

ఆ రకంగా చేయడం ద్వారా, పాలస్తీనియన్ల అణచివేతను, వారు అనుభవిస్తున్న ఇబ్బందులను, కష్టనష్టాలను, వెస్ట్ బ్యాంక్ వంటి ఆక్రమిత ప్రాంతాల్లో జరుగుతోన్న జాతి ప్రక్షాళన వంటి చర్యలను అమెరికా పట్టించుకోలేదు. అత్యంత సౌకర్యవంతమైన రీతిలో వాటిని విస్మరించింది. 23 లక్షల మంది పాలస్తీనియన్లు నివసిస్తున్న గాజాలో గత 16 సంవతరాలుగా కొనసాగుతున్న అమానవీయ ఆంక్షలను, దిగ్బంధనాన్ని సమర్థిస్తూ వచ్చింది. ఇటీవలి సంవత్సరాల్లో, వెస్ట్ బ్యాంక్‌లో యూదు ఆవాసాలను విస్తరించడం ద్వారా రెండు దేశాల ఏర్పాటు ఫార్ములాను ఇజ్రాయిల్ చురుకుగా దెబ్బతీస్తూ, వర్ణ వివక్ష వంటి వ్యవస్థను అమలు చేస్తున్నప్పుడు, ఈ ద్వంద్వ ప్రణాళికలో అమెరికా, దాని పశ్చిమ మిత్రపక్షాలు కుమ్మక్కయ్యాయి. కానీ, రెండు దేశాల ఏర్పాటు పరిష్కారం గురించి ఊరికే ప్రచారం చేస్తూ వచ్చాయి. బైడెన్ పర్యటనకు ముందుగా, విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఇజ్రాయిల్, మరో ఐదు అరబ్ దేశాల్లో పర్యటించారు. గాజాలో పదాతిదళ దాడికి ఇజ్రాయిల్ సన్నద్ధమవుతుంటే, ఈజిప్ట్, జోర్డాన్ వంటి ఇరుగు పొరుగు దేశాలు సహకరించాలని కోరేందుకు ఆయా దేశాల్లో బ్లింకెన్ పర్యటించారు. రాఫా క్రాసింగ్ ద్వారా ఈజిప్ట్‌లోకి వెళ్ళేందుకు గాజా నుండి పాలస్తీనియన్లను అనుమతించేందుకు ఈజిప్ట్ అధ్యక్షుడిని ఒప్పించడంలో బ్లింకెన్ విఫలమయ్యారు. పాలస్తీనియన్లు ఒకసారి ఈజిప్ట్‌లోకి ప్రవేశిస్తే ఇక వారిని తిరిగి గాజాకు వెళ్ళేందుకు అనుమతించేది లేదని, వారు ఇక ఈజిప్ట్‌లో శాశ్వత శరణార్థులుగా వుండిపోతారని ఈజిప్ట్ అధ్యక్షుడు సిసి ప్రకటించారు. జోర్డాన్‌లోకి పాలస్తీనియన్ల రాకపోకలను జోర్డాన్ కూడా తిరస్కరించింది.



ఇజ్రాయిల్‌కు రక్షణగా నిలబడేందుకు అమెరికా ఎంతకైనా తెగిస్తుందనే విషయం బైడెన్ ఇజ్రాయిల్‌కు వచ్చిన మొదటి రోజే స్పష్టమైంది. గాజాలోకి ప్రాణాధార ఔషధాలు, ఇతర సరఫరాలు అనుమతించేందుకు వీలుగా మానవతా కారిడార్‌లను ఏర్పాటు చేయాలని పిలుపిస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో బ్రెజిల్ ప్రతిపాదించిన తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. గాజాలోకి మానవతా సాయం వెళ్లనివ్వకుండా ఆ ప్రతిపాదనను వీటో చేయడం ద్వారా గాజాలో ప్రజలు ఆహారం, మందులు లేక కరువుబారిన పడేందుకు అమెరికా అనుమతించినట్లు అయింది.

ఆత్మరక్షణ కోసం గాజాపై దండెత్తడానికి ఇజ్రాయిల్‌కు హక్కు వుందంటూ అమెరికా పూర్తిగా సమర్థించింది. మరోవైపు రాబోయే మానవ విపత్తును తప్పించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

టెల్ అవీవ్‌కు రావడానికి ముందు రోజు రాత్రి దక్షిణ గాజాలోని అల్ అహ్లి ఆస్పత్రిపై బాంబు దాడితో భయంకరమైన రీతిలో మారణకాండ చోటు చేసుకుంది. ఇప్పటివరకు 471 మంది మరణించినట్లు వెల్లడైంది. 24 గంటల్లోగా రోగులు, సిబ్బంది అందరూ ఖాళీ చేయాలని లేని పక్షంలో పర్యవసానాలను ఎదుర్కొనాల్సి వుందంటూ ఉత్తర గాజాలోని 22 ఆస్పత్రులను ఇజ్రాయిల్ మిలటరీ ఆదేశించిన నేపథ్యంలో ఈ దారుణమైన దాడి జరిగింది. అక్టోబరు 12 సాయంత్రం ప్రజలను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. 15వ తేదీన అల్ అహ్లి ఆస్పత్రిపై రాకెట్ దాడి జరిగింది. ఆస్పత్రిపై దాడికి తాము బాధ్యులం కాదంటూ ఇజ్రాయిల్ ఇప్పుడు వాదిస్తోంది. ఇస్లామిక్ జిహాద్ ప్రయోగించిన రాకెట్ గురి తప్పి ఆస్పత్రిపై పడిందని, దాంతో ఈ దాడి చోటు చేసుకుందని చెబుతోంది. అయితే ఇంతటి భయంకరమైన విధ్వంసాన్ని సృష్టించగలిగేంత శక్తివంతమైన రాకెట్లు గాజా మిలిటెంట్ల వద్ద లేవని సైనిక నిపుణులు, పలువురు మీడియా వ్యాఖ్యాతలు పేర్కొంటున్నారు. అటువంటి శక్తివంతమైన బాంబులను కలిగివున్నది ఇజ్రాయిల్ మిలటరీ మాత్రమే. ఈ దాడికి సంబంధించి ఇజ్రాయిల్ చెబుతున్న కథనాన్ని బైడెన్ కూడా నిస్సిగ్గుగా సమర్థించారు. 'ప్రత్యర్థి బంధమే ఈ దాడికి పాల్పడింది' అంటూ ప్రకటించారు. ఆ రకంగా, ఇజ్రాయిల్ పాల్పడిన యుద్ధ నేరాల్లో బైడెన్ కూడా భాగస్వామి అయ్యారు. అమ్మాన్‌లో జోర్డాన్, ఈజిప్ట్, పాలస్తీనా అథారిటీ నేతలతో జరగాల్సిన సమావేశాల రద్దు గురించి అస్సలేమీ మాట్లాడకుండా మౌనం పాటించారు. ఈ భయంకరమైన నేరానికి ఇజ్రాయిల్ పాల్పడిన సమయంలో ఏ అరబ్ నేత కూడా చివరకు అమెరికా మిత్రపక్షాలు కూడా బైడెన్‌తో సమావేశమవలేదు.

ఇజ్రాయిల్‌కు రక్షణగా నిలబడేందుకు అమెరికా ఎంతకైనా తెగిస్తుందనే విషయం బైడెన్ ఇజ్రాయిల్‌కు వచ్చిన మొదటిరోజే స్పష్టమైంది. గాజాలోకి ప్రాణాధార ఔషధాలు, ఇతర సరఫరాలు అనుమతించేందుకు వీలుగా మానవతా కారిడార్‌లను ఏర్పాటు చేయాలని పిలుపిస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో బ్రెజిల్ ప్రతిపాదించిన తీర్మానాన్ని అమెరికా వీటో చేసింది. గాజాలోకి మానవతా సాయం వెళ్లనివ్వకుండా ఆ ప్రతిపాదనను వీటో చేయడం ద్వారా గాజాలో ప్రజలు ఆహారం, మందులు లేక కరువుబారిన పడేందుకు అమెరికా అనుమతించినట్లు అయింది.

పైగా ఇజ్రాయిల్‌లో పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత బైడెన్ మాట్లాడుతూ, రాఫా క్రాసింగ్ ద్వారా గాజాలోకి మానవతా సాయం అందించేందుకు అనుమతించాలంటూ ఇజ్రాయిల్ యుద్ధ కేబినెట్‌ను కోరినట్లు తెలిపారు. ఫలితంగా, అక్టోబరు 20న రాఫా క్రాసింగ్‌ను దాటేందుకు 20 ట్రక్కులను అనుమతించనున్నారు. ఇజ్రాయిల్ బాంబు దాడుల్లో ధ్వంసమైన క్రాసింగ్ వద్ద రోడ్లను ఈజిప్ట్ మరమ్మతులు చేస్తేనే ఇదైనా జరుగుతుంది. గాజా ప్రజలకు కాస్తయినా ఉపశమనం కలగాలంటే రోజూ కనీసం వంద ట్రక్కుల వరకు సాయం అందాల్సి వుంటుందని ఐక్యరాజ్య సమితి సహాయ సంస్థ తెలిపింది.

గాజాపై ఇజ్రాయిల్ పదాతి దాడికి పాల్పడినట్లైతే ఈ ప్రాంతంలో ఘర్షణ ఇంకా విస్తృతమవుతుంది. ఒకవేళ అటువంటి దాడి జరిగినట్లైతే తాము చూస్తూ ఊరుకోబోమని ఇప్పటికే లెబనాన్‌లో హిజ్బుల్లా ప్రకటించింది. అరబ్ ప్రపంచ వ్యాప్తంగా, పశ్చిమాసియాలో ప్రజలు గాజాలో ఇజ్రాయిల్ కిరాతక దాడులను నిరసిస్తూ వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు నిర్వహించారు. ఇప్పటికి యుద్ధం ప్రారంభమై 11 రోజులు (సంపాదకీయం రాసే నాటికి) గడిచింది. ఇప్పటివరకు 1100 మంది పౌరులు మరణించారు. మూడు వేల మంది చిన్నారులు మరణించారు. ఇజ్రాయిల్‌కు రాజకీయ, సైనిక తోడ్పాటు అందించడం ద్వారా అమెరికా ఇస్తున్న మద్దతు ప్రపంచ దేశాల దృష్టిలో ఖండించదగ్గది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

ఇఫ్లూ వేధింపుల ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

- నిందితులను కఠినంగా శిక్షించాలి: ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ -దేవరకొండ

హైదరాబాద్ ఇఫ్లూ యూనివర్సిటీలో విద్యార్థినిపై జరిగిన లైంగిక వేధింపులపై సమగ్ర విచారణ జరిపించి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణకేంద్రంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి నిమ్మల పద్మ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 18వ తేదీన హైదరాబాద్ ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్శిటీ (ఇఫ్లూ) లో రాత్రి 10 గంటల సమయంలో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్నారు. లైంగిక వేధింపులపై విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆందోళన చేసిన విద్యార్థులపై కేసులు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. విద్యార్థినులపై వేధింపులను అరికట్టేందుకు అరికట్టేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటిస్తూ జీఎస్ -క్యాస్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆందోళన చేస్తున్న విద్యార్థినులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. ఈ క్రమంలో ఒక విద్యార్థినిపై వేధింపులకు పాల్పడినట్టు తెలిపారు. ఇఫ్లూలో విద్యార్థినుల పట్ల వీసీ, ప్రొక్టర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని, ఈ కేసును పక్కదారి పట్టించేందుకు విద్యార్థులపై వేరే కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురి చేస్తూ ముందుకు తెస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విచారణలో నిర్లక్ష్యంతో విద్యార్థినీలను భయభ్రాంతులకు గురి చేస్తే ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, జిల్లా సహాయ కార్యదర్శి భూతం అరుణ కుమారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కంబాలపల్లి ఆనంద్, జిల్లా సహాయ కార్యదర్శి మన్నే బిక్షం, తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ కుంగిపాటుపై రాజకీయం

- రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రం కాపాడే ప్రయత్నం : సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

నవతెలంగాణ-మహాదేవపూర్

రాష్ట్ర ప్రభుత్వ తొందరపాటు నిర్ణయాలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఆగమై మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర నిపుణులు కాపాడే ప్రయత్నం చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మేడిగడ్డ సందర్శనకు వచ్చిన ఆయన్ను పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపటి తర్వాత ప్రాజెక్ట్ సందర్శనకు అనుమతివ్వడంతో పోలీసు పహారా మధ్య సందర్శించారు. అనంతరం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రాజెక్టు కుంగిన రోజు విద్రోహ చర్య అంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడం చూస్తుంటే ప్రభుత్వ వైఫల్యాలను పక్కన పెట్టేసి ఎవరో ఏదో చేశారని వేరే వారిపై ఉద్దేశపూర్వకంగా నెట్టి, తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర నిపుణులు మాట్లాడే మాటల్లో తేడా ఉందని, ముందుగా నాణ్యత లోపం లేదని టెక్నికల్ మిస్టేక్స్ ఉన్నాయంటూ ప్రకటనలు చేయడం సరికాదన్నారు. తక్కువ వ్యవధిలో ప్రారంభించి పూర్తి చేశానని గొప్పలు చెప్పుకుంటున్న కేసీఆర్ ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీగా అవినీతి జరిగిందని, ఉన్నత న్యాయస్థానం ద్వారా విచారణ చేయించి ఖర్చుల లెక్కలను తేల్చాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులనేవి భవిష్యత్ తరాలకు ఉపయోగపడతాయని, ఇప్పటివరకు ప్రాజెక్టులు పొంగిపోయిన దాఖలాలు లేవని అన్నారు. కరీంనగర్‌లో నిర్మించిన తీగల బ్రిడ్జి ఇలాగే జరిగిందని, కమిషన్లు తీసుకునే ఆలోచనలో ఉన్న ప్రభుత్వం నాణ్యత పాటించలేదని అన్నారు. సీఎం కేసీఆర్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్తారని అన్నారు. సందర్శించిన వారిలో.. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేనా శంకర్ పష్యా, పద్మ ఇటీ నరసింహ, భూపాలపల్లి మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల కార్యదర్శులు కొరిమి రాజ్‌కుమార్, రాముడు, లక్ష్మణ్, తాండ్ర సదానందం, నాయకులు పాల్గొన్నారు.

వర్కర్స్ మ్యానిఫెస్టోను పరిగణనలోకి తీసుకోండి

- టీటీడీపీ, బీఎస్పీ, సీపీఐఎంల్(ప్రజాపంథా) పార్టీలకు కార్మిక సంఘాల వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలోని కార్మిక, ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా రూపొందించిన వర్కర్స్ మ్యానిఫెస్టోలో అంశాలను పరిగణనలోకి తీసుకోవాలనీ, కార్మికులకు మేలు చేసే అంశాలను పార్టీలు తమ మ్యానిఫెస్టోలో పొందుపర్చాలని కార్మిక, ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, సీపీఐఎంల్(ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుకు వర్కర్స్ మ్యానిఫెస్టోను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ.చంద్రశేఖర్, హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంకే బోసు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పదేండ్లుగా కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సమ్మెలు, ఉద్యమాలు చేపట్టినా రాష్ట్ర సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే కార్మికులకు సంబంధించిన పలు అంశాలతో వర్కర్స్ మ్యానిఫెస్టోను సంయుక్తంగా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో కోటి మందికి ప్రయోజనం కల్గించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాలను సవరించాలనీ, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని జరుగుతున్న పోరాటాలకు ఎల్లవేళలా అండగా ఉండాలనీ, ఈ డిమాండ్లను నెరవేరుస్తామని బీఎస్పీ, టీడీపీ, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పార్టీలు తమ మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరారు.

మీరొస్తానంటే.. మేమొద్దంటామా..!

- ఒకరు పోయిరాగానే మరొకరు..
- ఆహ్వానించి.. శాలువాలు కప్పి...
- తప్పని స్థితిలో ఆత్మీయ సమ్మేళనాలు..
- ప్రముఖుల ఇండ్ల చుట్టూ అభ్యర్థుల చక్కర్లు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

"డాక్టర్ గారూ మీ ఇంటికి వస్తున్నాం.. పెద్దాయన ఇంటికి రమ్మంటారా..? అన్నా మీరేమంటారు..? లాయర్ గారూ రమ్మంటారా.. వద్దంటరా? అక్కా.. ఇవ్వాళ టిఫిన్ మీ ఇంట్లోనే.. అంకుల్ మనోళ్లందర్నీ కూడగట్టండి.. మాటాముచ్చట చెప్పుకుందాం.. సాధక బాధకాలు మాట్లాడుకుందాం.. మనింటి దగ్గరే ఓ చిన్నపాటి మీటింగ్ పెట్టుకుందాం.." ఇవీ బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు, వారి తరఫు నేతలు, పీఏల నుంచి పలువురు ప్రముఖులకు వస్తున్న ఫోన్‌లు. ముఖ్యంగా పట్టణ ప్రాంత నియోజకవర్గాల్లోని వ్యాపారులు, డాక్టర్లు, లాయర్లు, ఉద్యోగ సంఘాల నేతలు, వివిధ వర్గాల ప్రముఖులకు ఎదురవుతున్న ఉదంతాలు. పార్టీతో సంబంధం లేదు.. భావజాలంతో పనిలేదు.. ఆయన చెబితే ఓ పది ఓట్లు పడతాయంటే చాలు.. ఆ ఇంటి దగ్గర వాలిపోవడం.. నలుగురిని పిలిపించమనడం, ఆత్మీయ సమ్మేళనం పేరుతో చిన్నపాటి మీటింగ్ పెట్టడం, ప్రత్యర్థిపై విమర్శలు చేయడం.. పలుచోట్ల నిత్యకృత్యంగా మారింది. ఖమ్మం నియోజకవర్గంలో పదిరోజులుగా ఈ తంతు ప్రహసనంలా సాగుతోంది.

ఈయనొచ్చి పోయిన గంటలోనే ఆయన...

ఖమ్మం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా భావిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు, బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ ఓ వారం పదిరోజులుగా నగరంలోని ప్రముఖుల ఇండ్లన్నీ చుట్టేస్తున్నారు. తుమ్మల ఓ ఇంటికి వెళ్లాడని తెలిసిన గంట.. రెండు గంటల్లోనే.. కుదరకపోతే మరుసటిరోజైనా అజయ్ ఆ ఇంటికి వెళ్లాల్సిందే. ఆ ప్రముఖుడు బీఆర్ఎస్ అభిమానా? కాంగ్రెస్ పార్టీనా? బీజేపీనా? కమ్యూనిస్టా? ఇవేవీ సంబంధం లేదు.. ఆయనొచ్చాడు కదా..! నేనూ పోవాల్సిందే..! అనే రీతిలో ఈ వ్యవహారం సాగుతోంది. చేసేది లేక ఎవరొచ్చినా ఆహ్వానించడం మినహా ప్రముఖులు అభ్యంతరం చెప్పలేకపోతున్నారు. గతంలో సదరు నేతలతో ఇబ్బంది పడ్డా.. భవిష్యత్తు అవసరాల రీత్యా కాదనలేని దుస్థితి. 'నువ్వొస్తానంటే..మేమొద్దంటామా..!' అన్నట్టు పలువురు ఇష్టంలేకున్నా శాలువాలు కప్పి స్వాగతిస్తున్నారు. తమ పరిధిలో పనిచేసేవారినో.. చుట్టుపక్కల వాళ్లనో.. అపార్ట్‌మెంట్లైతే దానిలోని ఫ్లాట్లలో ఉండేవారిని పిలిపించి.. ఇష్టాఇష్టాలతో పనిలేకుండా మీటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థులు చెప్పే ఊకదంపుడు ఉపన్యాసాలు, లేని ఆత్మీయ అభిమానాల ప్రదర్శనతో విసిగివేసారుతున్నా భరించక తప్పని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇది ఇక్కడే కాదు.. పలు పట్టణ ప్రాంతాలతో పాటు పల్లెల్లోనూ పది ఓట్లను ప్రభావితం చేయగల వారికీ ఎదురవుతున్న అనుభవం ఇదే.

'ఓటు' కోసం కోటి విద్యల రీతిలో..

ఖమ్మంలో ప్రముఖ వ్యాపారవేత్త జీవీ మాల్ అధినేత గుర్రం బ్రదర్స్ ఇంటికి తుమ్మల వెళ్లారు. ఆ వెంటనే అజయ్ కూడా వెళ్లొచ్చారు. విద్యాసంస్థల అధినేత, సీపీఐ నాయకులు సాంబశివారెడ్డి ఇంటికి తుమ్మల వెళ్లారు. ఒకటి, రెండు రోజుల తర్వాత అజయ్ హాజరువేసుకున్నారు. సీపీఐ(ఎం) నేత, మాజీ ఎంపీ యలమంచలి రాధా కృష్ణమూర్తి కుమారులు రవీంద్రనాథ్ ఇంటికి తుమ్మల వెళ్లి వచ్చిన గంటల్లోనే అజయ్ ప్రత్యక్షం అయ్యారు. మొన్న ప్రముఖ కాంట్రాక్టర్ మేళ్లచెరువు (ఆర్టీసీ) వెంకటేశ్వరరావు ఇంటికి కూడా ఇదే పరిస్థితి. బీజేపీ సింపథైజర్ లాయర్ మల్లాది వాసుదేవ్ ఇంట్లో అజయ్ ఆత్మీయ సమ్మేళనం, ఆ పక్కనే ఉన్న శ్రీ రక్ష హాస్పిటల్ అధినేత గోంగూర వెంకటేశ్వర్లు ఆస్పత్రికి వెళ్లి అక్కడో ఆత్మీయ సమావేశం.. ఇక అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాస్‌లో మీటింగ్‌లు షరామామూలే..! 'ఓటు' కోసం కోటి విద్యలు అన్నట్టు నేతల వ్యవహారం ఉండటాన్ని చూసి జనం విస్తుపోతున్నారు.

29న హైదరాబాద్‌లో ఆటిజంపై అవగాహన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆటిజం, తలసేమియా, ట్రాన్స్‌జెండర్ల కోసం పనిచేస్తున్నమర్హం-రెసొనేటింగ్ రెసిలెన్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 29న 'స్పెక్ట్రమ్ స్పార్కిల్' పేరుతో తొలిసారిగా ఆటిజం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆటిజం రోగనిర్ధారణ, పిల్లల ఆలస్యమైన భావోద్వేగ అభివృద్ధి, సంపూర్ణ నిర్వహణపై లోతైన, అత్యంత కీలకమైన విషయాలను ఈ కార్యక్రమం అందించనుంది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డెక్కన్ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రొఫెసర్ , సైకియాట్రీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ మిన్‌హాజ్ జాఫర్ నాసిరాబాడి, నిలోఫర్ హాస్పిటల్ సూపరింటెండెంట్, ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉషా రాణి, రోష్ని కౌన్సెలింగ్ సెంటర్ సైకాలజిస్ట్ డాక్టర్ జయంతి సుందర్ రాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటిజం అవగాహనపై రూపొందించిన షార్ట్ ఫిల్మ్ - గుంజాయిష్ పోస్టర్‌ను విడుదల చేశారు. మార్హం వ్యవస్థాపకులు డాక్టర్ నబత్ లఖానీ మాట్లాడుతూ స్పెక్ట్రమ్ స్పార్కిల్ అనేది రోగనిర్ధారణ, చికిత్సలు, సమగ్ర విద్య, ఉపాధి, భవిష్యత్తుపై ప్రత్యేక నిపుణుల ప్యానెల్ చర్చల సమ్మేళనం. ఆటిస్టిక్ ప్రతిభావంతులను, వారి కుటుంబాలను అభినందిస్తూ తీసిన లఘు చిత్రం - గుంజాయిష్ ప్రదర్శన కూడా ఉంటుందని చెప్పారు. ఆటిజంతో బాధితుల ప్రత్యేక సామర్థ్యాలు, వారి కృషిని కూడా హైలైట్ చేయనున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ బాధిత చిన్నారుల తల్లిదండ్రులు, సంరక్షకులకు ఆటిజం గురించి ప్రఖ్యాత నిపుణుల బృందం నుంచి విలువైన సమాచారం అందించడంతో పాటు సమాజానికి ఆటిజం గురించి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం అమూల్యమైన అవకాశాన్ని అందిస్తుందని తెలిపారు. పిల్లల్లో ఆలస్యమైన అభివృద్ధి సంకేతాలను గుర్తించడం నుంచి రోగనిర్ధారణ ప్రక్రియ, ఆటిజం సంపూర్ణ నిర్వహణ వరకు ప్రతీ సమాచారాన్ని అందిస్తుంది. ఈ కార్యక్రమంలో శిశు వైద్యులు, సైకాలజిస్టులు, ప్రత్యేక అధ్యాపకులు, ఆటిజం న్యాయవాదులతో సహా ఈ రంగంలోని నిపుణులు పాల్గొంటారని వెల్లడించారు. ప్రతిభావంతులైన ఆటిస్టిక్ పిల్లలందరికీ రాష్ట్ర గవర్నర్ ఈ అవార్డులను అందజేస్తారు.

బీఆర్ఎస్‌లోకి మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మాజీ టీచర్ ఎమ్మెల్సీ, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం పూర్వ నాయకులు బి మోహన్‌రెడ్డి బీజేపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తిరిగి అధికారంలోకి రానున్న బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ ప్రభుత్వ సారధ్యంలో విద్యారంగ, ఉపాధ్యాయ అంశాలపై కలిసి పని చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

త్రిపుర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇంద్రసేనారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

త్రిపుర గవర్నర్‌గా నల్లు ఇంద్రసేనా రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గురువారం అగర్తలాలో ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇంద్రసేనారెడ్డి దంపతులకు ముఖ్యమంత్రి డాక్టర్ మాణిక్ సాహా, మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఘనస్వాగతం పలికారు. "గార్డు -ఆఫ్ -హానర్" నిర్వహించారు. ప్రమాణస్వీకారం అనంతరం రాజ్‌భవన్‌లో ఆ రాష్ట్ర సీఎం, ఇతర సీనియర్ అధికారులతో భేటీ అయ్యారు.

గజ్వేల్‌లో అమరవీరుల కుటుంబాల ర్యాలీ



నవ తెలంగాణ-గజ్వేల్

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో గురువారం అమరవీరుల కుటుంబాలు ర్యాలీ నిర్వహించారు. 1969 నుంచి 2014 వరకు తెలంగాణ రాష్ట్ర సాధనలో అనేకమంది అమరులైనట్టు అమరవీరుల కుటుంబాల సాధన సమితి నాయకులు రఘురాం రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక, తెలంగాణ దళిత సంఘాల జేఏసీ, తెలంగాణ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎందరో త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో ఉద్యోగాలు రాక ఆత్మ బలిదానాలు చేసుకుంటున్నారని వాపోయారు. కార్యక్రమంలో నిరుద్యోగ యువత, తల్లిదండ్రులు యాత్రలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి వేధిస్తున్నారు

- గోల్డ్‌ఫిష్ అధినేత చంద్రశేఖర్ విమర్శ
- న్యాయపరమైన చర్యలు
- తీసుకుంటామని హెచ్చరిక



నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణా శాసనమండలి సభ్యులు చల్లా వెంకట్రామిరెడ్డి తమను వేధిస్తున్నారని గోల్డ్ ఫిష్ అబోడ్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ వేగి చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంకట్రామిరెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కలిసి తమపై తప్పుడు పోలీసు కేసులు బనాయిస్తూ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. చివరకు పీడీ యాక్ట్ కూడా ప్రయోగించారని తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ గోల్డ్‌ఫిష్ కంపెనీపై చల్లా వెంకట్రామిరెడ్డి చేసిన పలు ఆరోపణలకు వివరణ ఇచ్చారు. పలు గృహనిర్మాణ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తిచేసిన చరిత్ర తమ గోల్డ్‌ఫిష్ సంస్థకు ఉందన్నారు. కోకాపేటలోని సర్వే నెంబరు 85లో ఉన్న 2.30 ఎకరాల స్థలానికి సంబంధించి వివాదం నెలకొందన్నారు. ఆ స్థలంలో ప్రాజెక్టు అభివృద్ధి చేయాలని భావించామన్నారు. స్థలానికి సంబంధిత డాక్యుమెంట్లను మీడియాకు విడుదల చేశారు. తప్పుడు సమాచారం, అర్ధ సత్యాలతో తమ కంపెనీ మీద బురద జల్లే ప్రయత్నం చేయడాన్ని ఖండించారు. నిజాన్ని ఎదుర్కోలేక ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి తమను మోసగాళ్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు ఆయన రాజకీయ ఎత్తులకు తాము బయపడేది లేదనీ, వాటిని చట్టబద్ధంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్టు చెప్పారు. తమపై చేస్తున్న అరాచకాలకు తలొగ్గబోమనీ, న్యాయవ్యవస్థ తలుపు తడుతామన్నారు. తగిన న్యాయం దక్కుతుందని ఆశిస్తున్నట్టు వివరించారు. వెంకట్రామిరెడ్డికి తమ కంపెనీ వ్యాపారానికి సంబంధించి మాట్లాడే హక్కు లేదని వ్యాఖ్యానించారు.

బాలలు భావి తరాల సంపద

- వారితోనే దేశ భవిష్యత్ : బాలోత్సవ పోస్టర్ అవిష్కరణలో కేవీ రమణాచార్యులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'పిల్లల కంటే ప్రపంచంలో విలువైనది మరేదీ లేదు. బాలలే భావితరాల సంపద. పిల్లల గురించి ఆలోచించడం అంటేనే దేశ భవిష్యత్తు గురించి ఆలోచించడం' అని విశ్రాంత ఐఏఎస్ అధికారి, తెలంగాణ బాలోత్సవం పిల్లల జాతరం ఆహ్వాన సంఘం అధ్యక్షులు కేవీ రమణా చార్యులు అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పిల్లల జాతర 2023 పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 16 17 18 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం పిల్లల జాతర వైభవంగా జరుగుతున్నట్టు తెలిపారు. మార్పు ఏదైనా మొదట పిల్లలనుండే రావాలన్నారు. అది సమాజ పురోగమనానికి ఉపయోగపడితే..అంతకంటే కావాల్సిందేముందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. పిల్లల్లో సోదరత్వాన్ని పెంపొందించేలా..వారంతా చట్టాపట్టాలు పట్టుకుని బారులు తీరే ఈ జాతరకు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. వారిలో దాగిన అసమాన ప్రతిభా పాటవాలకు ఒక వేదిక ఈ జాతర అన్నారు. పదివేల మంది విద్యార్థులు మూడు రోజులు 350 పాఠశాలల నుంచి హాజరుకానున్నారని తెలిపారు. జాతీయ సినీ గేయ రచయిత, బాలోత్సవం గౌరవ సలహాదారులు సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ... మార్కులు, ర్యాంకులు, పరుగులు ఈ క్రమంలో మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య విజయాల కోసమే కాదనీ, విలువల కోసమని బాలోత్సవం చాటి చెబుతున్నదన్నారు. అనేక కథలు, కబుర్లు, మహనీయుల ధైర్యం, శౌర్యం, సేవాగుణం వంటి విషయాలు ఉత్సవాల సందర్భంగా వినే అవకాశాలుంటాయని చెప్పారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... బాలల ఆటపాటలకు ఆనవాళ్లు ఈ పిల్లల జాతరనీ, సాంస్కృతిక రంగంలో 10 రకాల కార్యక్రమాలు సాహిత్య రంగంలో 12 రకాలు బాలలే భవితకు సోపానాలుగా పిల్లలే పిడుగులై తమ ప్రతిభ పాటవాలకు ప్రదర్శన వేదికగా తెలంగాణ బాలోత్సవం నిర్వహిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఎస్ సోమయ్య మాట్లాడుతూ.. సైన్స్ ఎగ్జిబిషన్‌లు, శాస్త్రీయ ఆలోచనలు పెంచే విధంగా కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు. తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షురాలు కె సుజావతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులే ముఖ్యం

- రాహుల్‌గాంధీకి రైతులకు మధ్య ఎన్నికలు : మీడియా చిట్‌చాట్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కాంగ్రెస్ నాయకులకు రాహుల్‌గాంధీ ఉంటే.. తమకు రైతన్నలు ఉన్నారని, రైతులకంటే తమకు ఎవరూ ఎక్కువ కాదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. "గాలివానలో.. వాన నీటిలో.. పడవ ప్రయాణం" అనే పాటను ఉచ్చరిస్తూ కాంగ్రెస్ పార్టీని ఆమె విమర్శించారు. గురువారం నిజామాబాద్ నగరం కేసీఆర్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో రాహుల్ గాంధీ వర్సెస్ రైతన్నల మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని, రైతుబంధును ఆపేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఆపాలని, దళితబంధు ఆపాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల కమిషన్‌ను కోరడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు ఆపుతూ వెళ్లాలంటే ముందు కరెంటు కట్ చేయాలని, ఆ తర్వాత మిషన్ భగీరథ నీళ్లు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ ఆపాల్సి వస్తుందని, వాటిని ఆపడం సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. పదేండ్ల నుంచి నడుస్తున్న పథకాలు కొత్తవని భావిస్తుంటే కాంగ్రెస్ ఎంత అభద్రతా భావంలో ఉందో అర్థమవుతుందని మండిపడ్డారు.

ఎప్పటినుంచో అమలవుతున్న పథకాన్ని నిలిపివేయించి రైతులను బాధపెడితే కాంగ్రెస్ పార్టీకే నష్టం జరుగుతుందన్నారు. రైతులకంటే ఎవరూ ఎక్కువ కాదని, రైతులను ఇబ్బంది పెట్టి తాము సాధించేది ఏమీ లేదని, కాబట్టి రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌ను నాలుగు నెలల క్రితమే నిలిపివేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేత మాజీ మంత్రి షబ్బీర్ అలీ కామారెడ్డి నుంచి పారిపోయి నిజామాబాద్‌కు వస్తున్నారని, ఆయన ముఖం చూసి కాకుండా పార్టీలను చూడాలని విజ్ఞప్తి చేశారు. మైనారిటీలను కాంగ్రెస్ పార్టీ కేవలం ఓటు బ్యాంకుగానే చూసింది కానీ మైనారిటీల అభివృద్ధికి ఏమీ చేయలేదని స్పష్టం చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గత రెండు ఎన్నికల్లో 9కి 9 సీట్లను బీఆర్ఎస్ పార్టీ గెలుచుకుందని, ఈసారి అన్ని స్థానాలను గెలిపించడానికి తామందరం కష్టపడుతున్నామని చెప్పారు. వందకు పైగా సీట్లు సాధిస్తామన్న విశ్వాసం ఉందని స్పష్టం చేశారు.

ఒక్కొక్క గ్రూపు సీఎం కేసీఆర్‌కు దగ్గరవుతూ వచ్చిందే తప్ప ఏ ఒక్కరూ దూరం కాలేదన్నారు. ఈ విషయాన్ని ప్రతిపక్షాలు గమనించడం లేదని, అందుకే వాళ్లు అందరికీ దూరమవుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను తాము కాపీ కొట్టామని ఆ పార్టీ నాయకులు అంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు నమ్మడం లేదని, బీసీలకు కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు బీఆర్ఎస్ పార్టీ చేసినంత ఎవరు చేయలేదని, అందుకే ఇది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదు బీసీల ప్రభుత్వం అని చెప్పుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాల్లో జాబ్ క్యాలెండర్ ఎక్కడ ప్రకటించారో ఆ పార్టీ నాయకులు చెప్పాలని సవాల్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరిగిన అన్ని పరీక్షా పత్రాల లీకేజీలు, మాస్ కాపీయింగ్‌లు, అవినీతి, కుంభకోణాలు, ఉద్యోగాల పేరిట జరుగుతున్న స్కాములు, యువకులను మోసం చేయడం వంటివి తెలంగాణలో ఏ ఒక్కసారి జరగలేదని సుస్పష్టం చేశారు.

కోరుట్ల బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంపీ అరవింద్‌ను తమ పార్టీ కార్యకర్తలే వందకు 150 శాతం ఓడగొడుతామని, అందులో ఎటువంటి సందేహమేలేదని తేల్చిచెప్పారు. కోరుట్లకే కాకుండా మొత్తం నిజామాబాద్ పార్లమెంటులో అరవింద్ చేసిందేమీ లేదని అన్నారు. ప్రచారంలో తమ పార్టీ చాలా ముందుందని, పార్టీ ఎజెండా, మేనిఫెస్టో, సీఎం అభ్యర్థి వంటి విషయాల్లో తమకు చాలా స్పష్టత ఉన్నదని తెలిపారు.

నవచిత్రం



సల్మాన్‌ఖాన్, కత్రినా కైఫ్

దీపావళి కానుకగా టైగర్ 3 రిలీజ్

సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్ నటించిన 'టైగర్ 3' నుంచి వచ్చిన ఫస్ట్ సింగిల్ 'లేకే ప్రభు కా నామ్' యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. ఈ పాట యూట్యూబ్‌లో ఇన్‌స్టంట్‌గా హిట్ అయింది. ఇప్పటికే 25 మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.
ఈ సందర్భంగా సల్మాన్ ఖాన్ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, 'ఈ హాలీడే సీజన్‌లో ఓ పార్టీ ఆంథమ్‌లా ఈ పాటను ఎంజాయ్ చేస్తున్నారని తెలిసి నాకు ఎంతో సంతోషంగా ఉంది' అని అన్నారు. వైఆర్‌ఎఫ్ స్పై యూనివర్స్ నుంచి రాబోతున్న ఈ సినిమాని ఆదిత్య చోప్రా నిర్మించగా, మనీష్ శర్మ తెరకెక్కించారు. దీపావళి సందర్భంగా నవంబర్ 12న ఈ చిత్రం హిందీ, తమిళ, తెలుగు భాషల్లో రిలీజ్ కానుంది.

ఆద్యంతం భావోద్వేగభరితం



'దీపావళి' చిత్రంలో ఒక దృశ్యం

అనగనగా ఓ మేక. దాని పేరు అబ్బులు! దేవుడికి మొక్కుకున్న మేక అది. ఆ మేక అంటే ఇంట్లో చిన్న పిల్లాడు గణేష్‌కు ప్రాణం. దాని తోడు లేకుండా ఎక్కడికి వెళ్ళడు. అయితే... దీపావళికి కొత్త డ్రస్ వేసుకోవాలనే గణేష్ ఆశ మేకకు ముప్పు తిప్పలు తెచ్చి పెట్టింది. ఆ తర్వాత ఏమైందనేది తెలుసు కోవా లంటే 'దీపావళి' సినిమా చూడాల్సిం దే అని అంటున్నారు నిర్మాత స్రవంతి రవికిశోర్. శ్రీ స్రవంతి మూవీస్ అధినేత 'స్రవంతి' రవికిశోర్ నిర్మిం చిన సినిమా 'దీపావళి'. కృష్ణ చైతన్య సమర్పకులు. ఆర్‌ఏ వెంకట్ దర్శకత్వం వహించారు.
పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రధారులు. 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన తొలి తమిళ సినిమా 'కిడ'కు తెలుగు అనువాదం ఈ 'దీపావళి'. ఈ సినిమా పలు జాతీయ, అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో ప్రశంసలు అందుకుంది. నవంబర్ 11న తెలుగు, తమిళ భాషల్లో సినిమాను విడుదల చేస్తున్నారు. గురువారం హీరో రామ్ పోతినేని ట్విట్టర్ ద్వారా ట్రైలర్ విడుదల చేశారు. నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ, 'నేటివిటీకి పెద్దపీట వేస్తూ సహజంగా తీసిన సినిమా ఇది. తాతయ్య, మనవడు, మేక మధ్య అనుబంధం, వాళ్ళ భావోద్వేగం ప్రేక్షకుల హృదయాలను కదిలిస్తుంది. ట్రైలర్ మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. విమర్శకుల ప్రశంసలతో పాటు ప్రేక్షకులను మన్ననలు అందుకునే చిత్రమిది. ఆదిత్య మ్యూజిక్ ద్వారా త్వరలో తెలుగు, తమిళ పాటలు విడుదల చేస్తాం' అని చెప్పారు.



సూర్య, దుల్కర్ సల్మాన్



సుధా కొంగర, నజ్రియా

క్రేజీ కాంబోలో మరో ప్రాజెక్ట్

ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలతోపాటు జాతీయ ఉత్తమ చిత్రంగా నిలిచిన చిత్రం 'సూరరై పొట్రు' (ఆకాశం నీ హద్దురా). అలాగే ఉత్తమ నటుడు, ఉత్తమ నేపథ్య సంగీతం, ఉత్తమ నటి, ఉత్తమ స్క్రీన్‌ప్లే విభాగాల్లోనూ ఈ సినిమా జాతీయ పురస్కారాలను దక్కించుకుంది. సూర్య హీరోగా సుధా కొంగర ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.
లేటెస్ట్‌గా సూర్య 43వ చిత్రం కోసం ఈ క్రేజీ కాంబో మరోసారి కలసి పని చేయనుండటం ఓ విశేషమైతే, ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్న జి.వి.ప్రకాష్‌కి సంగీత దర్శకుడిగా ఇది100వ చిత్రం కావడం మరో విశేషం. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ కీలక పాత్ర పోషించనున్నారు. సూర్య, దుల్కర్ ఇద్దరూ అద్భుతమైన పెర్ఫార్మర్స్. ఈ ఇద్దరినీ తెరపై చూడటం వారి వారి అభిమానులకు, ప్రేక్షకులకు ఫీస్ట్‌లా ఉండబోతుంది. అలాగే నజ్రియా ఫహద్, విజయ్ వర్మ కూడా స్టార్ కాస్ట్‌లో భాగం కానున్నారు. సూర్య సొంత నిర్మాణ సంస్థ, 2డి ఎంటర్‌టైన్‌మెంట్ పై జ్యోతిక, సూర్య, రాజశేఖర్ కర్పూర సుందర పాండియన్ దీన్ని పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు.

కయ్యాల చిందాట..



తరుణ్ భాస్కర్

తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'కీడా కోలా'. హీరో రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు.
వివేక్ సాగర్ సంగీతం సమకూరుస్తున్న ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ 'కయ్యాల చిందాట' పాటని మేకర్స్ గురువారం రిలీజ్‌చేశారు. మాస్‌ని రిడిఫైన్ చేస్తూ హై ఎనర్జీ అండ్ రేసింగ్ నెంబర్‌గా ఈ పాటను వివేక్ సాగర్ కంపోజ్ చేశారు. నిక్లేష్ సుంకోజీ అందించిన లిరిక్స్ యూనిక్ అండ్ క్యాచీగా ఉన్నాయి. హేమచంద్ర వాయిస్ పాటకు మరింత మాస్ పంచ్‌ని తీసుకొచ్చింది. విజి సైన్మా బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.1గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని కె.వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మిస్తున్నారు. నవంబర్ 3న ఈ సినిమా విడుదల కానుంది.

రవితేజ నయా సినిమా షురూ..



ఇందూజ రవిచంద్రన్, సెల్వరాఘవన్, రవితేజ, వి.వి.వినాయక్

రవితేజ, గోపీచంద్ మలినేని 4వసారి కలసి చేస్తున్న ప్రాజెక్ట్ సెట్స్‌కి వెళ్ళకముందే ప్రతి అనౌన్స్‌మెంట్‌తో హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేసింది. మైత్రీ మూవీస్ మేకర్స్ నిర్మించనున్న ఆర్‌టి4జీఎమ్ (వర్కింగ్ టైటిల్) భారీ స్థాయిలో రూపొందనుంది. ఈ సినిమాలో రవితేజ మునుపెన్నడూ చూడని పాత్రలో కనిపించనున్నారు.
సెల్వరాఘవన్, ఇందూజ రవిచంద్రన్ పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో గురువారం ఘనంగా ప్రారంభమైంది. స్క్రిప్ట్‌ని అల్లు అరవింద్ మేకర్స్‌కి అందజేశారు. ముహూర్తం షాట్‌కు అన్మోల్ శర్మ కెమెరా స్విచాన్ చేయగా, వివి వినాయక్ క్లాప్ ఇచ్చారు. తొలి షాట్‌కి కె రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు.
నటుడిగా మారిన ఫిల్మ్ మేకర్ సెల్వరాఘవన్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటించనున్నారు. ఇది ఆయన చేస్తున్న తొలి తెలుగు సినిమా. ఇందూజ రవిచంద్రన్‌ని ఓ కీలక పాత్ర కోసం ఎంచుకున్నారు.
ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనేది త్వరలో తెలియజేస్తారు. వాస్తవ సంఘటనల ఆధారంగా యూనిక్, పవర్‌ఫుల్ కథతో ఈ సినిమా రూపొందనుంది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందించనున్నారు. రవితేజతో తమన్‌కి ఇది 12వ చిత్రం కాగా, గోపీచంద్ మలినేనితో 7వ చిత్రం, మైత్రీ మూవీ మేకర్స్‌తో 4వ చిత్రం కావడం విశేషం.
ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ : జికె విష్ణు, ఎడిటింగ్ : నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైనర్ : ఏఎస్ ప్రకాష్, డైలాగ్స్ : సాయి మాధవ్ బుర్రా, రైటర్స్ : మయూఖ్ ఆదిత్య, శ్రీనివాస్ గవిరెడ్డి, ఎం వివేక్ ఆనంద్, శ్రీకాంత్ నిమ్మగడ్డ.

భిన్న ప్రయోగాత్మక చిత్రం



వికాస్ ముప్పాల, గాయత్రి గుప్తా

వికాస్ ముప్పాల, గాయత్రి గుప్తా, సాజ్వి పసల, సంతోష్ నందివాడ, కిషోర్ ప్రధాన పాత్రల్లో బి.బి.టి.ఫిల్మ్ బ్యానర్‌పై భాను భవ తారక దర్శకత్వంలో కార్తీక్ సేపురు, భాను భవ తారక, తరుణ్ విఘ్నేశ్వర్ సేరుపు నిర్మిస్తున్న చిత్రం 'ప్లాట్'. గురువారం ఈ చిత్ర ట్రైలర్‌ను దర్శకుడు వేణు ఊడుగుల ముఖ్య అతిథిగా పాల్గొని విడుదల చేశారు.
ఈ సందర్భంగా మీడియాతో దర్శక, నిర్మాత భాను భవతారక మాట్లాడుతూ, 'వేణు తీసిన 'నీదీ నాదీ ఒకే కథ' నాలో ధైర్యాన్ని నింపింది. కరోనా టైంలో ఈ కథ రాసుకున్నాను. నా స్నేహితులతో కలిసి సినిమాను నిర్మించాను. వికాస్ అయితే ఈ కథకు బాగుంటుందని అనుకున్నాం. మా దగ్గర ఉన్న వనరులతో సినిమాను తీశాం. ట్రైలర్, టీజర్ చూసిన తరువాత ఇదొక డిఫరెంట్ సినిమా అని ఆడియెన్స్‌కు అర్థమైంది, వారికి కచ్చితంగా నచ్చుతుంది. ప్రతీ క్రాఫ్ట్‌ను కొత్తగా చేశాం. అందరూ థియేటర్లో ఈ సినిమాను చూడండి. కొత్త అనుభూతికి లోనవుతారు' అని అన్నారు.
'మా సినిమా నవంబర్ 3న రిలీజ్ అవుతోంది. మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని నిర్మాత తరుణ్ విఘ్నేశ్వర్ చెప్పారు. వికాస్ ముప్పల మాట్లాడుతూ, 'ఈ సినిమా నాకెంతో ప్రత్యేకం. శంకర్ తీసిన 'స్నేహితుడు' చిత్రంలో నటించాను. ఈ సినిమా నాకు టర్నింగ్ పాయింట్. మేం ఎంతో నిజాయితీగా తీసిన ఈ చిత్రం ప్రేక్షకులందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'ఎంతో ప్యాషన్‌తో సినిమాను తీశారు. ఓ ఫిల్మ్ స్కూల్ నుంచి వస్తే ఎంత డీటైలింగ్‌గా చేస్తారో అంత అద్భుతంగా ఈ సినిమాను తీశారు' అని గాయత్రీ గుప్తా చెప్పారు. ఈ వేడుకలో పాల్గొన్న దర్శకులు వేణు ఊడుగుల, ఉదయ్, హర్ష, సంగీత దర్శకుడు కార్తిక్, సినిమాటోగ్రాఫర్ రమణ్ చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

సరికొత్త కథ



రజత్ రాఘవ్, ఐశ్వర్యరాజ్ బకుని

తెలుగు సినిమాలలో ప్రేక్షకులు ఎప్పుడూ వైవిధ్యం కోరుకుంటారు. సినిమాలో కంటెంట్ బాగుంటే అది చిన్నా-పెద్దా అనే తేడా చూడకుండా ఆ సినిమాను విశేషంగా ఆదరిస్తారు. మంచి కంటెంట్‌తో డి.ఎస్.ఆర్ ఫిలిమ్స్ బ్యానర్ 'మహర్ యోధ్ 1818' చిత్రాన్ని నిర్మిస్తోంది.
'మాయపేటిక, శ్రీవల్లి' వంటి పలు చిత్రాల్లో నటించిన హీరో రజత్ రాఘవ్, ఐశ్వర్య రాజ్ బకుని హీరోయిన్‌గా, రాజు గుడిగుంట్ల దర్శకత్వంలో సువర్ణ రాజు దాసరి నిర్మిస్తున్న సోషల్ థ్రిల్లర్, యాక్షన్, ఫాంటసీ చిత్రమిది.
ఈ చిత్ర పూజా కార్యక్రమాలు భద్రకాళీ పీఠం పీఠాదీశ్వరి శ్రీ శ్రీ శ్రీ డాక్టర్ సింధు మాతాజీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సారథి స్టూడియోలో గురువారం ఘనంగా జరిగాయి. అలాగే షూటింగ్ కూడా ప్రారంభమైంది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏ.పి.యస్.సి. సెల్ కమీషనర్ విక్టర్ ప్రసాద్ హీరో, హీరోయిన్‌లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టగా, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ దామోదర్ ప్రసాద్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. దర్శకుడు త్రినాథరావు నక్కిన గౌరవ దర్శకత్వం వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం చిత్ర యూనిట్ ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మేకర్స్ సినిమా విశేషాలను తెలిపారు. మరిన్ని వివరాలు చిత్ర బృందం త్వరలోనే ప్రకటించనుంది.
ఈ చిత్రానికి నిర్మాత : సువర్ణ రాజు దాసరి, దర్శకత్వం: రాజు గుడిగుంట్ల, సంగీతం : మహా-శశాంక్ ద్వయం, సినిమాటోగ్రాఫర్ : వెంకట్ , ఎడిటింగ్ : నందమూరి హరి.



ఇంగ్లండ్‌కు మరో షాక్

- శ్రీలంక చేతిలో ఓటమి



బెంగళూరు : డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్‌కు మరో షాక్ తగిలింది. వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా ఇప్పటికే ఆఫ్ఘనిస్తాన్ చేతిలో ఓడిన ఇంగ్లండ్ జట్టు.. గురువారం జరిగిన కీలకమైన మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో ఘోర పరాజయం చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. లంక బౌలర్ల ధాటికి 156 పరుగులకే కుప్పకూలింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని లంక.. 25.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. కుశాల్ పెరీరా (4), కుశాల్ మెండిస్ (11) విఫలమైనా.. పాథుమ్ నిశాంక (77 రన్స్, 83 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), సదీర విక్రమార్క (65 రన్స్, 54 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు బాదడంతో లంక సునాయసంగా విజయం సాధించింది. ఆరంభంలో రెండు వికెట్లు కోల్పోయి లంక ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో నిశాంక, విక్రమార్క క్రీజులో నిలదొక్కుకుని నిలకడగా బౌండరీలు బాది జట్టును విజయ తీరాలకు చేర్చారు. ఇంగ్లండ్ బౌలర్లలో డేవిడ్ విల్లీ రెండు వికెట్లు పడగొట్టాడు.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 33.2 ఓవర్లలో 156 పరుగులకే కుప్పకూలింది. బ్యాటింగ్‌కు స్వర్గధామమైన చిన్నస్వామి స్టేడియంలో శ్రీలంక పేసర్ల ధాటికి ఇంగ్లండ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. ఒక్కరు కూడా అర్ధ శతకం చేయలేకపోయారు. బెన్‌స్టోక్స్ (43 రన్స్, 73 బంతుల్లో 6 ఫోర్లు) టాప్ స్కోరర్. జానీ బెయిర్‌స్టో (30 రన్స్, 31 బంతుల్లో 3 ఫోర్లు), డేవిడ్ మలన్ (28 రన్స్, 25 బంతుల్లో 6 ఫోర్లు) కాసేపు నిలకడగానే ఆడినా ఎక్కువ సమయం క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. జోరూట్ (3,) జోస్ బట్లర్ (8), లియామ్ లివింగ్‌స్టోన్ (1) ఘోరంగా విఫలమయ్యారు. తర్వాత వచ్చిన మొయిన్ అలీ (15 రన్స్ 15 బంతుల్లో) కూడా ఆకట్టుకోలేకపోయాడు. క్రిస్ వోక్స్ (0), ఆడిల్ రషీద్ (2), మార్క్ వుడ్ (5), డేవిడ్ విల్లీ (14) పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో లాహిరు కుమార 3, ఏంజెలో మాథ్యూస్ 2, కాసున్ రజిత 2, మహీశ్ తీక్షణ ఒక వికెట్ పడగొట్టారు.

సెమీస్ అవకాశాలు మరింత సంక్లిష్టం

శ్రీలంకపై ఓటమితో ఇంగ్లండ్ సెమీస్ అవకాశాలు మరింత సంక్లిష్టమయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన ఇంగ్లండ్.. ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లు ఆడి ఒకే మ్యాచ్‌లో నెగ్గింది. అది కూడా బంగ్లాదేశ్‌పై. కివీస్, ఆఫ్ఘనిస్థాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక చేతుల్లో ఓడింది. మిగిలిన నాలుగు మ్యాచుల్లో విజయం సాధిస్తేనే సెమీస్‌కు వచ్చే అవకాశాలున్నాయి. అయితే, ఆ నాలుగు మ్యాచుల్లో ఇంగ్లండ్ విజయం సాధించడం అంత సులువు కాదు. భారత్, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, పాకిస్థాన్‌తో ఆ జట్టు తలపడాల్సి ఉండటమే ఇందుకు కారణం. ఇంగ్లండ్ తన తర్వాతి మ్యాచ్‌లో టీమ్ ఇండియాతో తలపడనుంది.

వరుస విజయాలతో జోరు మీదున్న రోహిత్ సేనపై పైచేయి సాధించాలంటే ఇంగ్లండ్ శక్తికి మించి కృషి చేయాల్సిందే. మరోవైపు, మొదటి రెండు మ్యాచుల్లో ఓడిన ఆసీస్.. తర్వాత మూడు మ్యాచుల్లో నెగ్గి సెమీస్ రేసులో ముందుకొచ్చింది. నెదర్లాండ్స్‌ను కూడా తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. సౌతాఫ్రికాను డచ్ జట్టు ఎలా చిత్తుగా ఓడించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పాకిస్థాన్ కూడా తనదైన రోజు ఎంత పెద్ద జట్టునైనా ఓడించగలదు. ఈ సవాళ్లను అధిగమించి ఇంగ్లండ్ సెమీస్‌కు వస్తే అది అద్భుతమే అవుతుంది.



జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ షురూ

హైదరాబాద్: గచ్చిబౌలి పుల్లెల గోపీచంద్ అకాడమీ వేదికగా గురువారం ఆల్ఇండియా సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభమైంది. రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న టోర్నీలో పలు రాష్ట్రాలకు చెందిన యువ ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఏపీ మాజీ సీఎస్ సుబ్రమణ్యం, జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ 'ప్రతీ ప్లేయర్ గెలుపు, ఓటములను స్ఫూర్తిగా తీసుకోవాలి. గెలిచినప్పుడు పొంగిపోవడం, ఓడినప్పుడు కుంగిపోకుండా కెరీర్ కొనసాగించాలి. ఆటలో ఎత్తుపల్లాలు సహజం. గెలిచేందుకు కడదాకా ప్రయత్నించాలి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి బ్యాడ్మింటన్ అసోసియేషన్ వైస్ ఛైర్మన్ శ్రీనివాసగుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, యూవీఎస్ బాబు, వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల వన్డే క్రికెట్ టోర్నీ విజేత ముంబై



విజయనగరం : అండర్-19 అంతరాష్ట్ర మహిళల వన్డే క్రికెట్ పోటీల్లో ముంబై జట్టు విజేతగా నిలిచింది. విజయనగరంలోని చింతలవలస క్రికెట్ అకాడమీలో మహారాష్ట్ర జట్టుతో గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన మహారాష్ట్ర జట్టు 33.3 ఓవర్లలో 10 వికెట్లు నష్టపోయి 89 పరుగులు చేసింది. ఈ జట్టును తక్కువ పరుగులకు కట్టడి చేయడంలో ముంబై బౌలర్ హర్లే గాలా నాలుగు వికెట్లు పడగొట్టి కీలకపాత్ర పోషించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ముంబై జట్టు 17.2 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు నష్టపోయి 92 పరుగులు చేసింది.

8 వికెట్ల తేడాతో ముంబై జట్టు విజయం సాధించింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. బిసిసిఐ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లాలో టోర్నీ నిర్వహణకు కృషి చేసిన అసోసియేషన్ సభ్యులకు, నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ సిబ్బందిని, జిల్లా క్రికెట్ అసోసియేషన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం టోర్నీ విజేత ముంబై క్రికెట్ జట్టుకు ట్రోఫీని అందజేశారు. రన్నరప్ మహారాష్ట్ర జట్టు సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ చైర్మన్ సన్యాసిరాజు, కన్వీనర్ పి.దేవవర్మ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు పాల్గొన్నారు

ఆటలు

భారత్-శ్రీలంక మ్యాచ్ టిక్కెట్ల విడుదల



ముంబయి : వన్డే ప్రపంచకప్‌లో భారత్-శ్రీలంక జట్ల మధ్య మ్యాచ్ ముంబయి వేదికగా జరగనుంది. నవంబర్ 2న జరిగే ఈ మ్యాచ్‌కు సంబంధించిన టిక్కెట్లను బీసీసీఐ విడుదల చేసింది. గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆన్‌లైన్ వేదికగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ విధంగా భారత్ మ్యాచ్‌కు వారం ముందే టికెట్లను విడుదల చేయడం ఇది రెండోసారి. గతంలో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌కూ ఖాళీలనుబట్టి టికెట్లను మరోసారి అందుబాటులోకి తీసుకొచ్చింది. భారత్-ఆసీస్ మ్యాచ్ సందర్భంగా కొన్ని సీట్లు ఖాళీగా కనిపించాయి. ఆన్‌లైన్‌లో మాత్రం అన్నీ బుక్ అయినట్లు చూపించడం గమనార్హం.

పారా ఆసియా క్రీడల్లో భారత్ రికార్డు

80 చేరిన పతకాలు



హాంగ్‌జౌ : చైనాలో జరుగుతున్న పారా ఆసియా క్రీడల్లో భారత్ పతక దూకుడు కొనసాగిస్తోంది. ఈ క్రీడల్లో గురువారంతో భారత్ సాధించిన పతకాల సంఖ్య 80కు చేరుకుంది. ఇందులో 18 బంగారు, 23 రజతాలు, 39 కాంస్య పతకాలు ఉన్నాయి. 2018లో భారత్ ఈ క్రీడల్లో 72 పతకాలు (15 బంగారం, 24 రజతం, 33 కాంస్య) సాధించింది. ఇప్పటి వరకూ అదే అత్యధికం. తాజా క్రీడల్లో భారత్ తన రికార్డును తానే అధిగమించింది. గురువారం ముందుగా సచిన్ సర్జేరావు ఖిలారి స్వర్ణం సాధించాడు. పురుషుల ఎఫ్46 షాట్‌పుట్‌లో 16.03 మీటర్లు (ఈ గేమ్స్‌లో రికార్డు) విసిరి ప్రథమ స్థానంలో నిలిచాడు. భారత్‌కు చెందిన రోహిత్ కుమార్ 14.56 మీటర్లు విసిరి కాంస్యం సొంతం చేసుకున్నాడు. అలాగే ఆర్6 మిక్స్‌డ్ 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఎస్‌హెచ్1 విభాగంలో సిద్ధార్థ బాబు 247.7 పాయింట్లతో భారత్‌కు మరో బంగారు పతకం అందించాడు. సీతల్ దేవి-రాకేష్ కుమార్‌ల కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ కూడా బంగారు పతకం సాధించింది. మిగిలి అంశాల్లో కూడా భారత్ పారా క్రీడాకారులు పతకాలు సాధించడంతో పతకాలు సంఖ్య 80కు చేరుకుంది. ఈ క్రీడలు ఇంకా రెండు రోజుల పాటు జరుగుతుండటంతో భారత్ పతకాల సంఖ్య 100 దాటుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆమెకే సాధ్యం

సమాజంలో రోజురోజుకు మార్పులు చెందుతూనే ఉన్నాయి. ఈ అభివృద్ధితో పాటే జీవనశైలీ మారిపోతోంది. మగవారి సంగతి పక్కనపెడితే మహిళలు ఇంటా బయటా తామేంటో నిరూపించుకుంటున్నారు. ఆడవాళ్ళు వీళ్ళేం చేయగలరు అనే దగ్గరి నుండి వాళ్ళు మాత్రమే చేయగలరు అనేంతగా మార్పులు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఇది పరిశోధనల్లో తేలిన సత్యం. అన్ని రంగాల్లోనూ ధైర్యంగా నెగ్గుకురావడం మహిళలకు వెన్నతో పెట్టిన విద్య అని పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. ఆ వివరాలేంటో మనమూ తెలుసుకుందాం...

ఒకేసారి వేర్వేరు పనులు చేయగలగడాన్ని మనం మల్టీ టాస్కింగ్ అంటాం. ప్రస్తుత ప్రపంచంలో ముందడుకు వేయాలంటే పోటీ పడక తప్పదు. ఉరుకుల పరుగుల జీవితంలో మల్టీ టాస్కింగ్‌లో నిష్ణాతులు అయితే కానీ ముందుకు సాగలేని పరిస్థితి. ఇక మహిళల జీవితంలో అయితే ఈ మల్టీ టాస్కింగ్ తప్ప నిసరిగా మారిపోయింది. ఒక పక్క వంట పని చూసుకోవాలి, మరోపక్క పిల్లల్ని బడికి సిద్ధం చేయాలి, ఇంకో పక్క ఇంటికి వచ్చే వారికి సమాధానం చెప్పుకోవాలి. ఇవిమాత్రమే కాకుండా ఉద్యోగాలు చేసేవారికైతే... వారి హడావుడి గురించి మాటల్లో చెప్పలేం. మొత్తానికి ఇంట్లోనే ఉండే గృహిణులైనా, ఆఫీసుల్లో పనిచేస్తున్న ఉద్యోగినులైనా... మల్టీ టాస్కింగ్ మాత్రం తప్పనిసరి.



ఈ మల్టీటాస్కింగ్ చేయడంలో మగవారికీ, ఆడవారికీ మధ్య ఏమన్నా తేడా ఉందేమో అన్న అనుమానం వచ్చింది కొందరు పరిశోధకులకి. రష్యాకి చెందిన పరిశోధకులు తమ అనుమానాన్ని నివృత్తి చేసుకునేందుకుగాను ఆడవారిని, మగవారిని ఎంచుకున్నారు. వీరిలో 20 నుంచి 65 ఏండ్లలోపు వయసు కలిగిన వారు ఉన్నారు. వీరందరికీ కూడా ఒకేసారి వేర్వేరు పనులను అప్పగించారు. ఉదాహరణకు ఒక చేత్తో వేర్వేరు ఆకారాలలో ఉన్న వస్తువులను వేరు చేస్తూ, మరో చేత్తో వేరు వేరు అంకెలని వరుసక్రమంలో ఉంచమన్నారు.

అభ్యర్థులు మల్టీటాస్కింగ్ చేస్తున్న సమయంలో వారి మెదడు ఎలా పని చేస్తోందో తెలుసుకొనేందుకు ఎమ్మారై పరీక్షలు కూడా చేసి చూశారు. దీంతో మల్టీటాస్కింగ్ చేసే సమయంలో మగవారి మెదడు ఆడవారి మెదడుకంటే ఎక్కువ శక్తిని వినియోగించుకోవడాన్ని వారు గమనించారు. అలాగే వేర్వేరు పనులు ఒకేసారి చేయాల్సి వచ్చినప్పుడు, వారి మెదడులోని వేర్వేరు భాగాలన్నీ కలసి పనిచేయాల్సి వచ్చిందట. కానీ ఆడవారిలో మెదళ్ళ మాత్రం ఎలాంటి హడావుడీ లేకుండా అతి తక్కువ సమయంలో, అతి తక్కువ శక్తిని ఉపయోగిస్తూ... వేర్వేరు పనులను ప్రశాంతంగా నిర్వహించేశాయి. ఎప్పుడో 50 ఏండ్లు దాటిన తర్వాత గానీ ఆడవారిలో మల్టీటాస్కింగ్ సామర్థ్యంలో తగ్గుదల కనిపించలేదు.

ఆడవారిలో కనిపించిన ఈ ప్రత్యేకతకి కారణం ఏమిటన్నది మాత్రం పరిశోధకులకు ఇంకా అంతుపట్టలేదు. బహుశా ఇంటిని చక్కదిద్దుకునే ప్రయత్నంలో ఆడవారికి అప్రయత్నంగానే ఈ నైపుణ్యం వచ్చి ఉంటుంది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే మనోనిబ్బరంతోనే ఇది సాధ్యపడి ఉంటుంది. కానీ ఒకేసారి ఇన్నేసి పనులు చేస్తున్నారు కదా అని... వారితో వీలైనంత చాకిరీ చేయించుకోవడమే బాధ కలిగించే విషయం.

ఇట్ల చేద్దాం

ఏవైనా వండేపుడు ఆహార పదార్థాలు స్టవ్ మీద పొంగిపడినా లేదా పాలు పొంగి పోయినా ఒక రకమైన పొగ వస్తుంది. దానిని రాకుండా చేయాలంటే వెంటనే కొంచెం ఉప్పు తీసుకుని ఆ ప్రదేశంలో చల్లితే పొగ పోతుంది.





అనుభవం ఇచ్చిన ప్రేరణ పల్ప్ బ్రూ

ఆరోగ్యానికి వ్యాయామం ఎంత ముఖ్యమో.. మనం తీసుకునే ఆహారం కూడా అంతే ముఖ్యం అని నమ్మే వాళ్ళల్లో వకుళా శర్మ ముందు వరుసలో ఉంటారు. సూపర్ ఫాస్ట్ యుగంలో ఫాస్ట్ ఫుడ్‌కి అలవాటు పడిన జనాన్ని సులభమైన మార్గంలో రసాయనాలు కలపని, పోషక విలువలు కోల్పోని పండ్లు, ఆకుకూరల ముక్కలకు అలవాటు చేసిన ఘనత ఆమెది. కాదేది ప్రయోగశాలకు అనర్హం అన్నట్టు తన కూతురు పడకగదినే ప్రయోగశాలగా మలచారు. అసలు ఈ స్మూతీల తయారీకి బీజం ఎక్కడ పడిందో తెలుసుకుందాం...

వకుళ గర్భవతిగా ఉన్నప్పుడు యు.ఎస్‌లో వాళ్ళ బంధువుల ఇంటికి వెళ్లారు. సహజంగా శాఖాహారి అయిన ఆమె సమతుల్యమైన ఆహారం తీసుకొనే క్రమంలో అక్కడే ఆమెకు స్మూతీలు పరిచయమయ్యాయి. షాపుకు వెళ్ళి తానే స్వయంగా తెచ్చుకునేవారు. విభిన్నమైన ఆ రుచికి ఫిన్నురాలయ్యారు. ఇండియా తిరిగి రాగానే వాటిని తయారు చేయడానికి పూనుకున్నారు. ఇంట్లోనే ఆకుకూరలు, కూరగాయలతో తయారు చేసి వాటిని ఆహారంలో తీసుకుని ఆనందించేవారు. 2017లో పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చారు. పచ్చి బాలింత పత్యాలు, టానిక్కులు, చేదుమందుల బెడద ఎలా వదిలించుకోవాలి? మందులతో శరీరాన్ని పోషించడం ఇష్టం లేదు. చల్ల చల్లని పానీయాలతో కడుపు నింపుకోవాలనే ఆలోచన. అందుకే బాలింతలు తీసుకోవాల్సిన పోషకాల గురించి తెలుసుకున్నారు. అవి ఏఏ పండ్లలో దొరుకుతాయో అన్వేషించారు. వాటిని తనకు నచ్చిన విధంగా తయారు చేసుకుని క్రమం తప్పకుండా తీసుకునేవారు.

ఆరు నెలల్లో మార్పులు

ఆ స్మూతిలు ఆరు నెలల్లోనే ఆమెలో అనూహ్యమైన మార్పులు తీసుకొచ్చాయి. చర్మం నిగనిగలాడింది, బరువు తగ్గింది, కీళ్ల నొప్పులు మటుమాయం, కళ్ళల్లో కాంతి, కురులు నిగారించాయి... ఇక తన ఆనందాన్ని అవధులు లేవు. పాపను చూడటానికి వచ్చిన బంధువులు ఈమెను చూసి ఆశ్చర్యపోయారు. వారికి తనే స్వయంగా ఆ స్మూతిలను చేసి పంచి ఇచ్చేవారు. అలా వచ్చిన వారందరికీ తన చేసి స్మూతీలు పరిచయ్యాయి. ఆ రుచికి అలవాటు పడిన వారు మెచ్చి ఫంక్షన్స్‌కి, పార్టీలకి ఆర్డర్లు ఇవ్వడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే ఆమె పోషక విలువల పట్ల అవగాహన పెంచుకునేందుకు డిప్లొమా ఇన్ న్యూట్రిషన్ పూర్తిచేశారు.

కలల సాకారం

అమ్మ అందించిన అనుభవాల సారం, ఇందన సహకారం, తోడు, సహజ జిజ్ఞాస ఆమెను ఆంత్రోప్రెన్యూర్‌గా మార్చాయి. వ్యాపార అనుమతుల కోసం చంటి బిడ్డను వెంటేసుకొని తిరిగారు. వెనకడుగు వేయని ధీర వనితలా పల్ప్ బ్రూ స్టార్టప్‌కు ప్రాణం పోశారు. మొదట్లో ఫ్లేవర్స్ చాలా తయారు చేశారు. ప్రచారం కోసం పెద్ద పెద్ద అడ్వర్టైజ్మెంట్ కంపెనీల చుట్టూ తిరిగి చేతులు కాల్చుకున్నారు. అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్నారు. 'జ్యూసులు తయారు చేసుకుంటున్నాం ఇవెందుకు? సీసాల్లో స్మూతీలు ఉండగా నీ పల్ప్ బ్రూ కొనాల్సిన పని ఏముంది?' ఇలా రకరకాల ప్రశ్నలు. అన్నింటికీ తగిన జవాబులు చెప్పారు వకుళ. అందరినీ మెప్పించారు. అపజయాలు పలకరించినా వెనుకడుగు వేయలేదు.

వి హబ్ సహకారం

బీటెక్ చదివి ఐటీ కంపెనీలో జాబ్ చేసి, ఆర్కిటెక్చర్‌లో అనుభవం ఉండటంతో తన భర్తతో కలిసి కొంత కాలం ఉద్యోగం చేశారు. తర్వాత స్నేహితురాలి సహాయంతో వి హబ్ గురించి తెలుసుకొని వారి ద్వారా తన వ్యాపారానికి ఫండింగ్ పొందారు. ఎన్నో వ్యాపార మెళుకువలు వారి నుంచే నేర్చుకున్నారు. తల్లి ప్రేరణతో మొదలైన ఆమె ప్రయాణం భర్త అజయ్ భూషణ్ సహాయ సహకారాలతో కొనసాగుతూనే ఉంది. కాన్సెప్ట్ ప్రారంభం నుండి పల్ప్‌బ్రూకి వెన్నెముకగా ఉన్నారు వారు. పండ్లు, కూరగాయలను ముక్కలు చేయడం నుండి, ట్రయల్ మిశ్రమాలను రుచి చూసి పరీక్షించడం, తుది ఉత్పత్తుల అమలు నిర్ణయాలపై ఇన్‌పుట్‌లను పంచుకోవడం, బ్లెండర్‌లను హెచ్చు తగ్గులలో ఉంచడం వరకు ముఖ్య భూమిక పోషించారు అజయ్.



తయారీ విధానం

పల్ప్‌బ్రూ... పండిన పండ్లు, తాజా కూరగాయలు, ఆకుకూరలు, జాజికాయ, చియా గింజలు, అవిసె గింజలు, ఖర్జూరాలు, కోకో వంటి యాంటీ ఆక్సిడెంట్ - రిచ్ సూపర్ ఫుడ్‌లతో తయారు చేసి రెడీ-టు-బ్లెండ్ స్మూతీలను అందిస్తుంది. ఇది ఇండివిజువల్ క్విక్ ఫ్రీజింగ్ (క్విూఫీ) లేదా బ్లాస్ట్-ఫ్రీజింగ్ టెక్నిక్‌ని ఉపయోగిస్తుంది. తద్వారా ఆహారం ఆకారం, రంగు, రుచి, వాసన, తాజాదనం, దాని పోషక విలువలను కలిగి ఉంటుంది. ఇది సుదీర్ఘ షెల్ఫ్ జీవితాన్ని కలిగి ఉంది. పదార్థాలను ఎంచుకోవడంలో, వినియోగదారు ప్రతి ప్యాక్‌లో ఉత్తమమైన పోషకాహారాన్ని పొందేలా చేయడంలో తగినంత జాగ్రత్తలు తీసుకుంటారు. అందుకే నేమో పల్ప్ బ్రూ వెయిట్ లాస్‌కి చక్కగా ఉపయోగపడుతోంది.

హైదరాబాద్‌లో మొదలై...

ఇంతులు తలచిన ఇలలో చేతకానిదేమున్నది వారి చేతిలో. ఎందులోనూ తీసిపోరుగా... అవని నుంచి ఆకాశపుటంచులదాకా... ఓర్పు నేర్పులతో ఎదిగే సత్తా మహిళలకు మాత్రమే ఉంది. యోగా గురువుగా జర్నీ మొదలు పెట్టిన వకుళశ ఇప్పుడు ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగారు. హైదరాబాద్‌లో మొదలైన వ్యాపారం నేడు బెంగుళూరు, ముంబై, పూణే తదితర నగరాలకు విస్తరించింది. ఇలా ఆమె వారు మరింత ఉన్నతిని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం.

- ఘాలి లలిత ప్రవల్లిక, 9603274351

జక్కలొద్దిపై జబర్‌దస్తీ

(మొదటిపేజీ తరువాయి)

నాయకులను ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య మాట్లాడుతూ.. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్ ఓటమి భయంతోనే సీపీఐ(ఎం) నాయకులను అక్రమంగా అరెస్టు చేపిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నన్నపనేని నరేందర్, ఆయన అనుచరులు తూర్పులో గుండాయిజం చెలాయిస్తూ సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే జక్కలొద్దిలో 3000మంది గుడిసె వాసుల దగ్గరికి వెళ్లి బీఆర్ఎస్ పార్టీలో చేరితేనే గుడిసెలు ఉంటాయని, సంక్షేమ పథకాలు అందుతాయని ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని, వినకుంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే భవిష్యత్తులో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం కొండ సురేఖ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపనేని నరేందర్, ఆయన అనుచరులు జక్కలొద్దిలోని గుడిసె వాసుల దగ్గరికి గురువారం ఉదయం వెళ్లి బలవంతంగా సుమారు 1500మందిని బీఆర్ఎస్ పార్టీలోకి చేర్చుకోవడం అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో చేరకుంటే మీకు ఇండ్లు ఉండవని గుడిసెవాసులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ నియమాలను పాటించకుండా వివిధ డివిజన్లలో కూడా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, బీఆర్ఎస్ జెండాలు కప్పి పార్టీలోకి చేర్చుకోవడం సరికాదన్నారు. అలాంటి వారిపై కేసులు పెట్టకుండా సీపీఐ(ఎం) నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అత్యంత దారుణమని, వెంటనే నన్నపనేని నరేందర్‌పై కేసు పెట్టి అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలోత్ సాగర్, సింగారపు బాబు, నలిగంటి రత్నమాల, ముక్కెర రామస్వామి, ఆరూరి కుమార్, కాంగ్రెస్ నాయకులు నల్గొండ రమేష్, మీసాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ దాడి అనైతికం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరంగల్ జిల్లా జక్కలొద్ది ప్రాంతంలోని పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చి, గద్దెలను, సీపీఐ(ఎం) జెండాలను తొలగించి బలవంతంగా బీఆర్ఎస్ జెండాలను కట్టి నాయకులపై దాడులు చేసి బెదిరింపులకు పాల్పడడాన్ని సీపీఐ(ఎం) రాష్ట్రకమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ దాడి అనైతికమని విమర్శించింది. ప్రజలను బెదిరించి ఎన్నికల్లో గెలుస్తారా?అని ప్రశ్నించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం ఉదయం ఐదు గంటలకే ముందస్తు పథకం ప్రకారం తూర్పు వరంగల్ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ తన 100 మంది గూండాలను తీసుకొచ్చి గుడిసె వాసులపై దౌర్జన్యానికి పూనుకున్నారని తెలిపారు. సీపీఐ(ఎం) రంగసాయిపేట ప్రాంత కార్యదర్శి మాలోతు సాగర్, నాయకులు గణపాక ఓదేలు, ప్రత్యూషపై తప్పుడు ఫిర్యాదు చేసి అరెస్టు చేయించారని పేర్కొన్నారు. గుడిసెవాసులంతా బీఆర్ఎస్‌లో చేరాలనీ, కండువాలను కప్పుకోవాలనీ, లేదంటే ప్రస్తుతం ఉన్న గుడిసెలను పీకేస్తామంటూ బెదిరించారని తెలిపారు. వాటిని నేలమట్టం చేస్తామంటూ హూంకరించారని పేర్కొన్నారు. పేదలపట్ల కక్షపూరితంగా వ్యవహరించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో సంయమనంతో ఉండాల్సిన అధికారపార్టీ నాయకులు, ఇతర రాజకీయ పార్టీల నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ బెదిరింపులకు భయపడబోమని స్పష్టం చేశారు. గుడిసె వాసులకు ఎర్రజెండా అండగా ఉంటుందని పేర్కొన్నారు. పేదల గుడిసెలపై దాడులకు పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఎన్నికల కమిషన్ (ఈసీ) జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రబీర్ పుర్కాయస్థకు వచ్చేనెల 2 వరకు పోలీసు కస్టడీ


(మొదటిపేజీ తరువాయి)

పలువురు జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసులు దాడి చేసిన తర్వాత అక్టోబర్ 3న పుర్కాయస్థ, చక్రవర్తిలను అరెస్టు చేసిన విషయం విదితమే. నగర న్యాయస్థానం వారిని మొదట ఏడు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. తర్వాత జ్యుడీషియల్ కస్టడీని అక్టోబర్ 25 వరకు పొడిగించింది. జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో వారిని పాటియాలా హౌస్ కోర్టు అదనపు సెషన్స్ జడ్జి హర్దీప్ కౌర్ ముందు హాజరుపరిచారు.

సివిల్ సర్వీసుల్లో ఎస్సీ,ఎస్టీ, ఓబీసీల వెనకబాటు

న్యూఢిల్లీ : భారత్‌లో ఈ ఏడాదిలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరగనున్నాయి. రాబోయే ఏడాదిలో లోక్‌సభ ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలు కీలకంగా వ్యవహరించనున్నారు. రాజకీయ పార్టీలు సైతం వీరిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అయితే, ఎన్నికల్లో కీలకంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలు బ్యూరోక్రసీలో మాత్రం ఎందుకు వెనకబడిపోతున్నాయని వారు ప్రశ్నిస్తున్నారు. ఇందుకు ప్రభుత్వాలు ఉదాసీన వైఖరిని సైతం వారు తప్పుబడుతున్నారు.

భారతదేశంలోని అత్యున్నత బ్యూరోక్రసీలో వైవిధ్యం లేకపోవటం స్పష్టమవుతున్నది. ప్రస్తుతం వివిధ మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్లలో సెంట్రల్ స్టాఫింగ్ స్కీమ్ కింద జాయింట్ సెక్రెటరీలు, సెక్రెటరీల పోస్టులను కలిగి ఉన్న మొత్తం 322 మంది అధికారులలో ఎస్సీలు 16, ఎస్టీలు 13, ఓబీసీలు 39 మంది, జనరల్ కేటగిరీకి చెందినవారు 254 మంది ఉన్నారు. గతేడాది మార్చి నాటికి ప్రభుత్వ సమాచారం ప్రకారం.. 91 మంది అదనపు కార్యదర్శుల్లో ఎస్సీలు పది మంది, ఎస్టీలు నలుగురు, ఓబీసీలు 245 మంది ఉన్నారు. ఇక 245 మంది జాయింట్ సెక్రెటరీలలో అధికారుల సంఖ్య ఎస్సీ, ఎస్టీలు కలిపి 26 మంది కాగా.. ఓబీసీలు 29 మంది ఉన్నారు.



కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలోనూ దేశంలో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. 2015 నాటి డేటా ప్రకారం 70 మంది కార్యదర్శులలో ఎస్సీలు ముగ్గురు, ఎస్టీలు ముగ్గురు ఉండగా.. ఓబీసీ అధికారులు ఒక్కరూ లేకపోవటం గమనార్హం. 278 మంది జాయింట్ సెక్రటరీలలో ఎస్సీలు 24 మంది, ఎస్టీలు 10 మంది, ఓబీసీలు 10 మంది అధికారులు మాత్రమే ఉన్నారు.

వివిధ కేటగిరీలకు సివిల్ సర్వీసెస్ పరీక్షకు పదవీకాలం, వయస్సు ప్రమాణాలలో వ్యత్యాసం ఉంటుంది. ఆర్థికంగా వెనుకబడిన విభాగం (ఈడబ్ల్యూఎస్) కేటగిరీల అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితి 32. అయితే ఓబీసీలకు ఇది 35 కాగా.. ఎస్సీ, ఎస్టీలకు ఇది 37 ఏండ్లుగా ఉన్నది. అయితే, పరోక్షంగా ఇది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థులలో చాలా మందికి తక్కువ సర్వీసుకు కారణమవుతున్నదని విశ్లేషకులు అంటున్నారు.

కేసీఆర్‌పై పోటీకి సై



(మొదటిపేజీ తరువాయి)

వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గురువారం నాడిక్కడ ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలతో కలిసి రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం... ఈ మూడు పార్టీలు చెడ్డీ గ్యాంగ్ లాంటివని ఆయన ఆరోపించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేయనున్నాయని, ఈ దిశలో సీట్ల పంపకాలు కూడా జరిగిపోయాయని చెప్పారు. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. 'తెలంగాణలో బీజేపీ అనుకూల ప్రభుత్వమే ఉంది. అందుకే అక్కడ ఎటువంటి దాడులు ఉండవు. లేదంటే ఎన్నికలు ఉండే రాష్ట్రాలకు ఈడీ, సీబీఐలు ముందు వెళ్తాయి. కాంగ్రెస్‌ను వీడిన నాయకులు బీజేపీ సిద్ధాంతాలు నమ్మి పోలేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ.. కేసీఆర్ పై చర్యలు తీసుకుంటుందని నమ్మి బీజేపీలోకి వెళ్లారు. అది అక్కడ సాధ్యం కాదని నమ్మి వెనక్కి వస్తున్నారు.' అని వ్యాఖ్యానించారు. రాజ్ గోపాల్ రెడ్డి, డి.కె అరుణ, విజయశాంతి, విశ్వేశ్వర్ రెడ్డిలు సిద్ధాంతాలు నమ్మి బీజేపీలో చేరలేదన్నారు. కాంగ్రెస్‌లో చేరే వారికి పార్టీ సముచిత ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. బీజేపీ, జనసేనతో పాటు కేఏ పాల్‌కు చెందిన ప్రజాశాంతి పార్టీని కూడా చేర్చుకుంటే బాగుండేదని ఎద్దేవా చేశారు. ఎంఐఎంతో కలిసి వెళ్లే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు.

కేసీఆర్ నిధులు ఆపాలని చూస్తుండ్రు

బీసీ బంధు, గృహలక్ష్మి, రైతు బంధు వంటి పథకాల చెల్లింపులు నవంబర్ 2లోగా విడుదల చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే నగదు బదిలీని పూర్తి చేయాలని ఈసీకి చెప్పామని, కానీ, సంక్షేమ పథకాలు ఆపేయాలని ఫిర్యాదు చేసినట్టు బీఆర్ఎస్ తమపై తప్పుడు ప్రచారం చేస్తుందని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీని బూచిగా చూపి కేసీఆర్ చెల్లింపులు ఆపాలని చూస్తున్నారన్నారు. తమపై తప్పుడు ప్రచారం చేసినా బీఆర్ఎస్‌ను ఎవరూ ఓటమి నుంచి కాపాడలేరన్నారు. మళ్లీ కేసీఆర్ మాయలో పడేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఒకవేళ కేసీఆర్ చెల్లింపులు వాయిదా వేస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెల్లిస్తుందన్నారు. ఇప్పుడు తీసుకుంటే రూ.10 వేల రైతు బంధు, రూ. 2 వేల పెన్షన్ మాత్రమే వస్తుందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తీసుకుంటే రూ.15 వేల రైతు బంధు, రూ.4 వేల పెన్షన్ చెల్లిస్తుందని తెలిపారు. రిటైర్డ్ అధికారులకు పదవులిచ్చి ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టేందుకు కేసీఆర్ ప్రైవేటు ఆర్మీలా వాడుకుంటు న్నారని విమర్శించారు. నిజాం దగ్గర రజాకార్ల లాగా.. కేసీఆర్ వద్ద ఈ అధికారులు పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గాల్లో మేడలా మేడిగడ్డ నిర్మాణం

సాయిల్ టెస్ట్ వంటి జాగ్రత్తలు పాటించకుండా... గాల్లో మేడలా మేడిగడ్డ ప్రాజెక్టును నిర్మించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈఎన్సీ మురళీధర్ రావు 12 ఏండ్ల క్రితం రిటైర్ అయ్యారని, కేసీఆర్‌కి, మురళీధర్ రావుకి ఉన్న సంబంధమేంటని నిలదీశారు. దోచుకునేందుకే ఇలాంటి అధికారులను పెట్టుకున్నారని ఆరోపించారు. ఇసుక కొట్టుకు పోతే డ్యాం కుంగిందంటే, ఎంత నాణ్యత లోపం ఉందో స్పష్టంగా తెలుస్తుందన్నారు. కేంద్రం నుంచి వచ్చిన డ్యామ్ సేఫ్టీ అధికారులు మేడిగడ్డను పరిశీలించిన అనంతరం ఇచ్చిన నివేదికను ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. ఇంత ప్రమాదం జరిగితే ఎల్అండ్ టీ సంస్థపై ఎందుకు చర్యలు తీసుకోలేదని, వారిని ఎందుకు బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం లేదని అన్నారు. కేంద్రానికి, బీఆర్ఎస్‌కు ఉన్న లాలూచీ ఏంటి..? అని ప్రశ్నించారు. మేడిగడ్డ కాదు.. కేసీఆర్ ప్రభుత్వం కుంగిపోయే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌ను కాపాడేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని అన్నారు. కేంద్రానికి కేసీఆర్ ప్రొటెక్షన్ మనీ చెల్లించినందునే రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ బిల్లా రంగా లాంటివారని.. కేసీఆర్ చార్లెస్ శోభారాజ్ లాంటి వారని విమర్శించారు. వాళ్లేం చేశారో చెప్పకుండా కాంగ్రెస్‌పై ఎదురు దాడికి దిగుతున్నారని ఫైర్ అయ్యారు. ఈడీ, ఐటీ, సీబీఐ బీజేపీకి ఫ్రంటల్ ఆర్గనైజేషన్లని ఆరోపించారు.

త్వరలో రెండో జాబితా : భట్టి విక్రమార్క

అభ్యర్థుల స్క్రీనింగ్ ముగిసిందని, కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) భేటీలో ఆమోదం తర్వాత త్వరలో రెండో జాబితా విడుదల ఉంటుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చెప్పారు. వామపక్షాలతో చర్చలు కొనసాగుతున్నాయన్నారు. ప్రగతి భవన్, ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాలను బీఆర్ఎస్ రాజకీయ కార్యక్రమాలకు వినియోగించకుండా చూడాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసినట్టు ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. చాలా మంది అధికారులు బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, వారి పేర్లను ఈసీఐకి ఇచ్చామని అన్నారు.

యువత మెదళ్లలో కాషాయం నింపే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

జీవితం, హత్య" అధ్యాయాలను పాఠ్యపుస్తకాలలో కొనసాగిస్తాయని పేర్కొన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒకటవుతున్న ప్రతిపక్షాలు తమ వేదికకు ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంట్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా)గా పేరు పెట్టుకున్న సంగతి తెలిసిందే. దీంతో బీజేపీ ఆగ్రహంతో పాఠ్యపుస్తకాలు, అధికారిక ఆహ్వానాలు, ఇతర ప్రభుత్వ అంశాలలో దేశం పేరును ఇండియాకు బదులుగా భారత్‌గా ముద్రిస్తోందని అన్నారు. సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీని కూడా కేంద్రం తిప్పికొట్టిందని అన్నారు. ఇండియా, భారత్ చర్చలో కాంగ్రెస్, సీపీఐ(ఎం) కూడా ఒకే పక్షంలో నిలిచాయి. కాంగ్రెస్ సీనియర్ నేత కె.సి. వేణుగోపాల్ కూడా ఎన్‌సీఈఆర్‌టీ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం దేశ చరిత్రను వక్రీకరించేందుకు యత్నిస్తోందని అన్నారు. కర్నాటకలోని కాంగ్రెస్, తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వాలు కూడా ఎన్‌సీఈఆర్‌టీ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి. సీపీఐ(ఎం) కూడా ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది. ఉమ్మడి జాబితాలో విద్య అంశాన్ని చేర్చడంతో ఎన్‌సీఈఆర్‌టీ ప్రతిపాదనను వ్యతిరేకించడానికి లేదా ఆమోదించడానికి రాష్ట్రాలను అనుమతిస్తుంది.


ఇంటర్ ఫీజు చెల్లింపు గడువు నవంబర్ 14

(మొదటిపేజీ తరువాయి)

రూ.730 (థియరీకి రూ.510, ప్రాక్టికల్స్‌కు రూ.220) చెల్లించాలని వివరించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఆర్ట్స్ విద్యార్థులు థియరీ సబ్జెక్టులకు రూ.510, సైన్స్ విద్యార్థులు రూ.730 (థియరీకి రూ.510, ప్రాక్టికల్స్‌కు రూ.220) ఫీజు చెల్లించాలని తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు రూ.730 (థియరీకి రూ.510, ప్రాక్టికల్స్‌కు రూ.220) చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు "ఎఐఐవ.ఎర్రప్ర.స్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. అయితే గతేడాది కంటే ఈ ఏడాది పరీక్ష ఫీజు స్వల్పంగా పెరగడం గమనార్హం.

హమాస్ దాడులకు ఆ ఒప్పందం కారణం కావొచ్చు!

- అమెరికా అధ్యక్షులు బైడెన్ వ్యాఖ్యలు



వాషింగ్టన్ : భారత్-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్ ఒప్పందంపై అమెరికా అధ్యక్షులు జో బైడెన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులకు ఈ ఒప్పందం కూడా కారణం అయ్యి ఉండొచ్చని పేర్కొన్నారు. గురువారం ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బెనీస్‌తో కలిసి మీడియాతో ఆయన మాట్లాడుతూ.. హమాస్ దాడుల వెనక భారత్ మిడిల్ ఈస్ట్ యూరప్ ఎకనామిక్ కారిడార్ ప్రకటన కూడా ఒక కారణం అయ్యివుండొచ్చున్నారు. దీనికి సంబంధించిన రుజువులేవీ తమ దగ్గర లేవని, అయితే అది కూడా కారణమని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందం ఇజ్రాయెల్ కోసం, ప్రాంతీయ సమైక్యత కోసం చేపట్టిన పురోగతి అయినందున.. ఎట్టి పరిస్థితుల్లో ఆ కారిడార్ విషయంలో వెనక్కి తగ్గమని బైడెన్ తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన జి-20 సదస్సు సందర్భంగా.. భారత్-మిడిల్ ఈస్ట్-యూరోపియన్ ఎకనామిక్ కారిడార్ కోసం ఎంఓయు జరిగింది. భారత్‌తో పాటు అమెరికా, యుఎఇ, సౌదీ అరేబియా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, యూరోపియన్ యూనియన్‌లు నాటి ఎంఓయుపై సంతకాలు చేశాయి. ఆసియా, పశ్చిమాసియా, మిడిల్ ఈస్ట్, యూరప్ మధ్య ఆర్థిక మెరుగైన అనుసంధానం కోసం.. ముఖ్యంగా ఆర్థిక ఏకీకరణ ద్వారా కారిడార్ ఆర్థిక అభివృద్ధి కోసం ఆయా దేశాలు ఈ ఎంఓయు కుదుర్చుకున్నాయి.

భావితరాలకు ఆదర్శం



గుమ్మడి నర్సయ్య

అణిముత్యాలు...

భోగభాగ్యాలు అనుభవించడానికి ఆయనకు అవకాశం వచ్చింది. కానీ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇంట్లోనే సాదాసీదా జీవితం గడుపుతున్నారు. ఆయన కోరుకుంటే ఇప్పటికీ విలాసవంతమైన బతుకు బతకొచ్చు. కానీ అదనపు విలువను తన చెంతకు చేరనివ్వరు. ఆయన తలుచుకుంటే తన బిడ్డల్ని సంపాదనాపరులుగా తీర్చిదిద్దొచ్చు. అందుకు ససేమిరా అంటారు. నిరుపేదల మధ్య తానూ పేదగానే బతకాలని ముచ్చటపడుతుంటారు. బతికినంత కాలం పేదలకు సేవ చేయడంలోనే ఆనందం ఉందంటారు. పేదల రాజ్యం కోసం లడాయి చేయడమే జీవతాశయమంటారు. ఆయన ఐదు పర్యాయాలు ఇల్లెందు నియోజకవర్గ శాసన సభ్యుడుగా చేశారు. ఆయనే గిరిజనుల ముద్దుబిడ్డ గుమ్మడి నర్సయ్య.

గుమ్మడి నర్సయ్య పేద ఆదివాసి బిడ్డడు. గుమ్మడి లక్ష్మయ్య- చుక్కమ్మ దంపతుల కొడుకు. ఆయన తన పేరు రాసేంతటి చదువును మాత్రమే నేర్చుకున్నారు. చిరుప్రాయంలో పశువులను కాసేవారు. ఈ సందర్భంలోనే సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీతో సంబంధాలు ఏర్పడ్డాయి. 1981లో ఉసిరికాయపల్లి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. పంచాయతీ నిధులను సక్రమంగా సద్వినియోగం చేశారు. గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ప్రజాసమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ వహించారు. గ్రామ ప్రజల మన్ననలు పొందారు. ఈ సమయంలోనే సీతారాంపురం భూస్వాములకు వ్యతిరేకంగా భూపోరాటాలు నిర్వహించారు. పోలీసుల నిర్బంధాలను ఎదుర్కొన్నారు.

తొలిసారిగా 1983 అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందు నియోజకవర్గ అభ్యర్థిగా గుమ్మడి నర్సయ్య పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత వరుసగా 1985, 89, 1999, 2004 తిరిగి గుమ్మడి నర్సయ్య గెలుపొందారు. ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ సమయంలో రాష్ట్రం మొత్తం మీద ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి వెళ్లారు. పౌరహక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలను ఎండగట్టడంలో అసెంబ్లీని వేదికగా చేసుకొని మాట్లాడారు. ఎమ్మెల్యేకు వచ్చే గౌరవ వేతనాన్ని పార్టీకి జమ చేసేవారు. పార్టీ ఇచ్చే అలవెన్స్‌తో జీవనం గడుపుతున్నారు. ప్రభుత్వ పథకంలో భాగంగా వచ్చిన ఇందిరమ్మ ఇంట్లోనే సాదాసీదా వ్యక్తిగా, నిగర్విగా, నిరాడంబరుడుగా జీవనం సాగిస్తున్నారు.

ఓటెయ్యని వారికి...ఫిర్యాదు చేసే హక్కు లేదు

రాజకీయ ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే సాంఘిక, ఆర్థిక, సమానత్వాన్ని సాధించాలని, రాజ్యాంగం లక్ష్యం కూడా అదేనని, రాజకీయ ప్రజాస్వామ్యం సామాన్యులకు అందకపోతే బాధితులు ఈ రాజ్యాంగ వ్యవస్థను కూల్చేస్తారని నవంబర్ 26, 1949న భారత రాజ్యాంగాన్ని పార్లమెంట్‌కు సమర్పిస్తూ అంబేద్కర్ హెచ్చరించారు. అందుకే రాజ్యాంగ ఫలాలు అందరికీ అందాలంటే అందుకోసం పోరాడే వారికే ఓటు వేసి గెలిపించండి.



కరీంనగర్ కోటలో... బీసీల కదన భేరి

2009 ఎన్నికల నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులంతా బీసీలే..

అన్ని పార్టీలనూ ఆదరించిన కరీం'నగరం' ఓటర్లు

బీసీ ఓటర్లదే తీర్పు అయినా మైనార్టీల ఓట్లూ కీలకమే!

ప్రస్తుతం గంగుల వర్సెస్ సంజయ్..

కాంగ్రెస్ అభ్యర్థి తేలితేగానీ చెప్పలేమంటున్న రాజకీయవేత్తలు

తొలి ఎమ్మెల్యేగా వెంకటరామారావు ప్రత్యేకత చాటిన చొక్కారావు



ఉద్యమాల పురిటిగడ్డగా పేరున్న కరీంనగర్‌లో ప్రతి ఎన్నికా ప్రతిష్టాత్మకమేనని చెప్పుకోవచ్చు. ఈ నియోజకవర్గంలో 16సార్లు ఎన్నికలు జరగ్గా.. ప్రతిసారీ విలక్షణమైన తీర్పునిస్తూ నాయకులందరినీ, అన్ని పార్టీలనూ ఆదరించిన చరిత్ర కరీంనగర్‌కు ఉంది. ఈ నియోజకవర్గంలో సింహభాగం ఓసీలే గెలిచి వెలమ కంచుకోటగా నిలిచింది. అయితే, 2009 నుంచి వెలమ కంచుకోటలో బీసీ నేతలు ఎంట్రీ ఇచ్చి కదనభేరీ మోగిస్తూ వస్తున్నారు. మూడు ప్రధాన పార్టీలూ బీసీ అభ్యర్థులనే బరిలో నిలుపుతూ వస్తుండగా.. ఇక్కడి జనం బీఆర్ఎస్ నుంచి గంగులను మూడుసార్లు గెలిపించారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ బీఆర్ఎస్, బీజేపీ నుంచి ఇద్దరు బీసీ నేతలు గంగుల, బండి బరిలోకి దిగుతుండగా.. కాంగ్రెస్ నుంచి కూడా బీసీ అభ్యర్థినే నిలిపే అవకాశాలే మెండుగా ఉన్నాయి. ఏదేమైనా కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో తేలితే... మూడు ప్రధాన పార్టీల మధ్య పోటీ ఉంటుందా? లేక మళ్లీ గంగుల వర్సెస్ బండిగా నిలుస్తుందా? అనేది మరికొన్ని రోజులు వేచిచూడాల్సిందే!

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్ నియోజకవర్గం నుంచి గెలిచిన నేతల్లో పలువురు ప్రముఖులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాజకీయ యవనికపై తమదైన ముద్ర వేశారు. అందులో ఎం.సత్యనారాయణ, జువ్వాడి చొక్కారావు, కటకం మృత్యుంజయం పేర్లు ప్రధానంగా వినిపిస్తాయి. ఎంపీ ఎన్నికల్లో రెండుసార్లు పోటీకి దిగిన కేసీఆర్ ఘన విజయాన్ని సాధించారు. అందులోనూ ఎం.సత్యనారాయణ విసిరిన సవాల్‌తో రాజీనామా చేసి..ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించి తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష స్థాయిని చాటే అవకాశం కేసీఆర్‌కు ఇక్కడి ఓటర్లు కల్పించారు.

అయినప్పటికీ నియోజకవర్గం ఆవిర్భావం నాటి నుంచి భిన్న పార్టీల సభ్యులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకునేందుకు ఇక్కడి ప్రజలు అమితాసక్తిని చూపించిన చరిత్ర కూడా ఉంది. ఒకే వ్యక్తికి రెండు పర్యాయాలు అవకాశమిచ్చినా.. మరో ఎన్నికల్లో వేరే వారిని ఎన్నుకున్నా.. పనితీరు బాగోకుంటే నిర్మోహమాటంగా వేరే అభ్యర్థిని గెలిపించుకున్నా.. అది కరీంనగర్ సెగ్మెంట్ ఓటర్లకే చెల్లింది. ఆరు దశాబ్దాల రాజకీయ పోరును ఆద్యంతం ఆసక్తికరంగా మార్చుతూ ప్రతి ఎన్నికల్లోనూ విజేత ఎవరనే విషయంలో ఇక్కడి ఓటర్లు చివరి వరకూ ఎడతెగని ఉత్కంఠనే చూపిస్తూ వస్తున్నారు.

వెలమ కంచుకోటలో బీసీల ఎంట్రీ..

2009 ఎన్నికల నుంచి ప్రధాన పార్టీల నుంచి బీసీ నేతలే రంగంలోకి దిగుతూ వచ్చారు. మధ్యలో చలిమెడ లక్ష్మినర్సింహారావు పోటీ చేసినా ఆయన ఓటమిపాలయ్యారు. బీఆర్ఎస్ తరపున బరిలోకి దిగిన కాపు సామాజిక తరగతికి చెందిన గంగుల మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవగా.. గౌడ సామాజిక తరగతికి చెందిన పొన్నం ప్రభాకర్ 2009లో కరీంనగర్ ఎంపీగా గెలిచారు. 2014, 2018 ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన కాపు సామాజిక తరగతికి చెందిన బండి సంజయ్ ఓటమి పాలవ్వగా.. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించారు. దీంతో వెలమ కంచుకోటలో ఎదిగిన ఈ బీసీ నేతలే ప్రధాన పార్టీలను నడిపిస్తూ వచ్చారు. ప్రస్తుతం బీఆర్ఎస్ అభ్యర్థిగా గంగుల కమలాకర్, బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్ పేర్లు ఖరారు కాగా.. కాంగ్రెస్ అభ్యర్థి తేలలేదు. అయితే టిక్కెట్ పోటీలో కొత్తజయపాల్‌రెడ్డి, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎమ్మెస్సార్ మనువడు రోహిత్‌రావు ఉండగా.. బీసీ సామాజిక తరగతికి చెందిన పురుమళ్ల శ్రీనివాస్ కూడా టిక్కెట్ ఆశిస్తున్నారు. ఒకవేళ పురుమళ్లకే టిక్కెట్ వస్తే కరీంనగర్ నియోజకవర్గంలో ముగ్గురు 'కాపు'ల మధ్య పోటీ నెలకొననుంది.

16సార్లు ఎన్నికలు.. ఓటర్ల విభిన్న తీర్పులు

1952లో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో గతంలో ఉన్న తిమ్మాపూర్, మానకొండూర్ మండలాలు కొత్తగా ఏర్పడిన మానకొండూర్ నియోజకవర్గంలో కలవడంతో కరీం'నగరం', కొత్తపల్లి, కరీంనగర్‌రూరల్ మండలాలు మాత్రమే మిగిలాయి. మొత్తంగా 16సార్లు ఎన్నికలు జరిగిన ఈ నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీలు సమఉజ్జీలుగానే నిలుస్తూ వచ్చాయి. ఐదుసార్లు కాంగ్రెస్, ఐదుసార్లు టీడీపీ, ఒకసారి స్వతంత్ర్య అభ్యర్థి, మరోసారి సోషలిస్టు పార్టీ, ఇంకోసారి పీడీఎఫ్ నేత, మూడుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థులు ఎన్నికయ్యారు. కరీంనగర్ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా 1952లో పీడీఎఫ్ అభ్యర్థి వెంకటరామారావు విజయం సాధించారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ సీనియర్ నేత జువ్వాడి చొక్కారావును ఇక్కడి ఓటర్లు ముచ్చటగా మూడుసార్లు గెలిపించారు. 1957లో గెలిచిన ఈయన 1967, 1972 సంవత్సరాల్లో విజయం సాధించి కరీంనగర్‌కు సరికొత్త ఖ్యాతిని ఆ కాలంలో అందించేందుకు ప్రత్యేక చొరవ చూపించారు. నిరాడంబరుడిగా, మంచి నాయకుడిగా మన్ననల్ని పొందారు. ఎంపీగానూ మూడుసార్లు గెలిచి సరికొత్త రికార్డునూ తన ఖాతాలో వేసుకున్నారు. 2009 నుంచి బీఆర్ఎస్ అభ్యర్థినే ఇక్కడి ఓటర్లు మూడుసార్లు గెలిపించారు.

ఎమ్మెల్యే భాస్కర్‌రావుకు నిరసన సెగ

- ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని నిలదీత
- యువకుడిపై బీఆర్ఎస్ కార్యకర్త దాడి
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ



నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుకు నిరసన సెగ ఎదురైంది. ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని.. సంక్షేమ పథకాలు అనర్హులకు ఇస్తున్నారని ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే భాస్కరరావును గ్రామస్తులు నిలదీశారు. గురువారం మిర్యాలగూడ మండలంలోని రాయిని పాలెం, ఆలగడప గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆలగడప గ్రామానికి వచ్చిన ప్రగతి యాత్రను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామానికి ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని, సంక్షేమ పథకాలు సొంత పార్టీ కార్యకర్తలకు ఇచ్చుకుంటూ నిజమైన అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇంతవరకు ఇవ్వలేదని, సంక్షేమ పథకాలు ఎవరికిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. వీటిపై ఎమ్మెల్యే భాస్కరరావు సమాధానం చెప్పాలని యువకులు గట్టిగా పట్టుబట్టడంతో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సత్యపాల్ ప్రశ్నించిన యువకులను అడ్డుకున్నారు. ప్రచారాన్ని అడ్డుకుంటే ఊరుకునేలేదని హెచ్చరించారు. పైగా ప్రశ్నించిన యువకుడిపై దాడికి దిగారు. గ్రామస్తులు బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకొని యువకులను అక్కడి నుంచి పంపించి వేయడంతో గొడవ సద్దుమణిగింది. ఎమ్మెల్యే భాస్కరరావు గతంలో అనేక గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాల్లో గ్రామస్తులపై నోరు పారేసుకున్న సంఘటనలున్నాయి. ఆయా సామాజిక తరగతులను కించపరిచే విధంగా మాట్లాడారు. ఇటీవల వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో సంక్షేమ పథకాలపై ప్రశ్నించినందుకు ఆమెను దుర్భాషలాడినట్టు సమాచారం. ఎమ్మెల్యే భాస్కర్ రావు తీరు పట్ల నిరసన వ్యక్తం కూడా చేశారు. భాస్కర్ రావు వ్యవహార శైలి పట్ల నియోజవర్గ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తెలంగాణ ఓటర్ల లెక్కలు

119 నియోజకవర్గాలు....	పోలింగ్ స్టేషన్లు...35,356
మొత్తం ఓటర్లు ... 3.17 కోట్లు	అర్బన్ పీఎస్‌లు..14,464
పురుషులు... 1.58 కోట్లు	రూరల్ పీఎస్‌లు..20,892
మహిళలు.... 1.58 కోట్లు	100 వయసున్న ఓటర్లు...7,689
ట్రాన్స్‌జెండర్లు... 2,557	సగటున ఒక్కో పీఎస్‌లో ఓటర్లు...897
మొదటిసారి ఓటర్లు... 8.11 లక్షలు	80కిపైగా వయస్సున్న ఓటర్లు.. 4.43 లక్షలు
సర్వీసు ఓటర్లు.. 15,338	జెండర్ రేషియో...998
	18-19 వయస్సున్న మహిళా ఓటర్లు....3.45 లక్షలు

వైఎస్ఆర్‌టీపీకి బైనాక్యులర్ గుర్తు కేటాయించిన కేంద్ర ఎన్నికల సంఘం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్ టీపీకి రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఆ పార్టీకి బైనాక్యులర్ గుర్తును కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. కాంగ్రెస్‌లో వైఎస్ఆర్‌టీపీ విలీనానికి సంబంధించి చర్చలు జరిగినప్పటికీ..కాంగ్రెస్‌వైపు నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో రాష్ట్రంలో 119 నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ప్రకటించారు.

తొలి మహిళా హోంమంత్రి



ఉమ్మడి రాష్ట్రంలో ఒకే ఒకసారి మహిళకు హోంమంత్రి పదవి లభించింది. 2009 రాజశేఖరరెడ్డి క్యాబినెట్‌లో చేవెళ్ల చెల్లెమ్మగా పేరుగాంచిన సబితా ఇంద్రారెడ్డి హోంమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమె భర్త ఇంద్రారెడ్డి కూడా 1994లో టీడీపీ ప్రభుత్వంలో హోంశాఖ పదవి చేపట్టారు. భార్యాభర్తలిద్దరూ ఒకే మంత్రిత్వ శాఖ బాధ్యతలు చేపట్టడం కూడా అరుదైనదే.

రన్నింగ్ కామెంట్రీ



మరోసారి మోగిందోయ్
ఎన్నికలకు నగారా
చెట్టు మీంచి ఓట్లు దించి
చెయ్యాలోయ్ దశహరా

ప్రలోభాల ప్రచారాలతో
ప్రతి వీధీ చోర్ బజార్
ప్రజలారా పారాహుషార్
వేసే ముందు సోచో జరూర్

- ఎస్.ఎస్.బి. గేరా

మీకు తెలుసా...



ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రధాన పార్టీలకు ఇండిపెండెంట్ అభ్యర్థులు ఓ సవాల్‌గా నిలుస్తున్నారు. కారణం.. ప్రధాన పార్టీల అభ్యర్థులు బరిలో దిగినప్పటికీ ప్రజాభిమానం సడలని నేతలు కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికల బరిలో దిగి విజయబావుటా ఎగురవేసి తమ సత్తా చాటుకోవడమే. 1952నుంచి ఇప్పటివరకు వరుసగా 10సార్లు జరిగిన ఎన్నికల్లో 15 మంది ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 15 నియోజకవర్గాల్లో 1952లో ఒకరు, 1957,62లతో ఇద్దరు చొప్పున, 1967, 72, 89లో ముగ్గురు చొప్పున విజయం సాధించారు. వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించిన వారే కావడం విశేషం.

పది పోలింగ్ స్టేషన్లకు ఒక సెక్టోరియల్ అధికారి



సెక్టోరియల్ అధికారులకు శిక్షణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరించి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు దృష్టి సారించారు. ఎక్కడ చిన్నపొరపాటు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసేందుకు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియను ఎలా పూర్తిచేయాలో ఇప్పటికే సెక్టోరియల్ అధికారులకు శిక్షణ అందించారు. పది నుంచి 12 పోలింగ్ స్టేషన్లకు ఒక సెక్టోరియల్ అధికారిని నియమించారు. సెక్టోరియల్ అధికారులు జిల్లా మిషనరి, ఆర్.ఓ, పోలింగ్ బూత్ సిబ్బందికి వారధిలాగా పనిచేస్తారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్య తలెత్తినా సెక్టోరియల్ అధికారులే పరిష్కరించాలి. తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌ను కనీసం మూడు సార్లు సందర్శించి ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏ.ఎం.ఎఫ్ (కనీస అవసరాల) పరిశీలించాల్సి ఉంటుంది. దివ్యాంగుల కోసం ర్యాంప్ ఏర్పాటుతోపాటు, ఓటర్లకు తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు, ఇంటర్నెట్, సాకెట్స్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉండే విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలి. తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ సిబ్బంది ఎంతమంది ఉన్నారు, ఎవరెవరు ఏం చేస్తారో పూర్తి సమాచారం సెక్టోరియల్ అధికారుల వద్ద ఉండాలి. పోలింగ్‌కు వారం రోజుల ముందు నుంచి సెక్టోరియల్ అధికారులకు మెజిస్ట్రీయల్ పవర్స్‌ను కల్పించారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా లేదా ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగించినా చర్యలు తీసుకుంటారు.

సెక్టోరియల్ అధికారులకు మెజిస్ట్రీయల్ పవర్స్


స్టిక్కర్ రూపంలో ఓటరు సమాచారం

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు

- నవంబర్ 10 తర్వాత బీఎల్.ఓలు ఓటరు స్లిప్‌లను పంపిణీ చేయనున్నారు. ఈసారి కొత్తగా ఓటరు సంబంధిత సమాచారాన్ని స్టిక్కర్స్ రూపంలో ప్రతి ఇంటికీ అతికించనున్నారు. ఈవీఎం, వి.వి ప్యాట్ రీప్లేస్‌మెంట్, ఓటరు నమోదు శాతం, రిపోర్ట్‌లపై పనిచేయాలి.
- ఈవీఎంల పనితీరుపై ప్రిసైడింగ్ అధికారులు సెక్టోరియల్ అధికారులకు సమాచారం అందింస్తారు. సిబ్బందికి పోలింగ్ రోజు ముందుగా మాక్ పోల్ నిర్వహించాల్సి వుంటుంది. ఈవీఎం, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌లో ఏదైన సమస్య వచ్చినా సంబంధిత సామాగ్రిని మార్చేందుకు అప్పటికప్పుడు చర్యలు తీసుకుంటారు.

ఆడలేక మద్దెల ఓడా అంటున్నావా డ్రామారావు : రేవంత్

ట్వీట్ వార్...



నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్

'నీకు రైతులపై ప్రేముంటే, నవంబర్ రెండులోపు రైతుబంధు డబ్బులు ఇవ్వు. నీకు వృద్ధులపై శ్రద్ధ ఉంటే ఫించన్ ఇవ్వు. నీకు ఉద్యోగులపై బాధ్యత ఉంటే అదే సమయానికి ఉద్యోగులందరికి జీతాలు ఇవ్వు. ఈ విషయాలనే తాము కేంద్ర ఎలక్షన్ కమిషన్‌కు చెప్పాం' అని టీపీసీసీ చీఫ్ రేవంత్ ట్వీట్ చేశారు. ఇదే నీలాంటి వాడిని చూసే... 'నిజం చెప్పులు తొడుక్కునే లోపే... అబద్ధం ఊరంతా తిరిగొస్తుంది' అనే సామెత పుట్టింది. ఆడలేక మద్దెల ఓడు అంటున్నావా డ్రామారావు అని ఎద్దేవా చేశారు. డ్రామాలు ఆపి, నవంబర్ రెండు లోపు లబ్ధిదారులకు నిధులు ఇవ్వు... లేదంటే కాంగ్రెస్ వచ్చిన తర్వాత పెంచిన మొత్తంతో కలిపి ఇస్తుందని తెలిపారు.

కారుకూతల కవిత గారు

'మీరు ఇంతకన్నా దిగజారరు అనుకున్న ప్రతిసారీ ఇంకా దిగజారుతూనే ఉంటారు. మాటల్ని వక్రీకరించడంలో, అసలు సమస్యలను పక్కదారి పట్టించడంలో మీ 'స్కామ్లీ'లో ఎవరూ ఎవరికీ తీసిపోరు. రైతుల సంక్షేమం కాంక్షించే ఏకైక పార్టీ కాంగ్రెస్. రైతు పెట్టుబడి సాయాన్ని మీ రాజకీయ అవసరాల దృష్ట్యా ఆలస్యం చేయకుండా, రైతుల అవసరం దృష్ట్యా అందజే యాలన్నదే కాంగ్రెస్ ప్రధాన డిమాండ్. మీకు రైతులపై కాస్తయినా చిత్తశుద్ధి ఉంటే మా నాయకులు రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేసిన విధంగా, నవంబరు రెండు లోపు రైతులందరికి పెట్టుబడి సాయం విడుదల చేయండి. ఇకనైనా మీరు ఇలాంటి చిల్లర మల్లర రాజకీయాలను ఆపి, గత పదేండ్లలో రైతులకు ఏం చేశారో చెప్పి ఎన్నికల్లో పోరాడండి' అంటూ కాంగ్రెస్ పార్టీ తన ట్వీట్ వేదికగా ఎమ్మెల్సీ కవితకు సూచించింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

గాజాలో మంటగలుస్తున్న మానవత

నెల్లూరు నరసింహారావు

ప్రపంచ సమకం

గాజాపై ఎడతెగకుండా సాగుతున్న ఇజ్రాయిలీ బాంబు దాడులవల్ల అక్కడ నివసిస్తున్న 23 లక్షల పాలస్తీనా వాసుల జీవనం నరకప్రాయంగా మారింది. అధికారికంగా ప్రకటించిన 7000 మరణాలకు అదనంగా 14 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. అక్కడి ప్రజలకు ఆహారం, తాగు నీరు, చమురు అందు బాటులో లేకుండా పోయాయి. ఇజ్రాయిల్ 'ఆకలిని ఆయుధం'గా వాడుతోందని ప్రపంచ స్థాయి చారిటీ సంస్థ ఆక్స్ ఫాం విమర్శించింది. అక్టోబర్ 9వ తేదీ నుంచి కేవలం 2శాతం ఆహార సరఫరా మాత్రమే గాజాను చేరింది.

చమురు కొరత వల్ల, ఇజ్రాయిలీ బాంబింగ్ కారణంగా చెడిపోయిన రోడ్లవల్ల స్థానిక సర ఫరాలను కూడా ప్రజలకందించలేకపోయారు. విద్యుచ్ఛక్తి లేకపోవటంతో రిఫ్రిజి రేటర్లు పని చేయనందున ఆహార పదార్థాలను నిల్వచేయటం కూడా సాధ్యపడటం లేదు. ఇజ్రాయిలీ బాంబింగ్ కారణంగా బేకరీలు, సూపర్ మార్కెట్లు మూతపడ్డాయి. దానితో ఆహారం దొరకటం మరింత కష్టమైపోతోంది. గాజాలో ఒక్కో వ్యక్తికి కేవలం మూడు లీటర్ల నీరు మాత్రమే లభ్యమౌతోంది. మనవ సంక్షోభంలో కూడా ప్రతి మనిషికి 15లీటర్ల నీరు అవసరం ఉంటుందని ఐక్యరాజ్య సమితి చెబుతోంది. అంటే గాజా ప్రజలకు అవసరమైన నీటిలో కేవలం 5వ వంతు మాత్రమే అందుతోంది. రాఫా సరిహద్దు నుంచి సరఫరా అవుతున్న వంట సామాగ్రిని నీటి కొరత ఏర్పడినందున ప్రజలు ఉపయోగించుకోలేక పోతున్నారు. ఆకలిని ఆయుధంగా మార్చటాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ సమర్థించ కూడదని, మానవత్వం మంటగలుస్తుంటే ప్రపంచ నాయకులు చూస్తూ కూర్చోకూడదని ఆక్స్ ఫాం మధ్యప్రాచ్య రీజినల్ డైరెక్టర్ శాల్లీ అబీ ఖలీల్ అన్నారు.



ప్రపంచ నాయకుల్లో ఇజ్రాయిలీ మారణకాండను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పూర్తిగా సమర్థిస్తున్నాడు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌లో కలిసి మాట్లాడుతూ పాలస్తీనా ప్రజలు తమ ప్రతిఘటనకు మూల్యం చెల్లిస్తున్నారని బైడెన్ అన్నాడు. అమెరికా దాని మిత్ర సామ్రాజ్యవాద దేశాలు ఇజ్రాయిల్ కు పూర్తి స్వేచ్ఛనిచ్చాయి. ఆ ప్రాంతంలో అవసరమైతే యుద్ధానికి కూడా సిద్ధపడుతున్నాయి. అమెరికా ఇప్పటికే రెండు విమాన వాహక యుద్ధ నౌకలను ఇజ్రాయిల్‌కు మద్దతుగా పంపింది. ఇరాక్, సిరియా, సౌదీ అరేబియా, కువాయిట్‌లలో తిష్టవేసిన అమెరికా సైన్యాల రక్షణకు 11 క్షిపణి రక్షణ వ్యవస్థలను మోహరించటం జరిగింది. ఇరాన్‌తో యుద్ధం చెయ్యాలనే లక్ష్యంతో అమెరికా ఇదంతా చేస్తోంది. సామ్రాజ్యవాద దేశాలు ఇజ్రాయిల్‌కి ఇచ్చిన అనైతిక స్వేచ్ఛ వల్ల పాలస్తీనాలో ఊహాతీత మానవ సంక్షోభం ఏర్పడింది. ఇందుకు ఉదాహరణగా ఇప్పటివరకు 24మంది జర్నలిస్టులు హతులయ్యారు. నుసైరత్ శరణార్థుల క్యాంపుపై ఇజ్రాయిల్ చేసిన వైమానిక బాంబు దాడిలో గాజా అల్ జజీరా బ్యూరో ఛీఫ్ వాయెల్ దాదౌ తన భార్యను, ఇద్దరు పిల్లలను పోగొట్టుకున్నాడు. రాఫాలో ఐక్యరాజ్య సమితికి చెందిన ఒక పాఠశాలలో తలదాచుకున్న వారికి సమీపంలో బాంబు పేలటం వల్ల విపరీతమైన నష్టం వాటిల్లింది. ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన వ్యవస్థ అంతా పతనం అవటం వల్ల క్షతగాత్రులకు కనీస వైద్య సౌకర్యాలు అందటం లేదు. ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ హాస్పిటల్ ఒక సామూహిక సమాధి అవుతుందని కరెంటు సరఫరాకి అవసరమైన చమురు అందుబాటులో లేకుండా పోయిన స్థితిలో అక్కడ పని చేస్తున్న డాక్టర్ హుస్సమ్ అల సాఫియా అన్నారు. వందలాది క్షతగాత్రులతో, చనిపోయిన పిల్లలతో హాస్పిటల్ నిండిపోయిందని, పరిస్థితి హృదయవిదారకంగా ఉందని ఆమె అన్నారు. ఇటువంటి పరిస్థితి గాజాలోని ప్రతి హాస్పిటల్ ఎదుర్కొంటోంది.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	61,960	▲ 160
22 క్యారెట్లు	56,800	▲ 150
కిలో వెండి	78,000	▲ 500



చికెన్ ధరలు హైదరాబాద్

బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 114
రిటైల్ (లైవ్)	రూ. 136
స్కిన్‌తో	రూ. 197
స్కిన్‌లెస్	రూ. 224

ఎన్నికలు ముంచుకొస్తున్నాయి


- మమ్మల్నేం చేయమంటారు ?
- చంద్రబాబుకు కాసాని అభ్యర్థన
- రాజమండ్రి జైలుకు లేఖ
- పోటీ వద్దనుకుంటే ప్రత్యామ్నాయ ఆలోచన ?

తెలుగు దేశం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణలో ఎన్నికల వాతావరణం ఊపందుకుంది. అన్ని రాజకీయ పార్టీలు ఒకవైపు ఉత్సాహంగా అభ్యర్థులను ప్రకటిస్తూనే మరోవైపు ప్రచారం సైతం నిర్వహిస్తున్నాయి. కప్పదాట్ల జోరు పెరిగింది. అన్నీ పార్టీల్లో హడావిడి కనిపిస్తున్నది. అయితే టీడీపీలో మాత్రం నైరాశ్యం నెలకొంది. పార్టీ అధినేత చంద్రబాబు ఏపీ స్కిల్ స్కామ్ కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న నేపథ్యంలో తెలంగాణ టీడీపీలో రాజకీయ నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వచ్చి దాదాపు మూడు వారాలు దాటింది. నవంబరు 30 పోలింగ్ తేదీగా కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన తరుణంలో తెలంగాణ టీడీపీ సమస్యల్లో ఇరుక్కుపోయింది. పోటీచేసే విషయమై కూడా అనుమానా లు వ్యక్తమవుతున్నాయి. కచ్చితంగా ఎన్నికల బరిలో ఉంటామని ఆ పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నా, ఆచరణలో ఆ కదలికలు కనిపించకపోవడంతో క్యాడర్‌లో అసంతృప్తి కనిపిస్తున్నది.. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఇప్పటికే చంద్రబాబును ఒకసారి జైలులో ములాఖాత్‌కు పోయి కలిసినా స్పష్టత రాలేదు. ఈలోపు ఆపార్టీలో అంతర్గతంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. టికెట్లు, బీ-ఫారాలు అంటూ నేతలు కాసానిపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో శుక్రవారం మరోసారి ములాఖాత్ కోసం వెళ్లాలని కాసాని నిర్ణయించు కున్నారు. ఈమేరకు ఏపీ టీడీపీ నేతలు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో కాసాని రెండు రోజుల క్రితం పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకున్నారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాలకు 89 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. వీటి కోసం సుమారు 189 మంది పేర్లతో జాబితా తయారు చేశారు. చంద్రబాబు కుటుంబ సభ్యులతో శుక్రవారం సాయంత్రం లేదా శనివారం ఉదయం ములాఖాత్‌కు వెళ్లే సమయంలో ఆయనకు నివేదిక అందజేయ నున్నారు. ఈనెల 29లోపు స్పష్టత వస్తుందని కాసాని భావిస్తున్నారు. హైదరాబాద్, ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో మినహా మిగతా అన్ని చోట్లా రంగం లోకి దిగేందుకు సన్నాహాలతో సిద్ధంగా ఉన్నామని చంద్రబాబుకు చెప్పనున్నట్టు సమాచారం. ఈనేపథ్యంలో ఇప్పటికే రాజమండ్రి జైలుకు ప్రత్యేకంగా లేఖ రాశారు. పార్టీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్ ద్వారా ఆ లేఖను గురువారం సాయంత్రం చంద్రబాబుకు అందజేసేలా జైలర్‌కు ఇచ్చారు. నిర్ణయం చంద్ర బాబుకు వదిలేయాలని కాసాని భావిస్తున్నారు. ఓడినా, గెలిచినా రాష్ట్రంలో ఎక్కువ మంది బీసీలకు టికెట్లు కేటాయించాలనే పట్టుదలతో కాసాని ఉన్నారు. ఒకవేళ తెలంగాణలో పోటీ వద్దని చంద్రబాబు చెబితే మాత్రం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేందుకు కాసాని సంసిద్ధులవుతున్నట్టు తెలిసింది.

ప్రపంచ టాప్ వర్సిటీ ర్యాంకుల్లో హైదరాబాద్‌కు చోటు..



న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలను పలు అంశాల వారీగా అంచనా వేసే 'టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరల్డ్ యూనివర్శిటీ ర్యాంకింగ్స్' గురువారం విడుదలయ్యాయి. 2024 ఏడాదికి గాను ఈ ర్యాంకింగ్స్‌లో అమెరికా, యూకేలకు చెందిన ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు టాప్‌లో నిలిచి సత్తా చాటాయి. అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మొదటి రెండు స్థానాల్లో నిలవగా.. బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వర్సిటీలు 4, 5 ర్యాంకుల్లో నిలిచాయి. ఇంపీరియల్ కాలేజ్ లండన్ పదో ర్యాంకులో ఉంది. ఇక భారత్ విషయానికి వస్తే.. మన దేశంలో టాప్ వర్సిటీగా బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నిలిచింది. తెలంగాణ నుంచి ఐఐటీ-హెచ్‌కి ఇంజినీరింగ్ విభాగంలో 201-600 ర్యాంకుల కేటగిరీలో స్థానం లభించింది.

విద్యా కాషాయీకరణ దిశగా మరో అడుగు

ఆర్ఎస్ఎస్ అడుగుజాడల్లో ఎన్‌సీఈఆర్టీ

- ఇండియా స్థానంలో భారత్ పేరు మార్పును వెనక్కి తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో విద్యారంగం కాషాయీకరణ దిశగా మరో అడుగు ముందుకు పడిందని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ విమర్శించింది. పాఠ్యాంశాలను కాషాయీకరణ చేసేందుకు ఆర్ఎస్ఎస్ అడుగుజాడల్లో జాతీయ విద్యా పరిశో ధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) పనిచేస్తున్నదని తెలిపింది. ఇండియా స్థానంలో భారత్ అనే పేరు మార్పు చేయాలన్న నిర్ణయాన్ని ఎన్‌సీఈఆర్టీ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాంఘిక శాస్త్రం సిలబస్ రూపొందించే కమిటీ 12వ తరగతి వరకు అన్ని పాఠ్యపుస్తకాల్లో ఇండియాకు బదులు భారత్ అనే పేరుతో పిలవాలని సూచించిందని తెలిపారు. ఇది భారత రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైందని విమర్శించారు. ఇప్పటికే న్యూఢిల్లీలో జరిగిన జీ-20 సమ్మిట్ సమయంలో చర్చ జరిగిందని గుర్తు చేశారు. ఇందులోనే 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా'కి బదులుగా 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని పంపి వివాదానికి బీజేపీ ప్రభుత్వం తెర లేపిందని విమర్శించారు. దానికి కొనసాగింపు గా విద్యార్థుల పాఠ్యాంశాల్లోనూ ఆర్ఎస్ఎస్ తన ఎజెండాను అమలు చేసేలా చూడ్డానికి ఈ ప్రయత్నం చేస్తోందని తెలిపారు. అందుకే ప్యానెల్ చైర్మెన్ అయిన చరిత్రకారుడు, ప్రొఫెసర్, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త అయిన ఇస్సాక్ (రిటైర్డ్), నేతృత్వంలోని ప్యానెల్ సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాల్లో 'హిందూ పరాజయాలు'పై ఉన్న ప్రాధాన్యతను తగ్గించాలంటూ సిఫారసు చేసిందని పేర్కొన్నారు. ఎన్‌సీఈఆర్టీ సూచనలు భారత రాజ్యాంగ స్ఫూర్తిని విస్మరిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టికల్ 1(1) స్పష్టంగా, ఇండియా అంటే భారత్, రాష్ట్రాల యూనియన్‌గా పేర్కొందని గుర్తు చేశారు. దేశంలో అనేక సంస్థలు, రాజకీయ పార్టీలు 'ఇండియా' పేరు ను చేర్చుకున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ కమిటీ పాఠ్యాంశాల్లో ఇలాంటి సిఫారసు చేయడం గందరగోళాన్ని సృష్టించే అవకాశ ముందని పేర్కొన్నారు. వాస్తవానికి, అధికార బీజేపీకి 'భారత్', ఇండియా రెండింటి పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శిం చారు. ఈ పేరు మార్పు అనేది ప్రధానంగా రాజ కీయ దురుద్దేశాలను రెచ్చగొట్టి వారికి అనుకూలంగా మార్చుకోవాలన్న లక్ష్యంతో బీజేపీ చేసిన వ్యూహమని తెలిపారు. ఎన్‌సీఈఆర్టీ ప్రతిపాదనను తిరస్కరించా లని దేశ ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు.

ఎన్‌సీఈఆర్టీ కమిటీ సిఫారసు ప్రజావ్యతిరేకం

- వాటిని నిర్ద్వందంగా తిరస్కరించాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) నియమించిన కమిటీ పాఠ్యపుస్తకాల్లో ఇండియాకు బదులుగా భారత్ అనే పేరును చేర్చా లంటూ సిఫారసు చేయడం ప్రజావ్యతిరేకమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విమర్శించారు. ప్రాచీన చరిత్ర స్థానంలో పురాతన చరిత్రను చేర్చాలనీ, హిందూ రాజుల విజయాలను చరిత్రలో ఎక్కువగా చెప్పాలని సిఫారసు చేయడం నయవంచనతో కూడినదని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిని పరిశీలిస్తే ఆ కమిటీలో ఒక్కరికీ భారతదేశంపైగానీ, ప్రజల ఆలోచనా విధానంపైగానీ, భారత స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలు, రాజ్యాంగంపై అవగాహ న లేని మూక గుంపుగా పరిగణించాల్సి ఉంటుందని విమర్శించారు.

ఇలాంటి వ్యక్తులతో కమిటీ వేసిన ఎన్‌సీఈఆర్టీ చైర్మెన్, సభ్యులనూ తప్పుపట్టాల్సి వస్తుందని తెలిపారు. విద్యారంగంలో భారత దేశానికి దిక్సూచిగా పని చేయా ల్సిన సంస్థ నేడు మూర్ఖులతో, అజ్ఞానులతో నిండి పోయిందా?అని అనిపిస్తు న్నదని పేర్కొన్నారు. పాఠశాలల్లో ప్రతిజ్ఞా పాఠంలో 'భారత దేశం నా మాతృ భూమి' అంటూ తెలుగులో, 'భారత్ మేరా దేశ్‌హై' అంటూ హిందీలో, 'ఇండియా ఈజ్ మై కంట్రీ' ఇంగ్లీష్‌లో ఉన్నదని గుర్తు చేశారు. రాజ్యాంగం లోనూ ఇండియా, భారత్ అనే రెండు పదాలున్నాయని వివరిం చారు. ఇప్పటి కిప్పుడు ఇండియా పదం పాఠ్య పుస్తకాల్లో కన్పించకూడదంటే సిఫారసు చేసిన ఆ కమిటీ ఏ స్థాయిలో దిగజారిందనేది భావించాలని తెలిపారు.

సమైక్యతకు భంగం కలిగించే సిఫారసులను వెనక్కి తీసుకోవాలి

గతంలో జరిగిన దాన్ని చెప్పే చరిత్ర అంటారని నర్సిరెడ్డి పేర్కొన్నారు. కల్పించి చెప్పేది పురాణమని వివరించారు. చరిత్ర వాస్తవాలను చెప్పాలిగానీ ప్రస్తుత కేంద్ర పాలకులకు ఇష్టమైన రీతిలో చెప్పేది చరిత్ర కాదని తెలిపారు. అలెగ్జాండర్ జీలం నది దాటి పోరస్ రాజును ఓడించడానికి సహకరించింది హిందూ రాజని గుర్తు చేశారు. ఘోరీ మహమ్మద్‌ను 17 సార్లు ఓడించింది, రాజపుత్రులనే చరిత్ర చెప్తుందని వివరించారు. మౌర్యుల చరిత్ర, గుప్తుల చరిత్ర, శాతవాహనుల చరిత్ర, విజయనగర సామ్రాజ్య చరిత్ర చెప్తున్న క్రమంలోనే మొగలుల చరిత్రనూ చెప్పాల్సి వస్తుందని తెలిపారు. శివాజీ చరిత్రను చెప్తున్నామని పేర్కొన్నారు.

ప్రస్తుతమున్న పాఠ్యపుస్తకాల్లో జరిగిన చరిత్రనే నేర్చారని వివరించారు. ఏ రాజు విజయం సాధిస్తే వారిపేరే చరిత్రలో ఉందని తెలిపారు. కాకతీయుల చరిత్ర, పాండ్యుల చరిత్ర, చోళుల చరిత్ర, కుతుబ్‌షాహీల చరిత్ర, అసఫ్‌జాయ్‌ల చరిత్ర అంటూ చదువుకుంటున్నామని పేర్కొన్నారు. ఇది వాస్తవమని వివరించారు. ఎక్కడ హిందూ రాజుల చరిత్ర, ముస్లిం రాజుల చరిత్ర అంటూ ఆనాడు లేదని తెలిపారు. లేనిది చేర్చాలంటూ కమిటీ సిఫారసు చేయడమంటే వారికి పిచ్చి పట్టి ఉండాలనీ, లేదంటే ఆ కమిటీ పిచ్చోళ్ల చేతుల్లోనైనా ఉండాలని విమర్శించారు. దేశ సమైక్యతకు భంగం కలిగించే ఇలాంటి సిఫారసులను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇన్సాస్ బుల్లెట్లు గాయబ్

- 48 గంటల్లో రికవరీ
- ఇద్దరి నిందితుల అరెస్టు
- రైల్వే అదనపు డీజీ శివధర్‌రెడ్డి వెల్లడి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి గాయబ్ అయిన ఇన్సాస్ బుల్లెట్లను 48 గంటల్లోనే రైల్వే పోలీసులు రికవరీ చేశారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు రాష్ట్ర రైల్వే పోలీసు విభాగం అదనపు డీజీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 24న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని పదో ప్లాట్‌ఫామ్‌పై సీఆర్పీఎఫ్ 95వ బెటాలియన్‌కు చెందిన సిద్దార్థ్‌సింగ్ తన ఆయుధాల లగేజ్‌ను ఉంచాడు. లగేజ్‌ను కొద్దిసేపటి తర్వాత సిద్దార్థ్ సింగ్ చెక్‌చేసుకోగా అందులో నుంచి ఇన్సాస్ తుపాకీకి సంబంధించిన 63 బుల్లెట్లతో పాటు మూడు మ్యాగ్జిన్లు కనిపించకుండా పోయాయి. దీనిపై సిద్దార్థ్‌సింగ్ సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వీటిని వెతకడానికి సికింద్రాబాద్ రైల్వే పోలీసుతో పాటు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌కు సంబంధించిన టీమ్‌లను అధికారులు రంగంలోకి దించారు. పదో ప్లాట్‌ఫామ్‌పై ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా ఒక వ్యక్తి బుల్లెట్లు, మ్యాగ్జిన్లను తీసుకెళ్లటం కనిపించింది. దాని ఆధారంగా దర్యాప్తు జరిపిన పోలీసులకు గాంధీనగర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఆ బుల్లెట్లను ఎత్తుకుపోయిన వ్యక్తి పట్టుబడ్డాడు. అతని పేరు దానమూర్తిగా గుర్తించిన అధికారులు విచారించగా వాటిని తాను గాంధీనగర్ మెట్రో రైల్వే స్టేషన్ దగ్గరే పారేసినట్టు తెలిపారు. అక్కడ గాలించిన పోలీసులకు బుల్లెట్లు లభించకపోవటంతో అక్కడి సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అందులో ఒక వృద్ధుడు వాకింగ్ కోసం వచ్చి బుల్లెట్లతో పాటు మ్యాగ్జిన్లను తీసుకెళ్లినట్టు కనిపించింది. ఎర్రటి షర్ట్ వేసుకొని వచ్చిన ఆ వ్యక్తి కోసం పోలీసులు సమీపంలోని భోలక్‌పూర్ బస్తీలో విచారించగా.. అతను సత్యనారాయణ అనే వ్యక్తిగా తేలింది. బస్తీవాసులు ఇచ్చిన ఆచూకీని ఆధారంగా సత్యనారాయణను పోలీసులు పట్టుకొని అయన వద్ద నుంచి ఇన్సాస్ బుల్లెట్లతో పాటు మ్యాగ్జిన్లను రికవరీ చేశారు. వీరిద్దరినీ అరెస్టు చేసి కేసును సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ షేక్ సలీమా నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ కృష్ణ దర్యాప్తు జరుపుతున్నట్టు రైల్వే విభాగం అదనపు డీజీ శివధర్‌రెడ్డి తెలిపారు.

8 మంది భారత నేవీ మాజీ అధికారులకు మరణ శిక్ష

- ఖతర్ కోర్టు తీర్పు
- కేంద్ర విదేశాంగశాఖ దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ : భారత నౌకాదళానికి చెందిన ఎనిమిది మంది మాజీ అధికారులకు ఖతర్ కోర్టు గురువారం మరణ శిక్ష విధించింది. వీరంతా కొన్ని నెలల నుంచి ఖతర్ అధికారుల నిర్బంధంలో ఉన్నారు. గూఢచార్యం ఆరోపణలపై వీరికి కోర్టు మరణ శిక్ష పడినట్లు సమాచారం. ఎనిమిది మంది భారతీయుల కు ఖతర్ కోర్టు మరణ శిక్ష విధించడంపై కేంద్ర విదేశాంగశాఖ స్పందించింది. 'మేము తీవ్ర దిగ్భ్రాంతి కి గురయ్యాం, వివరణాత్మక తీర్పు కోసం ఎదురు చూస్తున్నాం' అని ఒక ప్రకటనలో తెలిపింది. 'అల్ దహ్రా కంపెనీకి చెందిన 8 మంది భారతీయ ఉద్యోగులకు సంబంధించిన కేసులో ఖతర్ ఫస్ట్ ఇన్‌స్టాన్స్ కోర్టు ఈ రోజు తీర్పు వెలువరించినట్లు మాకు ప్రాథమిక సమాచారం ఉంది' అని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.'బాధిత కుటుంబ సభ్యులు, న్యాయ బృందంతో సన్నిహితంగా ఉన్నాము, అన్ని చట్టపరమైన ఎంపికలను అన్వేషిస్తున్నాం' అని భారత విదేశాంగశాఖ తెలిపింది. ఈ కేసుకు అధిక ప్రాముఖ్యత ఇస్తున్నట్లు, సన్నిహితంగా పరిశీలి స్తున్నట్లు తెలిపింది.

ఈ కేసు గోప్యత స్వభావం కారణంగా, మరిన్ని వివరాలు చెప్పడం సరికాదని తెలిపింది. కాగా, భారత నేవీ మాజీ అధికారులు కెప్టెన్ నవతేజ్ సింగ్ గిల్, కెప్టెన్ బీరేంద్ర కుమార్ వర్మ, కెప్టెన్ సౌరభ్ వశిష్ట్, కమాండర్ అమిత్ నాగ్‌పాల్, కమాండర్ పూర్ణేందు తివారీ, కమాండర్ సుగుణాకర్ పాకాల, కమాండర్ సంజీవ్ గుప్తా, నావికుడు రాగేష్‌ను ఖతర్ ఇంటెలిజెన్స్ సర్వీస్ గతేడాది ఆగస్టు 30న దోహాలో అరెస్టు చేసింది. అయితే వీరిపై అభియోగాలు ఖతర్ అధికారులు వెల్లడించలేదు. సబ్‌మెరైన్ కార్యక్రమాల్లో గూఢ చార్యానికి పాల్పడ్డారనే ఆరోపణలతో వీరిని నిర్బంధించినట్లు సమాచారం. అరెస్టయిన వారంతా అల్ దహ్రా సంస్థలో పనిచేస్తున్నారు. ఖతర్ సాయుధ దళాలకు శిక్షణ, ఇతర సేవలు అందించే ఈ సంస్థను ఒమన్‌కు చెందిన ఒక మాజీ వైమానిక దళం అధికారి నిర్వహిస్తున్నారు.

అరెస్టయిన మాజీ అధికారులకు భారత అధికారులతో మాట్లాడేందుకు ఖతర్ అనుమతి ఇచ్చింది. వీరితో విదేశాంగశాఖ అధికారులు మాట్లాడటంతోపాటు ఖతర్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. అలాగే పలుమార్లు బెయిల్‌కు కూడా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. వీరి నిర్బంధాన్ని ఖతర్ ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే ఎనిమిది మందికి గురువారం ఖతర్ న్యాయస్థానం మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది.

బిజినెస్

కుప్పకూలిన మార్కెట్లు

- సెన్సెక్స్ 900 పాయింట్ల పతనం
- రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరి
- ఏ దశలోనూ కోలుకోని సూచీలు
- బోరుమన్న మదుపర్లు



న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వరుస గా ఆరో రోజూ నేల చూపులు చూశాయి. గురువారం సెషన్‌లో నూ సూచీలు అమ్మ కాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఉదయం నష్టాలతో ప్రారంభమైన షేర్లు.. ఏ దశలోనూ కోలుకోలేదు. బేర్ పంజాతో ఒక్క పూటలో లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరయ్యింది. తుదకు సెన్సెక్స్ 901 పాయింట్లు క్షీణించి 63,148కి పతనమయ్యింది. నిఫ్టీ కూడా 265 పాయింట్ల నష్టంతో 18,857కు పడిపోయి.. నాలుగు మాసాల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్ ఉదయం 63,774.16 వద్ద ప్రారంభం కాగా.. ఇంట్రాడేలో 63,903 కనిష్ట స్థాయిని చవి చూసింది. విద్యుత్ రంగ సూచీలు మినహా మిగితా అన్ని రంగాలు పతనమయ్యాయి. ఒక్క పూటలోనే బిఎస్ఇ మార్కెట్ కాపిటలై జేషన్ రూ.323.8 లక్షల కోట్ల నుంచి రూ.306 లక్షల కోట్లకు పడిపో యింది. దీంతో దాదాపు రూ.3 లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. ఇంత క్రితం ఐదు సెషన్లలో రూ.14.6 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది.

ఇజ్రాయిల్ - హమాస్ ఆందోళనకు తోడు, అమెరికన్ బాండ్లపై రాబడుల పెరుగుదల పెరగడం, ఎఫ్ఐఐలు తరలిపోవడం తదితర అంశాలు భారత మార్కెట్ల పతనానికి ప్రధాన కారణంగా ఉన్నాయి. యుద్ధం లో పశ్చిమాసియాలోని కొన్ని దేశాలు భాగస్వామ్యం కావడంతో పరిస్థితి మరింత తీవ్రతకు దారి తీస్తోంది. ఈ పరిణామాలు అంతర్జాతీయ మార్కెట్ల ను ప్రభావితం చేస్తున్నాయి. ఆ ప్రభావం భారత ఈక్విటీ మార్కెట్లపైనా పడుతోంది. అమెరికా వడ్డీ రేట్ల పెంపు సంకేతాలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని మరింత దెబ్బతీస్తున్నాయి. భారత ఈక్విటీ మార్కెట్లలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఆటో, మెటల్ రంగాల్లో అధికంగా అమ్మకాలు చోటు చేసుకున్నాయి. సెన్సెక్స్-30 ఇండెక్స్‌లో ఐదు షేర్లు మాత్రమే లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, ఐటిసి, హెచ్‌సిఎల్ టెక్, ఎన్‌టిపిసి, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు రాణించాయి. ఎంఅండ్ఎం, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, నెస్లే ఇండియా, టైటన్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, టెక్ మహీంద్రా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మారుతీ, టాటా మోటార్స్ షేర్లు అత్యధికంగా 4 శాతం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బిఎస్ఇలో దాదాపు 1211 సూచీలు లాభపడగా.. 1943 స్టాక్స్ నేల చూపు లు చూశాయి. మరో 101 సూచీలు యథాతథంగా నమోదయ్యాయి.

రూ.3వేల కోట్ల నిధులను సమీకరించిన ఓలా ఎలక్ట్రిక్

బెంగళూరు : ప్రముఖ ద్విచక్ర విద్యుత్ వాహనాల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ రూ.3,000 కోట్ల నిధులు సమీకరించినట్లు గురువారం వెల్లడించింది. టెమాసెక్ నేతృత్వంలోని ఇన్వెస్టర్లతో పాటు బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) నుంచి ఈ మొత్తాన్ని అందుకోనున్నట్లు వెల్లడించింది. నిధుల సమీకరణ ప్రక్రియ పూర్తయ్యిందని పేర్కొంది. ఈ నిధులను వ్యాపార విస్తరణకు ఉపయోగించనున్నట్లు తెలిపింది. అదే విధంగా తమిళనాడులోని కృష్ణగిరిలో లిథియం ఐయాన్ సెల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని వెల్లడించింది. భవిష్యత్తులో ఈ సంస్థ ఇవి సైకిళ్లు, కార్లు విభాగంలోకి ప్రవేశించనుంది.

సిఎస్ఆర్‌తో 60 లక్షల మందికి సాయం

- టాటా మోటార్స్ వెల్లడి

ముంబయి : దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తన 9వ వార్షిక సిఎస్ఆర్ రిపోర్ట్‌ను విడుదల చేసింది. ఆరోగ్యం, విద్య, పర్యావరణ రంగాల్లోని సామాజిక సవాళ్లను పరిష్కరించేందుకు విస్తృత ప్రయత్నాలు చేసినట్లు పేర్కొంది. ఈ క్రమంలోనే కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద గత 10 ఏళ్లలో 60 లక్షల మందికి ప్రయోజనం కల్పించినట్లు వెల్లడించింది.

యుపిఐ చెల్లింపులకే ప్రాధాన్యత

- ఆన్‌లైన్ కొనుగోళ్లలో తగ్గుతున్న డెబిట్ కార్డులు


న్యూఢిల్లీ: ఆన్‌లైన్ కొనుగోళ్లలో యుపిఐ చెల్లింపులకే వినియోగదారులు ఎక్కువ మొగ్గు చూపుతున్నారని ఆర్‌బిఐ విశ్లేషించింది. డెబిట్ కార్డుల వినియోగం క్రమంగా తగ్గుతోందని పేర్కొంది. గతేడాది ఏప్రిల్‌లో ఇ-కామర్స్‌లో డెబిట్ కార్డుల లావాదేవీల సంఖ్య 11.7 కోట్లుగా ఉండగా.. ఇది 2023 సెప్టెంబర్ నెలలో సగానికి పైగా తగ్గి 5.1 కోట్లకు పడిపోయింది. లావాదేవీల విలువ మొత్తం రూ.21,000 కోట్ల నుంచి రూ.16,127 కోట్లకు తగ్గింది. అదే సమయంలో యుపిఐ చెల్లింపులు 22 లక్షల నుంచి ఏకంగా 61 లక్షలకు చేరింది. తక్కువ మొత్తం చెల్లింపులకు చాలా మంది యుపిఐ వైపు ఆసక్తి చూపుతున్నారు.

ఏథర్ ఎనర్జీ ఎక్సేంజీ ఆఫర్లు

న్యూఢిల్లీ : ఏథర్ ఎనర్జీ తన ద్విచక్ర ఇవిలపై పండుగ సీజన్ సందర్భంగా ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు తెలిపింది. వినియోగదారులు ఏథర్ 450ఎస్, 450ఎక్స్‌లను కొనుగోలు చేయడానికి ఇతర వాహనాలను ఎక్సేంజీ చేయడం ద్వారా రూ.40వేల వరకు బెనిఫిట్స్ పొందవచ్చని తెలిపింది. ఎక్సేంజీ విలువతో పాటు ఫెస్టివ్ బెనిఫిట్ కింద రూ.5వేల వరకు, రూ.1500 తగ్గింపు, రూ.6వేల వరకు ఇఎంఐ క్యాష్‌బ్యాక్ ఆఫర్లను అందిస్తున్నట్లు వెల్లడించింది. 5.99 వడ్డీ రేటుతో 24 నెలల ఇఎంఐ సదుపాయాన్ని ఎంచుకోవచ్చని పేర్కొంది.

రాష్ట్రంలో టివిల అమ్మకం ఎక్కువే..

- అమెజాన్ ప్రతినిధి రంజిత్ బాబు వెల్లడి



హైదరాబాద్: తెలంగాణలో టివిల అమ్మకాలు ఎక్కువగా జరుగు తాయని అమెజాన్ ఇండియా స్మార్ట్‌ఫోన్స్ అండ్ టెలివిజన్స్ డైరెక్టర్ రంజిత్ బాబు అన్నారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడు తూ.. పండుగల సమయంలో టివిల విక్రయాల్లో రెండు రెట్ల వృద్ధి చోటు చేసుకుందన్నారు. 5జి స్మార్ట్ ఫోన్స్ విక్రయాల్లో 60 శాతం వృద్ధిని నమోద వుతుందన్నారు. అక్టోబర్ 26 నుంచి అమెజాన్ ఎక్స్‌పీరియన్స్ ఎరీనాతో ప్రత్యేక రాయితీలు అందిస్తు న్నామన్నారు. నో కాస్ట్ ఇఎంఐ, బ్యాంక్ డిస్కౌంట్‌లు, రివార్డ్స్, క్యాష్‌బ్యాక్, ఎక్చేంజ్ ఆఫర్లను అందిస్తున్నామన్నారు.

ఎస్కాప్‌కు ఎంపికైన సిడ్స్ ఫార్మ్

బెంగళూరు : ప్రీమియం డెయిరీ బ్రాండ్ అయిన సిడ్స్ ఫార్మ్ తాజాగా యునైటెడ్ నేషన్స్ ఎకనామిక్ అండ్ సోషల్ కమిషన్ ఫర్ ఆసియా అండ్ పసిఫిక్ (ఎస్కాప్)కు చెందిన ఇన్‌క్లూజివ్ బిజినెస్ ప్రోగ్రాంలో పాల్గొనడానికి ఎంపికైనట్లు తెలిపింది. ఇందుకోసం ఎకోసియేట్ ఎండెవా (కోచ్)తో అవగాహన ఒప్పందం కుదిరినట్లు పేర్కొంది. ఇన్‌క్లూజివ్ బిజినెస్ ప్రోగ్రాం కింద "చిన్న కమతాల డెయిరీ రైతుల పాల ఉత్పాదకతను వార్షికంగా 1.2 రెట్లు మెరుగుపరచడం" పేరుతో ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొంది. ఈ అవకాశం లభించడం తమకు ఎంతో గౌరవమని సిడ్స్ ఫార్మ్ వ్యవస్థాపకుడు కిషోర్ ఇందుకూరి పేర్కొన్నారు.